
ఆంధ్రప్రదేశ్



ఆనంద గ్రంథిరేకోఽయం
అపత్యమితి కథ్యతే — భవభూతి,

డిశంబరు, 1964
25 పైసలు



ఆంధ్రప్రదేశ్

సంపుటి : 9 | ప్రధాన సంపాదకుడు : టి. రామచంద్రరావు | మార్గశిర - పుష్య 1886 శకం

సంచిక : 2 | సంపాదకుడు : కప్పగంతుల లక్ష్మణశాస్త్రి | డిశంబరు, 1964

విషయ సూచిక

ఆనంద గ్రంథిరేకోఽయమ్
అపత్యమితి కథ్యతే.

—భవభూతి

దంపతుల ఆనందమును ఒకటిగా ముడివేయునది అపత్యము.

ఫోటో : ఎస్. ఆర్. కే. రావు.

రెండవ కవరు పేజి : రేపు మనదే

మూడవ కవరు పేజి : కులాసా ప్రయాణం.

ఫోటోలు : నందగోపాల్, సయిదుద్దీన్, డి. ఎస్. నాయుడు.

చివరి అట్ట : నీళ్ళల్లో మొలిచిన నక్షత్రాలు

ఫోటో : డి. ఎస్. నాయుడు.



ముఖ్యమంత్రి లేఖ

ప్రియమైన చదువరీ !

ఈ నెల నా లేఖలో చైనా అణుబాంబు ప్రయోగాన్ని గురించి వ్రాయదలచాను. విశేషప్రాధాన్యంగల ముఖ్య సంఘటన ఇది.

చైనా చాలాకాలంగా సామ్రాజ్య విస్తరణ విధానాన్ని అనుసరిస్తున్నది. రాజ్య విస్తరణకాంక్షతో గతంలో చైనా అనేక దేశాలతో పోరాటాలు జరిపింది. అక్కడ కమ్యూనిస్టుపాలన ఏర్పడిన తరువాత తాత్కాలికంగా స్తబ్ధత ఏర్పడింది. ఈ పరిస్థితిని పురస్కరించుకొని చైనా శాంతియుత సహజీవన విధానాన్ని అనుసరించ గలదని అందరూ ఆశించారు. కాని ఈ ఆశలన్నీ అడియాసలయ్యాయి. ఈనాడు చైనా, తన పొరుగునవున్న శాంతికాముక దేశాలైన ఇండియా, రష్యాలతో సరిహద్దు సమస్యలపై పోరాటానికి దిగింది.

ఆసియా అంతటిలోకీ అప్రతిహతమైన సైనికశక్తిగా రూపొందాలన్నదే ఈనాడు చైనా ఏకైకలక్ష్యం. ఇది ఇతర ఆసియా దేశాలనేకాక ప్రపంచమంతటికీ తన శక్తినీ, అణ్వస్త్రపాటవాన్నీ ప్రదర్శించి భయపెట్ట చూస్తున్నది.

శాంతికాముక అలీనదేశాలవారు ఇటీవల కెయిరోలో సమావేశమై, ప్రస్తుత ప్రపంచ పరిస్థితిని మెరుగుపరచడానికి వివిధ సాధనోపాయాలను చర్చించారు. యుద్ధ ప్రమాదాన్ని నివారించడానికి వారు అవిరళకృషి జరుపుతున్నారు. అలీన రాజ్యాలవారు కెయిరోలో చేసిన ప్రకటనలో సిరాఅయినా ఆరకముందే చైనా తన అణుబాంబును ప్రేల్చి వాటిపట్ల అగౌరవం వెల్లడించింది. పైగా ప్రపంచ శాంతికొరకే తాను ఈ బాంబును ప్రేల్చినట్లు వింత ప్రచారం సాగించింది చైనా.

ఈ అణుబాంబు ప్రయోగాన్ని తొలుదొల్తగా నిరసించినదేశం జపాను. లోగడ జపాను ఈ విధ్వంసకాండ పర్యవసానాన్ని ప్రత్యక్షంగా అనుభవించింది. అది ఆ దేశస్థులకు ఒక పీడకల వంటిది. అణుబాంబుల వాతబడిన నాగసాకి, హిరోషిమా పట్టణాల భీకర, భీభత్సదృశ్యాలు, సంఘటనలు వారి స్మృతిపథంలోనుంచి మాసిపోలేదు. అందుచేత చైనా జరిపిన ప్రయోగాలపట్ల మొట్టమొదట జపానుప్రభుత్వం తీవ్ర అసమ్మతిని ప్రకటించడంలో ఆశ్చర్యంలేదు. చైనా అణుబాంబు ప్రయోగాన్ని గర్హిస్తూ జపానులో అనేక ప్రదర్శనలు జరిగాయి. చైనా చర్యను ఖండిస్తూ జపానులోని ప్రధాన రాజకీయ పక్షాలన్నీ ప్రకటనలుచేశాయి. నాగసాకి పౌరులుకూడా తమ నిరసన తెలుపుతూ చైనాకు కేబిల్ పంపారు.

అణ్వస్త్ర నిషేధం ఒప్పందానికివిరుద్ధంగాను, ప్రపంచాభిప్రాయానికి వ్యతిరేకంగాను చైనా అణ్వస్త్ర పరీక్ష జరపడం ప్రపంచ

సంస్థఅయిన ఐక్యరాజ్యసమితిలో తీవ్ర విచారానికి దారి తీసింది. ప్రత్యేకంగా జనరల్ అసెంబ్లీ తీర్మానం దృష్ట్యా చైనా చర్య విచారించ దగిందనీ, ఖండించదగిందనీ ఐక్యరాజ్య సమితి సెక్రెటరీ జనరల్ అన్నారు. యీ పరీక్ష, శాంతి ప్రయోజనాల పరిరక్షణకు విరుద్ధమైన విధానాలను, ప్రతిబింబిస్తుందని అమెరికా ప్రెసిడెంటు శ్రీ లిండన్ బి. జాన్సన్ అభివర్ణించారు. యీ అణ్వస్త్ర పరీక్ష తీవ్ర ఆందోళన కలిగించిందనీ, ప్రపంచ ఆశను వమ్ము చేసిందనీ, ప్రపంచ అభిప్రాయానికి విరుద్ధంగా చైనా మరింత ఏకాకి అయిపోయిందనీ కెనడా ప్రభుత్వం అభిప్రాయ పడింది. క్రొత్తగా స్వాతంత్ర్యాన్ని పొందుతున్న ఆసియా, ఆఫ్రికా దేశాల అభిప్రాయాలనూ, ఆశయాలనూ వ్యర్ధపరచాలన్న చైనీయుల దుర్బుద్ధిని యీ పరీక్ష వ్యక్తం చేస్తున్నదని యుగోస్లావియా అభిప్రాయ పడింది. తమ రాజకీయ ఆశయాల సిద్ధికై చైనా అణు బాంబును ఉపయోగించ వచ్చునని నార్వేవిదేశాంగమంత్రి అన్నారు. అద్యతన భావిలో అంతర్జాతీయ రంగంలో చైనా యిప్పటికన్నా మరింత దుడుకుతనంతోనూ, దర్పంతోనూ వ్యవహరించ వచ్చునని ఆయన అన్నారు.

చైనా అణ్వస్త్ర పరీక్షవల్ల ఉత్పన్నమైన అన్ని అంశాలను, భారత అణు విధానాన్ని మన అధినాయకులు పరిశీలించారు. మన ప్రధానమంత్రి ఇటీవల లోకసభలో ప్రసంగిస్తూ మన ప్రియతమ నాయకుడు, కీ. శే. నెహ్రూ నిర్దేశించిన భారత ప్రభుత్వ ప్రస్తుత విధానం మన దేశానికి లాభప్రదమే గాక ప్రపంచ శాంతికి దోహదం చేసేదనీ అందువల్ల ఆ విధానాన్ని కొనసాగించుటకే తాను సుముఖుడనని ఆయన అన్నారు. అయితే ఆ విధానం ప్రస్తుతం మారుతున్న పరిస్థితులతో ప్రమేయంలేకుండా అన్ని వేళలా పరుషంగా ఉంటుందనే ప్రశ్న యేమీలేదు అని ఆయన అన్నారు.

ప్రపంచశాంతిని పరిరక్షించాలంటే ఐక్యరాజ్యసమితి, చైనా అణు పరీక్ష ఉపద్రవాన్ని ఎదుర్కోవాలని మన ప్రధాన మంత్రి సూచించారు. భారతదేశం ఐక్యరాజ్యసమితిలో యీ ప్రశ్నను లేవనెత్తుతుందని ఆయన అన్నారు. ఆఫ్రికా దేశాలతోసహా యితర శాంతికాముక దేశాలన్నీ యీ విషయాన్ని జాగ్రత్తగా ఆలోచిస్తాయనే ఆయన ఆశిస్తున్నారు.

అందువల్ల అణ్వస్త్రాలను నిర్మించే పోటీలో భారతదేశం పాల్గొనడం ఆత్మహత్యాసదృశమే అవుతుంది. మనచుట్టూ జరుగుతున్న అనూహ్యమైన మార్పులను మనం అతిజాగరూకులమై పరిశీలించడం చాలా అవసరం.

రెండు సంవత్సరాల క్రితం మన సరిహద్దుల్లో చైనా చేసిన దురాక్రమణను మనం అద్భుత ధైర్యసాహసాలతో ఎదుర్కొన్నాము. మన జన్మభూమి గౌరవాన్ని కాపాడడానికి మన జాతి అంతా ఏకోన్ముఖంగా కృషిచేసింది. యీ అణ్వస్త్ర ప్రమాదం మనను ఏ మాత్రం భయపెట్టజాలదు. అంతేగాక శాంతిపరిరక్షణకు నిర్దేశించబడిన మన విధానాలను, కార్యక్రమాలను కూడా యిది మార్చజాలదు. ప్రపంచదేశాలలో భారతదేశం పటిష్ఠంగా ఉండడానికి వీలుగా అన్ని రంగాలలో ఇతోధిక ఉత్పత్తికి మన శక్తినంతా వినియోగించి కృషిచేద్దాం.

జైహింద్



ఆంధ్ర ప్రదేశ్

దూపాటి సంపత్కుమారాచార్య

మ. ఇది మా యాంధ్రుల నోముపంట, జనయి
త్రీ పాదపీఠమ్ముపై
హృదయమ్ముల్ పదిలమ్ము చేయగలిగెన్
ఈ విశ్వరంగమ్ములో
ఇది మా యాంధ్రులు ముక్తకంఠమున జా
తీయైక విజ్ఞాన సం
పదలన్, ప్రాక్తన పుణ్యభాగ్యముల సం
పాదింపగా - పర్వమే॥

ఉ. ఈ శుభవేళ గాత్రము ల
యించి మహాభ్యుదయైక రాగ వి
న్యాసము సల్పుకొన్నది మ
హాంధ్రజనావళి, యైకమత్య వి
ద్యాసము పేతులై, వెలయ
నై నవి నవ్యత చిందిపోవగా
ఆ సరసోక్తిమాధురులు -
అప్పటి శిల్పకళా విశిష్టతల్.

సీ. బమ్మెరపోతన బంగారు గంటాన
రాలుచున్నది మకరందరసము!
త్యాగయ్య గొంతులో ధారలై కాల్వలై
కదలుచున్నయది రాగామృతమ్ము!
అమరావతీస్తూప సముదయమ్మున సుధల్
చిందుచున్నవి నవ్యశిల్పకళలు!
కృష్ణరాయల సభా గేహాళిలోన వి
రియుచుండె కావ్య పరిమళములు

నాఁటి లలితకళాజీవనసకలమ్ము
నేఁటికిని సజీవము; ఇద్ది నిజ మటంచు
ఆంధ్ర రాష్ట్రావతరణ శుభావసరము
దిక్కులం చాటి చెప్పును! తెలుగు కీర్తి.

గీ. ఆ పురా శిల్ప సంపత్తి - ఆ కళామృ
త ప్రవాహముల్ ఇక శాశ్వతమ్ములగుచు
తేజరిల్లగ నాశీర్వదింపుమమ్మ!
దీప్తులందించి, ఆంధ్రప్రదేశ! లక్ష్మి.

గీ. మూడుకోట్ల మెట్ల నిక సమూహపరచి
మ్రోగజేయుము నీ యనురాగ వీణ!
దిగ్దిగంతాలు గలిసి కీర్తించినట్లు.
స్థిరయశమ్మున నాంధ్రప్రదేశ లక్ష్మి!!

సీ. ఎలుఁగెత్తి చాటుమా తెలుఁగు వీరుల గాథ
పలనాటి వీరుల ప్రతిభఁ దెలిపి
గాండ్రించి తెలుపు! పరప్రభుత్వము చెల్ల
నిదని బొబ్బిలిపులిన్ నిదుర లేపి!
ధట్టించి పలుకు! మాంధ్రత్యాగ మహిమ సీ
తారామరాజు - సంస్తవ మొనర్చి!
హుంకరింపుము స్వజాత్యుద్దండతల; నాంధ్ర
కేసరుల్ జగము నూగించునట్లు!

తెలుపరా! మనజాతి విస్తీర్ణయశము!
పలుకరా! లలితకళా ప్రభావ మెల్ల!
చిలుకరా! తేనియలు పొంగఁజేసి విశ్వ
సకలమునను, ముక్కోటి గొంతుకలు! గలిపి!
నేఁడెగా! మహాపర్వ మీనాఁడె సఖుఁడ!

భూగర్భ జల జ్ఞాన శాస్త్రము

గరిగిపాటి రామమూర్తి

ప్రస్తుతము మన దేశంలో నీటి వసతి లేకయున్న గ్రామములనేకము లున్నవి. పంటలకు వలయు నీటి మాట యటుంచి, త్రాగుటకైనను నీరు లేని గ్రామములు లెక్కకు మిక్కిలి యున్నవి. త్రాగుటకు నీరు లేక అందులకై క్రోసుల దూరము నడవవలసిన ప్రజానీకముల పాట్లు అందునను వేసవిలో వారి పాట్లు చెప్పనలవి కాదు. అందరు మానవులు జన్మతః ఒకే రీతిని ఉండనట్లు అన్ని ప్రాంతములును ఒకే రీతిగ ఉండవు. కొన్ని ప్రాంతములు నదీజలములతో సంవత్సరము పొడుగున జలసమృద్ధితో ఉండును. కొన్ని ప్రాంతములకు వర్షా కాలంలో జలలోపము లేకపోయినను, వేసవిలో నీటియెద్దడి సంభవించును. మరి కొన్ని ప్రాంతములలో వేసవి కాల మనక వర్షాకాల మనక అన్ని కాలములందును జలాభావముండును.

అయినను భూమికి ఉపరితలమున నుండు నీరేకాక భూగర్భమున ఉన్న నీరు అన్ని ప్రదేశములలోను కూడయుండును. అయినను భూగర్భమున నీరున్నదని కనుగొనదగు సాధనములు సరియైనవి ఇంతవరకు కనుగొనబడలేదు. కొంతమంది మోదుగపుల్లలతో జల మున్నచోట్లను చెప్పగలరు. కాని అది యంతయు వారివారికున్న యనుభవమును బట్టి కాని శాస్త్రాధారమున కాదనిపించుచున్నది.

ప్రాచీన కాలమున మన పూర్వులు పరిశోధనలు జరిపి నీరు ఎక్కడెక్కడ ఎన్ని నిలువులలోతున పడునో కనుగొని భూగర్భ జలజ్ఞానశాస్త్రమును రచించిరి. ఈ శాస్త్రములో భాగములే ఇప్పుడు కానవచ్చుచున్నవి. ఈ శాస్త్రమును సారస్వతుడను ముని రచించినట్లును దానికి వ్యాఖ్యానము వరాహమిహిరుడు స్వానుభవముతో వ్రాసినట్లును కానవచ్చుచున్నది.

ఈ శాస్త్రములో భూగర్భమున నీటి వనరులు మనుష్య శరీరములో రక్తనాళములవలె కొన్ని పైపైనను కొన్ని లోతుగను ఉండునని వివరింపబడినది. ఇది సమంజసముగా నున్నను, "ఏకేన వర్ణేనరసేనచాంభః భ్యుతం నభస్తోవసుధా విశేషాత్, నానా రసత్వం బహువర్ణతాంచ గతం పరీక్షుం క్షితి తుల్యమేవ" అను శ్లోకార్థము ప్రస్తుత జలపరిశోధనల ప్రకారము ఎంత నిజమో పరిశోధకులే గమనింపవలెను.

ఈ శాస్త్రమునం దంతటను నీరు ఎక్కడెక్కడ దొరకునో ఆ చెప్పిన దానికి ప్రమాణ మేమిటో వివరింపబడినది. చూడండి.

''జంబూవృక్షస్య ప్రాగ్వల్మీకోయది భవే త్సమీపస్థః తస్మా ద్దక్షిణపార్శ్వే సలిలం పురుద్వయేస్వాదు.

వెలుగు బాటలు

అర్ధ పురుషేచ మత్స్యాః పారావత సన్నిభశ్చ పాషాణః మృద్భవతి తత్ర నీలా దీర్ఘం కాలంచ బహుతోయమ్''

చెట్లు పుట్టలు ఆధారముగా ఈ శాస్త్రము రచింపబడినది. ఈ కాలమునకు పరిస్థితులకు శాస్త్రమును ఎట్లు సమన్వయించుటకు వీలగునో పరిశోధకులు ప్రయత్నింతురుగాక. ఈ శాస్త్రములో చెప్పబడిన భూ పరిస్థితులున్నచోట అందు చెప్పబడిన ప్రక్రియలు జరిపినయెడల నీటి కరువున్న ప్రదేశములలో నీరు సంభవించునేమో కనుగొనవలయును,

ఇది గాక బావుల నేదిక్కు త్రవ్విన శుభప్రదమో యే దిక్కున త్రవ్విన నశుభప్రదమో కూడ యీ శాస్త్రమునందు వివరింపబడినది. ఇది గాక యీ శాస్త్రమునందు రాళ్ళను పగులగొట్టుటకుపాయములు కూడ చెప్పబడినవి.

ఇప్పుడు పెద్దపెద్ద గుండ్లు బావులు త్రవ్వుచోట పడినయెడల తుపాకి మందుతో పేల్చి రాళ్ళను పగులకొట్టుచున్నారు. కాని, ''భేదం యదానైతి శిలాతదానీం పలాశకాష్ఠై స్సహాతిందుకానాం, ప్రజ్వాలయిత్వాఽనలమగ్నివర్ణా సుధాంబుసిక్తా ప్రవిదార మేతి''

అను ప్రయోగముల నీ కాలమున చేసినయెడల ఎంతవర కుపయుక్తమో గ్రామీణులు ప్రయత్నించి చూచినఎడల వారు తుపాకీమందు మొదలగు వాటి కొరకు వారిని వీరిని ఆశ్రయింపవలసిన అవసరమే లేకపోవచ్చును.

రాతిగుండ్లను బ్రద్దలుచేయుట కుపయోగించు లోహపు పనిముట్లు మడిగిపోకుండుటకు కూడా కొన్ని ప్రక్రియలు చెప్పబడినవి.

''జిల్లేరు పాలును, గొర్రె కొమ్ములు కాల్చిన మసియు, పావురము, ఎలుకల మలమును నువ్వుల నూనెలో మెత్తగా కలియునట్లు కలిపి ఉక్కు మొనలకు లేపనము చేసి వానిని కొలిమిలో కాల్చి నీటితో ముంచిన యెడల వాటి వాడి చెడదు. రాళ్ళపై మడగవు.

ఇదిగాక చేదునీటిని బురదనీటిని పానయోగ్యముగా చేయుటకు కొన్ని ప్రక్రియలు వివరింపబడినవి. మరియు కూపారంభమునకు శుభ నక్షత్రములు, బావి చుట్టు వేయవలసిన వృక్షతతులును, కపిల నుంచదగిన దిక్కులు మొదలగు విషయములుకూడ ఇందు పేర్కొనబడియున్నవి.

ఇట్టి ప్రజోపయోగ మగు శాస్త్రమును పఠించి ప్రజలు ముఖ్యముగా నీటి కొఱత గల ప్రదేశములలో నివసించు ప్రజలు ఉపయోగమును పొందెదరు గాత! లోకాస్సమస్తా స్సుఖనోభవన్తు ★


కొండపల్లి

కె. నాగభూషణరెడ్డి

"కొండపల్లిని గురించి యెప్పుడైనా విన్నావా" అని ఒక స్నేహితుడ్ని ప్రశ్నించాను. "ఏ కొండపల్లి ? దేశంలో యెన్నో కొండపల్లెలున్నవి, ఏదని ?" అన్నాడు ఆ స్నేహితుడు. "నేనడిగేది అన్ని కొండపల్లెల్ని గురించికాదు; కాని ఒక కొండపల్లి ఒక విషయంలో చాల ప్రసిద్ధిచెందింది. దాన్నిగురించి" అన్నాను. "ఊహూ ! నేనెప్పుడూ వినలేదు" అన్నాడు ఆ మిత్రుడు. ఇంకొక మిత్రుణ్ణి అడిగాను యిదేప్రశ్న. "కొండపల్లి బొమ్మలు" అని విన్నాను. కాని ఆ కొండపల్లి యెక్కడ వున్నదిమాత్రం తెలియదు" అన్నాడతను. వారిని చూస్తే నాకు నవ్వు వచ్చింది. ఎందుకంటారేమో, ఆ యిరువురు యేవిదేశస్తులుకాదు; పరాయి రాష్ట్రవాసులుకాదు. స్వచ్ఛమైన పదహారణాల ఆంధ్రులు. అంతర్జాతీయ ప్రసిద్ధి నొందిన కొండపల్లి ఆంధ్రదేశంలో వుందని ఆంధ్రులకే (కొందరికి) తెలియనందుకు చాల ఆశ్చర్యమేసింది. దూరదేశంలోని వింతలు, విశేషాలు ఆకర్షించినట్లు స్వదేశంలోని విషయాలు ఆకర్షించవన్న నగ్నసత్యం మన దేశస్థులకేగాక అన్ని దేశస్థులకు వర్తిస్తుందేమో ? లేకుంటే విదేశాలలోని వింతలనుగురించి తెలుసుకోవాలనే శ్రద్ధాసక్తులు మనదేశంలో మనకళ్ళెదుట వున్న వానిని తెలుసుకోవడానికి కుతూహలంలేదు.

కొండపల్లిలాంటి కుగ్రామాలు మన రాష్ట్రంలోనేగాక, మనదేశంలో వేనకువేలున్నవి. అటువంటప్పుడు ఆ గ్రామాన్ని గురించి ప్రత్యేకంగా తెలుసుకోవలసిందేముందని ప్రశ్నించవచ్చు. విశ్వవిఖ్యాతి నార్జించిన కొండపల్లి అమూల్యమైన కళాసంపదకు పుట్టినిల్లు. అవే కొండపల్లి బొమ్మలు. ఆ బొమ్మలే కొండపల్లికి అంత ఖ్యాతిని సంపాదించిపెట్టినవి. ఆ బొమ్మలే లేకుంటే కొండపల్లినిగురించి యింతవ్రాయవలసివచ్చేదికాదు.

కొండపల్లి కృష్ణాజిల్లాలోని 1058 గ్రామాల్లో ఒకటి. ఇది విజయవాడకు



12 మైళ్ళ దూరంలో వుంది. కొండపల్లి రైలుస్టేషనుకూడ. ఇది విజయవాడ — ఖాజీపేట లైనులో వుంది. విజయవాడనుండి కొండపల్లికి బస్సులోకూడ వెళ్ళవచ్చు. విజయవాడ — హైదరాబాదురోడ్డు మీదుగా ఇబ్రహీంపట్నం వరకు వెళ్ళి అచ్చటినుంచి తిరువూర్ వెళ్లే రోడ్డువెంట 5 మైళ్ళు వెళ్తే కొండపల్లి చేరవచ్చు. ఈ ప్రాంతంలోని పొలాలకు కృష్ణా కాలువలనీరు ప్రవహించదు. కాని అక్కడక్కడ చెరువులక్రింద కొంతపొలం మాగాణి సాగులో వుంది. కొండపల్లి ఒక మామూలుగ్రామం. దీని జనాభా దాదాపు 7 వేలుంటుంది. కొండపల్లికి మేజర్ పంచాయతీవుంది. ఈ గ్రామానికి విద్యుచ్ఛక్తి, టెలీఫోన్ ఎక్చేంజివంటి అధునాతన సౌకర్యాలుకూడ వున్నవి.

రైలు దిగగానే స్టేషనునుంచి చూచిన, ఎదురుగా దాదాపు పదిమైళ్ళమేర వ్యాపించి వున్న పచ్చటి కొండలు, ఆ కొండల నానుకొని వున్న కొండపల్లిగ్రామం చూపరుల హృదయాలను ఇట్టే ఆకర్షిస్తుంది. ఈ కొండపల్లి చారిత్రాత్మకంగా కూడ చాల ప్రసిద్ధిపొందింది. ఇది పూర్వము "ముస్తఫానగర్" అను పేరుతో వ్యవహరింపబడేదని చెప్పుటకు కొన్ని చారిత్రక నిదర్శన లున్నవి. భామినీ సుల్తానైన రెండవ మహమ్మదుషా క్రీ.శ. 1462 లో కొండపల్లి దుర్గమును గజపతిరాజుల నుంచి జయించి ఆ దుర్గముక్రింద నొక గ్రామమును నిర్మింప దలచెను. కాని, నిర్మాణమప్పుడు ప్రాకారములు నిల్వక పడిపోవు చుండెననియు, అప్పుడు కొండడు అను గొల్లవానిని, వాని భార్యయైన "పల్లె" అను దానిని చంపి, వారి శవాలను పునాదులలో వేసి కట్టగా, గోడలు పడిపోక నిలచెననియు అందువల్ల వారిద్దరి స్మృతి చిహ్నంగా ఆ పల్లెకు కొండపల్లి అని పేరిడిరని ఒక కథ ప్రచారంలో వుంది. ఈ కొండపల్లెకు 5 మైళ్ళ దూరంలో కొండపల్లె దుర్గమున్నది. ప్రస్తుతము దుర్గము చాలామటుకు శిథిలమై,

పాడుపడిన మహలులతో, గుడ్లగూబలకు, గబ్బిలములకు స్థావరమైవున్నది. కాని ఒకప్పుడు యీ కొండపల్లి దుర్గము చాల ఔన్నత్యముతో తులతూగినది. ఈ దుర్గమును రెడ్డి, గజపతి, ఒరిస్సా, కర్ణాటక, మహమ్మదీయ, ఆంగ్లేయరాజులు పరిపాలించిరి. క్రీ. శ 1378 నుండి 1419 వరకు యీ దుర్గమును రెడ్డిరాజులు పాలించిరి. తర్వాత క్రీ. శ. 1420 లో యీ కోట, గజపతిరాజుల వశమై క్రీ. శ. 1515 వరకు వారి పాలనలో వుండెను. మధ్యలో కొన్ని సంవత్సరములు భామినీ సుల్తానైన రెండవ మహమ్మదుషా (క్రీ. శ 1462-1471), ఒరిస్సా రాజయిన అంబరరాముడు (క్రీ. శ. 1482-1496) దీనిని పాలించిరి. క్రీ. శ. 1516 లో శ్రీకృష్ణదేవరాయలు గజపతి ప్రభువైన వీరభద్ర గజపతిని జయించి కొండపల్లిని స్వాధీన మొనర్చుకొనెను. ఇబ్రహీం పాదుషా క్రీ. శ. 1579 లో విజయనగర రాజుల పారద్రోలి కొండపల్లిని వశమొనర్చుకొనెను. క్రీ. శ. 1766 వరకు, కొండపల్లి మహమ్మదీయ రాజుల పాలనలో వుండెను. 1766 లో ఇంగ్లీషు సైనాధ్యక్షుడైన జనరల్ కెయిలాడ్ మహమ్మదీయ రాజులను ఓడించి యీ దుర్గమును స్వాధీనము చేసుకొనెను. అప్పటినుంచి మనకు స్వరాజ్యం వచ్చేవరకు బ్రిటిష్‌వారి పరిపాలనలో వుండెను.

ఈ కొండపల్లి రకరకములైన కర్ర బొమ్మలకు చాల ప్రసిద్ధిచెందింది. కొండపల్లి సమిపములోని అడవిలో దొరికే "తెల్ల పొణికికర్ర" తో యీ బొమ్మలు తయారు చేస్తారు. ఈ కర్ర చాలతేలికగాను, జిగిగాను వుండడంవల్ల బొమ్మకు అవసరమైన రూపురేఖలు దిద్దడం చాల సులభం. ఈ తెల్ల పొణికికర్ర ఆంధ్రప్రాంతంలో యితర చోట్లనూ దొరికినప్పటికీ యీ ఒక్క కొండపల్లిలోనే యీ బొమ్మల పరిశ్రమ వృద్ధి చెందుటలోగల ప్రత్యేకత యేమిటని సందేహం కలక మానదు అందుకుకారణం ఒకటే; ఇచ్చట యీ పొణికికర్ర నుపయోగించి బొమ్మలు తయారుచేయు నటువంటి వారు 16 వ శతాబ్దంలో మధ్యప్రదేశ్ ప్రాంతం నుంచి యీ ప్రాంతమునకు వచ్చి యిచ్చట స్థిరపడిపోయిన ఆర్యక్షత్రియులు. వీరు మంచి శిల్పకళా కోవిదులు. ఆంధ్రదేశపు జమీందారులు, రాజులు కొందరు తమ స్వంతమునకు అవసరమైన బొమ్మలు, విగ్రహములు మొదలైనవాటిని తయారు చేయించుకొనుటకుగాను యీ కళాకారులను పిలుచుకొనివచ్చి వారి పోషణభారం వహించారనియు, రాను రాను కొన్ని కారణాలవల్ల యీ జమీందారులకు వారిని పోషించే శక్తి సన్నగిల్లుటవల్ల యీ కుటుంబీకులు కొందరు కొండపల్లిలో స్థిరపడిపోయి తమ జీవనోపాధికిగాను యీ బొమ్మలతయారీ చేపట్టడం జరిగిందని తెలియుచున్నది. ఈ ఆర్యక్షత్రియ కుటుంబాలు కొండపల్లిలో దాదాపు 16 వున్నవి. వీరి జీవనోపాధి కేవలం యీ బొమ్మలే అని చెప్పక తప్పదు. వీరు యీ తెల్లపొణికికర్రను అడవినుంచి తెచ్చేవారి దగ్గరనుంచి కొని పైబెరడు తీసి బాగుగా ఎండిన తర్వాత దానిని ముక్కలుగా కోయుదురు. ఆ ముక్కలను బాడిశచే చెక్కి, ఆకురాతితో రాసి కుంపటిమీదుంచి వేడి చేయుదురు. కుంపటిని రంపపుపొట్టుతో అంటించి కుంపటిమీద ఇనుప తీగలున్న జల్లెడనుంచి దానిలో యీ చెక్కిన ముక్కలుంచి వేడి చేయుదురు. ఆ విధంగా వేడి చేసిన ముక్కలను ''బావుదారు'' అను ఉలి వంటి పరికరముతో చెక్కి బొమ్మల ఆకారములు కల్పింతురు. కర్ర మృదువైనదవుట వల్ల చెక్కడం చాలతేలిక. ఏ ఆకారంలేని ఒక కొయ్యముక్కను బావుదారుతో చెక్కుతూ క్షణంలో బొమ్మ ఆకారం కల్పించేవారినేర్పు చూసినవారికి ఆశ్చర్యం గొల్పక మానదు. చేతులు, కాళ్ళు మొదలైనటువంటి చిన్నచిన్న భాగములను వేరుగా చెక్కి వీటిని యీ బొమ్మలకు చిన్న మేకులతో అతికించెదరు. వీటిని అతుకుటకు వారు స్వంతముగా తయారుచేసిన చింతజిగురును వాడుదురు. చింతగింజలను కొట్టి, నానవేసి బాగుగా నానిన తరాత్వ రుబ్బి, వుడికించి చింతజిగురుమ తయారుచేయుదురు. ఈ జిగురులో కర్రను చెక్కినపొట్టును కలిపి మక్కును తయారుచేయుదురు. ఈ మక్కును బొమ్మలోని ఎత్తు పల్లములను తయారు చేయుటకు దానిపై పూసి ఆరినతర్వాత ఆకురాతితో రుద్దుదురు. బొమ్మకు పూర్తిరూపము కల్పించిన తర్వాత దీనికి సుద్ద, చింతజిగురు రెండు కలిపి పూయుదురు. తర్వాత యీ బొమ్మలకు రంగువేసి ఎండబెట్టుదురు.

ఈ కుటుంబాలలోని పిల్లలు, పెద్దలు, స్త్రీలు అందరు యీ బొమ్మలు తయారు చేయడంలో సిద్ధహస్తులు. పురుషులు పెద్దవారు బొమ్మలను చెక్కుదురు. రంగులు వేయడం చాలావరకు పిల్లలు, స్త్రీలు చేయుదురు. వీరు అనేక రకముల బొమ్మలు తయారు చేయుదురు. దశావతారములు, లక్ష్మి, సరస్వతివంటి దేవతల బొమ్మలు, ఏనుగ, గుఱ్ఱము, ఒంటె, పెద్దపులి, ఆవు వంటి జంతువులు, చిలుక, కాకి, నెమలి, హంస, కోడి, డేగ, పావురము వంటి పక్షులు, భారతదేశములోని జాతులను, వృత్తులను సూచించు బొమ్మలు, అంబారి ఏనుగ, దేవాలయములు, గృహములు, రాసక్రీడ లాడుచున్న గోపికలు, బాండు దళం, పోలీసుదళం, యింకా అనేకములైన యితర బొమ్మలు తయారు చేయుదురు. 1938 లో వీరు, కొండపల్లి బొమ్మల సహకార క్రయ, విక్రయ సంఘము నేర్పరచుకున్నారు. మైలవరం పంచాయతి సమితివారి ఆధ్వర్యమున యిచ్చట ఒక ఉత్పత్తి శిక్షణ కేంద్రము నెలకొల్పి కొంతమందికి యీ బొమ్మలు తయారు చేయడంలో శిక్షణ యిచ్చారు. ఈ బొమ్మలలో జీవకళ ఉట్టిపడుచుండును. వీటికి మన దేశంలోనే గాక, విదేశాలలోకూడ మంచి గిరాకీవున్నది. ఈ బొమ్మలు ప్రభుత్వపు సేల్సు ఎంపోరియంలలో అమ్మకమునకు దొరుకును. ప్రచారం నిమిత్తం విదేశాలలో జరిగే వస్తుప్రదర్శనములలో యీ బొమ్మలను ప్రదర్శించుచున్నారు. ★


మిహిరకులుడు

సీరియల్ నవల:

(రెండవ యధ్యాయము)

ఏనాఁడు యువరాజుయొక్క చదువునకుఁ దుడిదినమో యానాఁడు మిహిరకులుని తండ్రియయిన వసుకులుని ప్రాయోపవేశపు మొదటిదినము. ఆయన ప్రాయోపవేశము చేసినాఁడని యెవ్వరికిని దెలియదు. ప్రాయోపవేశమనఁగా దర్భాస్తరణము వేసికొని భూషణాదులు తొలఁగించుకొని పరుండుటేమో. ఈయన యట్లు చేయలేదు. రాజు మేల్కొనిన తరువాత కాల్యకృత్యములు తీర్చికొని మంచముమీఁదఁబరుండెను. రాజకృత్యములు చేయుటలేదు. మంత్రి మొదలైనవారు వచ్చిరి. దర్శన మీయలేదు. ఎవ్వరిని రానీయలేదు. స్నాన మైనది. ఆ స్నానము రాజయోగ్యముగాలేదు. ఒక బ్రాహ్మణుఁడు చేసినట్లు శీతాంబువులతో స్నానము చేసెను. మరల దుస్తులు ధరించెను. పరుండెను. ఎవ్వరితోఁడను మాటాడడు. ఆయన యున్న శయనాగారమున నితరులకుఁ బ్రవేశం లేదు. భోజనవేళ యయినది, భోజనమునకు లెమ్మనిపిల్చుట కెవ్వరికి గుండెలులేవు. కాలం గడచుచుండెను. అంతఃపురమంతయు నిరాహారముగ నుండెను. ప్రొద్దు వాటారు వేళకు నెవరు నిలువలేరో వారు భోజనము చేసిరి. తక్కినవా రట్లేయుండిరి. గుఱ్ఱపుసాలలోఁ బట్టపుగుఱ్ఱము కనిపించుటలేదు. తదధికారులు గుబ్బిసలాడి త్రొక్కిఱ్ఱపడి ప్రొద్దెక్కిన తరువాత గుఱ్ఱమును యువరాజుగారెక్కి వెళ్ళిరన్న యానోటిమాట యానోటిమాట విని రాజునకుఁ దెలియజేయుటకుఁ ద్రొక్కిటపడి మడమలు త్రొక్కికొని మంత్రులతోఁజెప్పి యంతర్వేశికులతోఁజెప్పి దౌవారికులతోఁ జెప్పి యెంతయిరకటమైనను రాజున కీవార్త యందించుటకు సాధ్యము కాలేదు. శయనాగారము నందలి ద్వారపాలకుఁడుపోయి తాను జెప్పుట కధికారము లేదనును, ఇతరులను లోనికిఁబోనిచ్చుట కనుమతి లేదనును. పెద్దపెద్ద అధికారులు కలరు. రాజువద్దకు స్వయం ప్రవేశముకలవారు కలరు. వారికిఁగూడఁ బ్రవేశము నిరాకరింపబడెను. పూర్వము మంత్రి పురోహితులు ద్వారపాలాంతర్వేశికులు నగరాధ్యక్ష ధర్మాధ్యక్షులు స్వయముగా వెళ్ళుట కధికారముండెడిది. యువరాజున కెప్పుడును స్వయం ప్రవేశార్హత కలదు. ఇతరులుచేసిన సాహసమును రాజునకు నివేదించుటకుఁ గ్రిందటివాళ్ళ సమర్థుఁడైన యువరాజే చేసిన వ్యతిక్రమమును మరెవ్వరు చెప్పఁగలరు. అతఁడు యువరాజు, రాజ్యాంగ భూతులైన యష్టాదశ సంఖ్యాకులైన యధికారులలో మూఁడవవాఁడు, మంత్రి పురోహితుల తరువాతివాఁడు. ఆధికారికముగా మూఁడవ

విశ్వనాథ సత్యనారాయణ

వాఁడుగాని రక్త సంబంధముచేత రాజు తరువాతివాఁడు. ఇప్పుడు రాజు తరువాతివాడుగాని నేఁడు రాజెట్లు ప్రథముఁడో రేపు తానట్లు ప్రథముఁడు. అతఁడు చేసిన వ్యతిక్రమమునకు శిక్ష యుండునా? మంత్రిగూడ సాహసింపలేదు. చివరకు బురోహితుఁడు సాహసించెను. పురోహితుఁడు సాహసించుటకుఁ గారణ మున్నది. రాజు మొదలుపెట్టిన యీ ప్రాయోపవేశమునకు లీలఁగా గారణము పురోహితునకుఁ దెలిసినట్లున్నది. నాల్గు దినములక్రిందఁ బురోహితుఁడుపోయి రాజుతో నొక విషయము మనవి చేసికొనెను. ఆ విషయము విన్నప్పుడు రాజు కన్నులవెంట నీరు కార్చెను. సమాధానములేదు. ఈ సంగతి రాజుతో నెందుకుఁ జెప్పితినా యని పురోహితుఁడు దిగులుపడెను. రాజుయొక్క యీస్థితి కదికారణమా? తానుచెప్పి నాల్గుదినములైనదిగదా, దాని ఫలితము జరుగుటకు నాల్గుదినములు పట్టునా: అట్టి విషయములు రాజుతోఁ జెప్పుట కెన్నేనిగలవు. ఎందఱేని కలరు. తత్పూర్వమే రాజు వానినిగూర్చి వినెనేమో. ఈ నాల్గు దినములలో మఱి కొన్నిటిని వినెనేమో. చివరికి నీపగిది నిర్ణయించికొనెనేమో. అదియే హేతువైనచోఁ దాను పురోహితుఁడిప్పుడు పోయి రాజును దీని కారణ మడుగుటలో సామంజస్యములేదు. ఉరిసినపుండుపై కారము చల్లినట్లగును. రాజులతోడి వ్యవహారములు పాములతోడి చెలగాటములు. దోషము నీది కాకపోయినను దోషము నిశ్చయమైన దోషమైనను, నది యన్యకృతమైనను ప్రథమ శ్రవణము దేనినుండి కలుగునో వాని కొక్కొక్కప్పుడాపద కలుగవచ్చును. వాఁడు వీఁడని నిశ్చయము లేదు. ప్రొద్దెక్కిన కొలంది సర్వాధికారులు నౌకరి తరవాత నౌకరుగా వచ్చి రాజు యొక్క శయనాగారము నంటియున్న పెద్ద సావడిలోఁ గుమికూడిరి. చిట్టచివరకి వచ్చినవాడుఁ సేనాపతి. అటవీపాలుఁడు నగరమునందు లేడు. రాజు కాక మిగిలిన పదునేడుగు రధికారులలో నటవీపాలుఁడును సేనాపతియు వదలిపెట్టఁబడగాఁ దక్కిన పదునేనుమందియు సమావిష్టులైరి. చివరకు సేనాపతి వచ్చెను. తక్కిన యందఱు తలలు తలలు పట్టుకొనుచుండగా నితఁడు దూరమునందుఁ గూర్చుండెను. అతఁడు తమతోఁ గలియఁ డని వారికిఁ దెలియును. అతఁడు యువరాజు పక్షమువాఁడు. ఆ రాజ్యమునఁ బక్షములు లేవు. కాని యువరాజునకును సేనాపతికిని మిక్కిలి చెలిమి. గడచిన యైదేండ్లుగా యువరాజు తమ సేనలు యుద్ధగజములు నశ్వసైన్యము పదాతులు మొదలైనవారి పరామర్శ చేయుటయుఁ

పరిరక్ష చేయుటయుఁ బరీక్ష చేయుటయు సేనలోని యధికారులకు వేతనాభివృద్ధి చేయించుటయు తాను మిక్కిలిగా సైనిక శిక్ష పొందుటయుఁ, దాను వారికి శిక్ష యిచ్చుటయు నెక్కువ భాగము వారితోడనే కలసి యుండుటయు జరుగుచుండెను. సైనికులకు సైనికాధికారులకును యువరాజు దేవుఁడు. అతడు రాజెప్పు డగునని వారు ప్రతీక్షించుచుందురు. అతఁడు రాజ్యమునకు రావలయును. కాశ్మీరము సర్వభారత దేశమును జయింపవలయును. దుర్గపాలుఁ డున్నాడు. ఇతఁడు వారిలోని వాఁడే. కాని యతనికి సేనాధికారుల కున్న తీవ్రత లేదు. రాజుయొక్క యీ యేకాంతతయు, నిరాహారతయు సమావిష్టులైన సర్వాధికారులకు నాందోళనము కలిగించుచుండెను. క్రమక్రమముగా వారికి యువరాజు పట్టపు గుఱ్ఱము నెక్కి ప్రొద్దుననెప్పుడో పోయెననియు నింతవరకు రాలేదనియు నీ సంగతి రాజునకుఁ దెలియఁజేయవలయు ననియుఁ దెలియఁజేయుట దుష్కరముగా నున్నదనియు నన్ని విషయములు సువ్యక్తము లయ్యెను. పురోహితుఁడు లోనికిఁ బోయినను యువరాజకృత వ్యతిక్రమమును జెప్పుటకు సాధ్యము కాదు. ఇది యొక పాలనాశాఖకు సంబంధించినది. ఇది యంతర్వేశికుని యధికారములోనిది. రాజాంతఃపుర సర్వ వ్యవహారముల మీఁద యధికారి యంతర్వేశికుఁడు. పట్టపుగుఱ్ఱము పట్టపుటేనుఁగు మొదలైనవి రాజాంతఃపుర సంబంధి విషయములు. పోయి యంతర్వేశికుఁడు చెప్పవలయును. అతఁడు తాను చెప్పనన్నచోఁ జెప్పననెను. గ్రుచ్చి గ్రుచ్చి యడుగఁగా నతఁడిట్లనెను. 'అయ్యా! నేను యువరాజుగారి మీఁదఁ జాల విషయములు మహారాజుతోఁ జెప్పవలసి వచ్చెను. కతదిన మూన్నాళ్లుగా నైదారు విషయములు చెప్పవలసివచ్చెను. నాకేమో చెప్పకతప్పదు. ఇదియుఁగూడ నా ధర్మమే యగును. కాని నేను భయపడుచున్నాను. ఈరాజు తా నీ భోజనము మానివేయుట దీర్ఘీకరించినచోఁ దలఁపరానికీడు సంఘటిల్లినచో నా స్థితి యేమగునో నాకుఁ దెలియకున్నది. నీకొక ధర్మము కలదు. అది నీ వాచరింపక తప్పదు, ఆచరించినచో రాజునకో యువరాజునకో మంత్రికో మఱెవ్వరికో యది మనసున కిష్టము లేని దగును. కోపము వచ్చినప్పుడు వాని ధర్మము వాఁడు నిర్వర్తించినాఁ డన్న సౌమనస్య మెంతమంది యధికారుల కుండును. నాకు మహారా జెట్టివాఁడో యువరాజు నట్టివాఁడే. నా కిద్దఱి నడుమ భేదము లేదు, కాని తాత్కాలికముగా రాజు రాజు. యువరాజు ప్రవృతులో నొకఁడు. ఈయనను గురించిన యొకమాట రాజుతోఁ జెప్పవలసిన స్థితి తత్కాల శక్తి చేత సముపపన్నమై యుండును. ఇది నా భయము." మంత్రి యిట్లనెను. 'నిజమే! మన ధర్మము మనది. ఈనాటి ధర్మ మీనాఁడాచరింపక తప్పదు. భవిష్యత్తున నది దుఃఖదాయియో సుఖదాయియో తెలియదు. ధర్మమునకుఁగూడ నొక్కొక్కప్పుడు చెడ్డదినములు వచ్చును. దానికి మనమూ కర్తలము. పురోహితుఁడు వెళ్ళినను పట్టపు గుఱ్ఱము నిట్లు యువరాజు తీసుకొనిపోయెనని చెప్పుటకు సమర్థుఁడు కాఁడు. అతఁడు చెప్పరాదు. నీవే చెప్ప చెప్పవలయును'. అనఁగా సమకూడిన యితరులైన పదునాల్గుమంది యధికారులు నంతర్వేశికునకుఁ దప్పదనిరి. అతనికి ధైర్యాపాదిగాఁ దామందఱును వచ్చి శయనాగార ద్వారమునందు నిల్చుందుమని చెప్పిరి. అంతర్వేశికునకుఁ దప్పలేదు. అందఱును పోయిరి. శయనాగార ద్వారస్థుఁడైన యధికారి వీరెవ్వరిని లోనికిఁ బోనిచ్చుటకు వీలు లేదనెను. అందఱు నెంత గుసగుసలుగా నున్నను రాజునకీ గుసగుసలు వినిపించెను. ఆయనయే బయటకు వచ్చెను. అంతర్వేశికుఁడు చెప్పెను. మహారాజు వినెను. మరల లోనికిఁబోయి పండుకొనెను. ఎవరేమి చేయుదురు? తమ ధర్మము నిర్వర్తింపఁబడినది. ఎవరిదారిని వారు పోఁబోవుచుండిరి. రాజుయొక్క నిరాహారహేతువు మిగిలిపోయినది. ఎవ్వరు నడుగుటకు సాహసింపలేదు. క్రొత్తనీరు వచ్చి ప్రాఁతనీటిని దుడిచికొనిపోయిన దన్నట్లు ప్రధాన ప్రశ్న యట్లే యుండెను. అందఱును పోయిరి. అంతర్వేశికుఁడును పురోహితుఁడును మిగిలిరి. ఆ రాజ్యమున నొక యలవాటు కలదు. పురోహితుఁడును రాజప్రసాదమునందే యొక మహాసౌధమున నివసించుచుండును. అతఁడు మధ్యాహ్నమగువఱకు దేవతా పూజలను జేసి స్వామికి నైవేద్య మర్పించి యా వార్త రాజసౌధమున కందించి తాను భోజనము చేయును. స్వామికి నైవేద్యము చేసిన యనంతరమునందలి యన్నమునకు నుచ్ఛిష్టమని పేరు. పురోహితుడును రాజును తమ తమ గృహములయందు నించుమించుగా నొకవేళకే భోజనము చేయుదురు. పురోహితునకీ సంగతి తెలియదు. అతఁడు భోజనము చేసెను. రాజు భోజనము చేయలేదని యతని కప్పుడు తెలిసెను. అతఁడు మిక్కిలి ఖిన్నుఁడైనాఁడు. ఇప్పు డతఁడు మఱియు ఖిన్నుఁడైనాఁడు. అతనికిఁ దా నేదో మహాపచారము చేసినట్లు కనిపించెను. నాల్గుదినములక్రిందఁ దాను చెప్పినది నేఁడీ పరిణామము. నేఁడు యువరాజుచేసిన వ్యతిక్రమము. దానితోడిది. తాను చెప్పినప్పుడు రాజెట్లు మౌనము వహించెనో నేఁడంతర్వే

శిశువి మాటలు విని రాజట్టి మౌనమునే వహించెను. రెంటికిని బోలిక గలదు. మరియుఁ బురోహితుఁ డూహింపఁగా యువ రాజు చేసిన యీ వ్యతిక్రమము రాజున కాశ్చర్యము కలిగింపలేదు. కోపమును కలిగింపలేదు. ఇట్టి దేదో వినుటకు రాజు సిద్ధముగా నున్నట్లు కనిపించెను. అతనికొక ధైర్యము వచ్చెను. ఇపుడు తాను పోయి సొంతముగా రాజుతో మాటాడవచ్చునేమో! ద్వారమునందలి వాఁడు పోనీయఁడేమో! ఈ తటపటాయింపులలోఁ బ్రొద్దుక్రుంకెను. అతనికి మరల ననుష్ఠానవేళ సమీపించెను. అతఁడు వెడలిపోయెను. అతని యనుష్ఠానము పూర్తియగువేళకు రాత్రి జాము ప్రొద్దుపోయెను. అతనికి భోజనవేళ యయినది. ఆయన భార్య భోజనము చేయుఁడన్నది. రాజునకుఁ బ్రొద్దుటినుండి భోజనము లేదు. ప్రొద్దుటనే తాను తెలియక భుజించెను. ఈ పూటకూడ నట్టి యపచారము చేయునా? అతని భార్య యన్నదికదా 'రాజు పది దినములు భోజనము చేయఁడు. పదిదినములైనతరువాత రాజునకు స్మృతి కలుగును. మీరీ పదిదినములు భోజనము చేయరా? పదునొకండవ దినమున రాజుతోఁ జనిపోవుదురా?" పురోహితుఁ డామె వంకఁ బరకాయించి చూచెను. ఆమె విచిత్రమైనవ్యక్తి. పెద్ద చదువుకొన్నది కాదు. పరమ యోగ్యురాలు. ఆమె నోటివెంట నప్పుడప్పు డిట్టిమాటలు వచ్చుచుండును. ఆమాటలు సరిగా జరుగును. పూర్వ మిట్టి దనుభూతిలో నున్నది. అతని కేమియుఁ దోఁచలేదు. అతఁ డిట్లనెను. 'నే నీ రాత్రికి మాత్రమే భుజింపను. రేపు రాజు భుజించి నను భుజింపకున్నను భోజనము చేయుదుము'

అతఁడు మంచముమీఁదఁ బరుండెను. నిదుర పట్టలేదు. మరల రాజసౌధమునకు బయలుదేరెను. రాజసౌధ మంతయు శోభాహీనముగ నుండెను. పెక్కుమంది భుజింపలేదు. భుజించినవారు భుజించినట్లు పరులకుఁ దెలియునేమో యని భయపడుచుండిరి. రాజసౌధమున వంటలు చేసినట్లు లేదు. కొలఁదిదినములనుండి యువరాజుయొక్క భోజనకాలవేఱు మహారాజు భోజనకాల వేఱు. అప్పటివంట వేఱు. ఇప్పటివంట వేఱు. యువరాజ సౌధము కలకల లాడుచుండెను. అచటి పరిచారకులు వికసిత ముఖారవిందులై విహరించుచుండిరి. తక్కిన రాజప్రసాదమంతయు శోభారహితమైయుండెను. దీపములుగూడ సరిగా వెలిగింపఁబడలేదు. పురోహితుఁడు నెమ్మదినెమ్మదిగా రాజశయనాగారమువఱకుఁ బోయెను. ఆయనను చూచి యెవ్వరును కాదనలేదు. శయనాగార రక్షకుఁడైన పురుషుఁడు పవలెల్ల తిండిలేక కన్నులు బయటికివచ్చి యచట నిలుచుండెను. పురోహితుని జూచెను. పురోహితుఁడు లోనికిఁ బోవచ్చునా యని యడుగకుండ నడిగినట్లనిపించెను. అతఁ డంగీకరించినట్లు తోఁచెను. పురోహితుఁడు లోనికిఁ బోయెను. రాత్రి రెండుజాములు కావచ్చుచుండెను. రాజు పురోహితుని జూచి తాను లేచి కూర్చుండెను. ప్రక్కనున్న యాసనముపై పురోహితుని గూర్చుండుమని సన్నచేసెను. ఆయన కూర్చుండెను. కొంతసేపిరువురును మాటాడలేదు.

పురో : ప్రభూ! నన్ను క్షమింపవలయును. నాకుఁ దెలియక ప్రొద్దుట భోజనము చేసితిని.

రా : ఆర్యా! మావంశము చమత్కారమైనది. ఇదిగోనందవంశము. గోనందుఁ డన్న పేరుగల రాజులు మువ్వురయినారు. మూఁడవగోనందుఁడు లౌకికాబ్దమున పదునెనిమిదివందల తొంబదినాలుగేండ్లు జరిగిన తరువాత రాజ్యమునకు వచ్చెను. మూఁడవ గోనందునినుండి నేను పదునొకండవవాఁడను. నా తండ్రి పేరు హిరణ్యకులుఁడు. నా పేరు వసుకులుఁడు. నా కొడుకుపేరు మిహిరకులుఁడు. మా వంశములోఁ గులశబ్ద మంతమందుఁగల రాజులు మరెవ్వరును పుట్టరు. మేము మువ్వురమే! నా తండ్రియు నేనును నా కొడుకును. నాతండ్రి హిరణ్యకులుఁ డరువదియేండ్లు పాలించెను. నే నరువదియేండ్లు పాలించితిని. మిహిరకులుఁడు డెబ్బదియేండ్లు పాలించును. ఇది కార్తాంతికుల నిర్ణయము. మహర్షుల నిశ్చయము. కాలస్వరూపుఁడైన పరమేశ్వరుని సంకల్పము. లౌకికాబ్దారంభమందు నే నేఁబది తొమ్మిదవ రాజును. మిహిరకులుఁ డరువదియవవాఁడు. భారత యుద్ధము నాటినుండి నేటివఱకు మే మేఁబది తొమ్మండుగురము రాజులము పాలించితిమి. మిహిరకులుఁడరువదియవవాఁడు. ఈ యరువదియవసంఖ్య చిత్రమైనది. ప్రభవమొదలు నక్షయవఱకు నరువది. ఈ లెక్క బరువైయనగా విస్తృతమయి పునఃపునరానీయమానమై పరిగణనకు వైశాల్యము చాలక శకసంవత్సరములుగా జనులు జీవించుచుండిరి. ఇది యుధిష్ఠిరాబ్దము. లౌకికాబ్దము సప్తర్షి కాలము. ఈమన కాశ్మీరదేశమున మనము దీర్ఘ పరిగణనము సహింపక వంద వంద యేండ్లుగా లెక్కపెట్టుకొనుచుందుము. ఇది డెబ్బదిరెండవ సంవత్సరము. సప్తర్షిమండలము వంద వంద యేండ్లుగా నొక్కొక్క నక్షత్రమున నుండును. ఏవంద కావంద వదలిపెట్టి మనము క్రొత్తగా లెక్కపెట్టికొందుము. యుధిష్ఠిరచక్రవర్తి నిర్యాణము

జరిగిననాఁడే సప్తర్షిమండలము మఖా నక్షత్రమును వదిలిపెట్టి యాశ్లేషా నక్షత్రమునఁ బ్రవేశించెను. ఇప్పటి కిరువది మూఁడువందల యేండ్లు జరిగెను. తరువాత నిది డెబ్బది రెండవ సంవత్సరము. నా తండ్రియు నేనును నా కొడుకును ముచ్చరము నొక విశిష్టమైన లక్షణము కలవారము. ముచ్చరము కలిసి సుమారు రెండువందల యేండ్లకాలము పాలింతుము. అనంతాకాశమున నిండినకాలము, అనంత భూప్రదేశమున నిండినకాలము సమస్త భారతదేశమున నిండినకాలము కాశ్మీర దేశమునత తద్దేశ నియమితమై వైలక్షణ్యము కలదై యిచటి యీ రెండు వందల యేండ్ల కాలమున మఱియు వైలక్షణ్యముకలదై కులశబ్దాంతమైన నామధేయములుకల మా ముచ్చరిలోఁ చివరివాఁడైన మిహిరకులుని రాజ్యములో పెతేలుమని పగులును. నాల్గునాళ్ళక్రిందఁ దమరు నాతోఁ జెప్పితిరి. అట్టివి నేను వంద వింటిని. నేఁడు మీ రందరును వచ్చి యంతర్వేశికునిచేత మఱియొకటి చెప్పించితిరి. నే నింక తొమ్మిది దినములు బ్రదుకుదును. ఈ తొమ్మిది దినములలో మఱి యింకెన్ని విందునో? నేను తండ్రిని. ఆయన కుమారుఁడు. కడుపు చించికొనినచోఁ గాళ్ళమీఁదఁ బడును. నాకొఱకు భోజనము మానవద్దు. నేటి నా నిరాహారత రాజప్రాసాదమున క్రొత్త. రేపటికిఁ గొంచెము ప్రాఁతపడును. ఎల్లుండి భోజనముచేయని వారుండరు. నేను రాజును, అతఁడు యువరాజైనను నేను శిక్షింపవచ్చును. కాని యతఁడు నన్ను శిక్షించెడి స్థితిలో నున్నాఁడు. సైన్యమంతయు నతని చేతిలో నున్నది. సేనాపతి వానిమాట వినును. నేను వృద్ధుఁడనయినాను. అతఁడెట్టి రాజగునో తెలియుచునే యున్నది గదా! కాని మహావీరుఁడు. చండశాసనుఁడు. వజ్రశరీరుఁడు. వానియం దొక ధర్మబుద్ధి లేదనుటకు వీలులేదు. అతఁడు క్రూరుఁడు. ధర్మమును క్రౌర్యముతో నిర్వర్తింప నక్కఱలేదు. దోషమును క్రౌర్యముతో శిక్షింపనక్కఱలేదు. పోయి పండుకొని నిద్రింపుడు."

రాజు మరల మాటాడలేదు. పురోహితుఁడు లేచి వెడలిపోయెను. రాజుమరల తన మేను సెజ్జమీఁదఁ దార్చెను. మరికొంతసేపటికి రాజు ద్వారగత పురుషునితో నిట్లనెను. "ఏమోయీ? నీ వేళ యయిపోలేదా? రాత్రి రెండుజాములు కాలేదా? వాఁడు వచ్చినంతనే నీవు పొమ్ము. నా భోజనముతో నీ కవసరములేదు. ఓయీ! సేవకుని ధర్మ మెట్టిదనఁగా యజమాని చెప్పిన పని చేయుట మాత్రముతోఁ బర్యవసించునది. రాజు నిద్రపోవలె నని సేవకుఁడు నిద్రపోకుండుట, రాజు తినలేదని సేవకుఁడు తినకుండుట సేవకుని ధర్మములోని భాగములు కావు. లోకములోని జనులు కృతజ్ఞతాభరిత హృదయులై మితిమీఱి సంచరింతురు. దానిని కొందఱు పొగడినచోఁ బొగడుదురుగాక. నేను పొగడను. రాజు చనిపోయినచో నశౌచము రాజభార్యలకు రాజ కుటుంబమునకు. సేవకుల కశౌచము లేదు. ఒకరాజు పోయినచో నింకొకరాజు వచ్చును. దేశమునందలి ప్రజలనందఱు నశౌచము నవలంబింపుఁ డనుట దుఃఖమును పొందుఁ డనుట పరిపాలకుల యవివేకము. పరిపాలకుల యహంకారము. సాలెవాఁడు గుడ్డ నేసియిచ్చును. ఆ గుడ్డను ధరించిన [illegible]ఁడు సాలెవాఁడు చనిపోఁగా దుఃఖింపవలయునా! రాజ్యపాలన మొక బట్టను నేయుటవంటిది. ఆ వస్త్రమును లోకము ధరించుచున్నది. ఆ వస్త్రము చినిగిపోవును. క్రొత్త వస్త్రమును కొనును, ధరించును. ఒక్కొక్కప్పుడు క్రొత్తబట్టయే కొట్టుపట్టును. ఒకఁడు దానిని కుట్టించికొని ధరించును. ధనవంతుఁ డయిన వాఁడహంకారి యయినవాఁడు నొడలి కండలు పెంచినవాఁడు తద్వస్త్రమును దిరస్కరించి మఱియొక వస్త్రమును గొని కట్టుకొనును. భోగము వ్యక్తి విషయములో నొక విధముగా నుండును. ఒకదేశముయొక్క ప్రజా సంబంధమున నింకొక విధముగా నుండును. వాఁడు వచ్చినాఁడు. నీవుపొమ్ము." క్రొత్త దౌవారికుఁడు వచ్చెను. ప్రాఁతవాఁడు వానితో లోని కెవ్వరిని పోనీయరాదన్న రాజాజ్ఞను జెప్పెను. వాఁడు వెళ్ళెను. వీఁడు నిలుచుండెను. యువరాజు వచ్చెను.

ఒకే నిముసములో జరిగిన తన ధర్మస్వీకరణము తద్ధర్మభావనా నిరూఢత మనసునకుఁ గలుగనంతటి వేళలో యువరాజు వచ్చెను. యువరాజునుగూడఁ గాదనుటకు మనసు దిటవు చేసికొనువ్యవధి లేదు. వానిని నిరాదరించినట్లు యువరాజు లోనికిఁ బోయెను. రాజు కనులు మూసికొనియుండెను. యువరాజు కాలిసవ్వడి వినిపించెను. కాలి సవ్వడి వినిపించినట్లు తన గదిలో నడచెడివాఁడెవడు? పరిచారకుఁడు కాఁడు. అనుమానమెందుకు! మిహిరకులుఁడని తెలియుచునే యున్నది. తండ్రికిఁ గొడుకు ముఖలక్షణమే కాదు, వాని కంఠస్వరమే కాదు, వాని పాదములను జూచుటయే కాదు వానిని జూడకుండనే వాఁడు నడచెడి నడకచేత గాలిలోఁ గదలెడి కదలికనుగూడ వాని పాదవిన్యాస జనిత ధ్వనికూడఁ దెలియును. ఇది తండ్రికిఁ గొడుకు నందలి ప్రేమ లక్షణము. స్పర్శ యక్కఱ లేదు.

తన కొడుకు తక్కడికి వచ్చినాఁడన్న గుర్తు వానిచుట్టు సంచరించు గాలిలో కలిగెడు చివురాకు కదలిక యంత సన్నని కదలిక కలిగించు సవ్వడికూడఁ గలిగించును. మిహిరకులుఁడు వచ్చెను. అంతటి ప్రేమ జన్మజన్మాంతరములనుండి వచ్చినది, తన ప్రతి రక్త బిందువునందు నిండినది, నిత్య జాగ్రదవస్థాభూతమైనది, పరమమైన యార్ద్రతా సహితమైనది యేమైనది? తన కొడుకు యొక్క చర్యనుగూర్చి తాను విన్న మాటల చేతఁ గలిగిన విముఖత్వముచేతఁ గన్నులను తెఱచి చూడనీయలేదు. ఆర్ద్రత యార్ద్రతయే. విముఖత విముఖతయే. జీవుఁడు జీవుఁడే! రాజు రాజే! కొడుకు కొడుకే! దుర్జనుఁడు దుర్జనుఁడే! సర్వజగన్నిర్మాత యొక్క నిర్మాణ సన్నివేశ మెంత పరమ సూక్ష్మతంతు సంవలితమైనది!

మిహిరకులుఁడు గడియసేపు తండ్రి తలవైపున నున్న కనకాసనమున గూర్చుండెను. తండ్రి కనులు తెరవలేదు. ద్వారపురుషునియొద్దకుఁ బోయి 'తండ్రిగారు నిదురపోయి యెంతసేపైన' దని యడిగెను. అతఁడు తనతో సమానకాలమునఁ దానుకూడ వచ్చె ననియుఁ దనకుఁ దెలియదనియుఁ జెప్పెను. మిహిరకులుఁడు వెడలిపోయెను. అతఁడు ద్వారపురుషునితో మాటాడుటలోఁ దండ్రికి నిద్రాభంగమగునన్న యూహగాని తండ్రి యానాఁడు భోజనము చేయలేదని యతనికిఁ దెలిసియుండును గనుక దానికి సంబంధించిన కొంత మనఃకష్టముగాని గోచరింపలేదు. కాని మిహిరకులుఁడు వెనుకకుఁ దిరిగివచ్చి తండ్రియొడలు స్పృశించి చూచెను. పాదములు స్పృశించెను. కొంత పాదసంవాహనము చేసెను. అంత వెడలిపోయెను. రాజిట్లనుకొనెను. 'వీనిలో నాత్మ సంపూర్ణముగా నశించిపోలేదు. కాని వీని యందు ధార్ష్ట్యము దురహంకారము నిండియున్నవి.' మిహిరకులుఁడు వెడలిపోయెను. అతఁడు తన సౌధమున యధేచ్ఛముగా నుండి నిద్రించెను. అతఁడు మరునాటి ప్రొద్దుననే మేల్కొని కాల్యకృత్యములు తీర్చికొని ప్రాశనము చేసి మరల వెడలిపోయెను. అతఁడు రాత్రి పట్టపు గుఱ్ఱమునే యెక్కివచ్చెను. ఆ గుఱ్ఱమును తండ్రిగారి గుఱ్ఱపుకొట్టములోఁ గట్టలేదు. తన గుఱ్ఱపుసాలలోనే తానే కట్టెను. ప్రొద్దుట తానే యూడఁదీసెను. రాత్రి తానే దాని నసజ్జితము చేసెను. ఉదయమున దానిని దానే సజ్జితము చేసెను. పవలెల్లఁ గొండలలో గుహలలో శిలాతలములమీఁద, వాగులలో యధేచ్ఛముగా దానిని ద్రిప్పెను. తన కెంత యలసట లేదో దాని కంతయలసట లేదు. కాశ్మీర కాంతారములు బహు ఫల వృక్షభరితములు. ఆత్తులు, ద్రాక్షలు గుత్తులు గుత్తులు. మిహిరకులుఁడు తాను తినినన్ని తినెను, గుఱ్ఱము కూడ యధేచ్ఛముగా భుజించెను. ఇరువురకును దిన్నకొలఁది జవసత్త్వము లధికమగుచుండెను. దుర్ఘటములైన లోయలు దానిచేత దూకించును. ఒక దీర్ఘమైన లోయను దూకుటకు గుఱ్ఱమును బ్రోత్సహించెను. ఆవలి తటమును జేరులోపల నశ్వమందులోఁబడి చనిపోవునని తా నొడ్డునకు లంఘించును. గుఱ్ఱముకూడ సురక్షితముగా లంఘించును. మరల దా నేగి దాని నధిరోహింపఁ బ్రయత్నించును. ఆ యశ్వము కాదనదు. మిక్కిలి సాధువై యతని నధిరోహింపనిచ్చును. అతఁడు నివ్వెరపోయి దాని నెక్కును. మరలఁ దిరుగును. అతని కొక యూహ వచ్చెను. తానారగించు ఫలము లన్నిటిని కోమల పల్లవములను గుఱ్ఱము గ్రసించుచుండెను. తనతోఁబాటు దానికిని శ్రమ లేకుండెను. తనతోఁబాటు దానికిని సత్తువ వచ్చుచుండెను. ఇంక దానిని భుజింపనీయరాదు. ఒక సన్నని తీగ తెచ్చి దాని మూతిని బిగించి కట్టెను. అది కట్ట నిచ్చెను. కట్టుట బిట్టుబిగించి కట్టెను. గుఱ్ఱమున కది బాధాజనకముగా నుండి తీరవలయును. మరల నధిరోహించెను. మరల నెంతో దవ్వు దానిని ద్రిప్పెను. మరల నొక లోయను దూకించెను. ఆ యశ్వ మెన్నిటినైన సహించుచుండెను. దానినేమి చేయవలయునో తెలియలేదు. నిన్న నేవేళకు గురువు నెచ్చోట గలసి కొనెనో యా వేళ కచ్చోటికి వచ్చెను. గురువుకొఱకుఁ బ్రతీక్ష చేసెను. అతఁడు రాలేదు. గురువు తప్పకుండ వచ్చు ననుకొనెను. కడచిన రాత్రి ప్రొద్దుపోయి వేయి దీనారములు గురువు నింటికిఁ బంపించెను. ఈ నాటి సాయంకాలమునఁ గృతజ్ఞతా భరిత హృదయుఁడై గురువు నిస్సందేహముగ నిచ్చటికి వచ్చు నని యతఁ డనుకొనెను. రాలేదు. గురువు కృతఘ్నుఁ డనుకొనవలయును. కృతజ్ఞతా గుణ మతనియందు లే దనుకొనవలయును. గుఱ్ఱమువంక చూడగా దాని ముట్టియనుండి నెత్తురు వచ్చుచుండెను. ముట్టియు యుబ్బియుండెను. కుటిలుఁడైన గురువు కుటిలుఁడైన యజమానియు నిద్దఱు నొక్కటియే. విద్యార్థిని ప్రశ్నలు వేసి తప్పించి వాఁడు తప్పెడి వఱకుఁ బ్రశ్నలు వేసివేసి కుటిలుఁడైన గురువు వాని నప్పుడు శిక్షించును. సాధువై క్షమావంతుఁడై వినయవంతుఁడైన సేవకుని శిక్షింప నెంచిన యజమానుఁడు దుర్ఘటములైన పనులు చెప్పి వాఁడు సర్వ కార్యములు చేసినను జివరకు వాఁడు చేయలేని యొక కార్యమును జూపించి వానిని శిక్షించును. వానిని పదవినుండి తొలగిం

చును. ఈ గుఱ్ఱము ముట్టియుబ్బియుండెను. నెత్తురు కారుచుండెను. అది తాను పడుచున్న బాధను వ్యక్తము చేయుటలేదు. తల నాడించుటకూడలేదు. మరలఁ దానెక్కఁబోగా నది వాఱించలేదు. కదలలేదు. దీని నేమి చేయవలయును. గురువు రాలే దన్న కోపము గుఱ్ఱమునందు దోషమయ్యెను. గురువు వచ్చినచో నతని నేమి చేయును? ఆ ప్రశ్న నతఁడు తన్నే వేసికొనెను. మరికొన్ని విషయము లాయన నుండి తెలిసికొనవలయును. మూఁడవ ప్రశ్న వేయవలయును. అతఁడు సమాధానము చెప్పలేనిచోఁ దానే చెప్పవలయును. గురువుకంటెఁ దానే పండితుఁడని చూపింపవలయును. ఇంతియే యతఁ డనుకొనెను. తా నంతకంటె నధికముగా ననుకొన లేదని యతఁడు తనకుఁ దాను చెప్పికొనెను. గురువుకంటెఁ దా నధికుఁడు. తన యాధిక్యమును గురువు సాగనీయలేదు. గుఱ్ఱముకంటెఁ దా నధికుఁడు. గుఱ్ఱము సాగనిచ్చుటలేదు. ఒకచోట దిగి గుఱ్ఱపు ముట్టె నున్న తీగను సడలింప నెంచెను. అటు నిటు నుబ్బిన దాని ప్రోథము సన్నగా ముడివేసిన చోటు కనిపింప నీయలేదు. ఖడ్గముతో గోసినచో దాని ముట్టె నరుకఁబడును. మాటాడకుండ మరల నింటికిఁ బోయి పట్టపుగుఱ్ఱమును దంత్రి కొట్టములోఁ గట్టివేసి దా నేమియు నెఱుఁగనట్లుండినచో నే మగును? ఈ కట్టు వారు మాత్ర మెట్లు తొలఁగింతురు? వైద్యులుందురు. వారికి నేర్పుండును. సన్నని చిదుకత్తితో నీ బిగించిన తీగెను గోయుదురు. తన ఖడ్గ మాపని చేయలేదు.

మరల ప్రొద్దు గ్రుంక నారంభించెను. ఎఱ్ఱని వింత చీకటులు వచ్చెను. గుఱ్ఱమే యెఱ్ఱనిది. దానిముట్టె మరియు నెఱ్ఱవడినది. ఆ యెఱ్ఱని సంజచీకటులలో గుఱ్ఱపుముట్టె వాచినట్లులేదు. ఎఱ్ఱఁబడినట్లు లేదు. తాను ప్రొద్దుపోయిగాని యింటికిఁ బోరాదు. అంతవఱకు గుఱ్ఱము బ్రదికియుండునా? దాని కన్నులు కనుపించునా? కనిపించినచో దారి తెలియదు. త న్నెట్లు తీసుకొనిపోవును? జంతువులకుఁ గనులు కవిపించ నక్కఱలేదు. గ్రుడ్డితన మున్నను పరిచితములైన ప్రదేశములందు జనులు విహరింతురు. జంతువులును సంచరింపఁగలవు. గురువు రాలేదు. ఆలస్యముగా వచ్చినాడేమో చూతమని మరల గుఱ్ఱము నెక్కి యచ్చోటికిఁ బోయెను. అచ్చట నున్న కొండవాగు పైనెచట వానలు కురిసినవో యింతలో నుబికి వచ్చెను. దాట తగినట్లులేదు. గుఱ్ఱమును దూకించెను. అది వెనుకాడలేదు. కొండవాగుల వేగము ఝంఝామారుతమువలెనుండును. ప్రవహించునవి నీళ్ళయినను రాళ్ళు దొరలించినట్లుండును. గుఱ్ఱము కొట్టుకొనిపోవుచున్నది. కాని యిరువది గజములు కొట్టుకొని పోవుచుండును. ఇంతలో గజముతటము వైపునకుఁ జేరుచుండును. చివరి కిద్దఱును దటముఁ జేరిరి. తా మొడ్డు చేరినస్థలము గురువు వచ్చినచోఁ బ్రతీక్షింపవలసిన స్థలమునకుఁ జాల దూరమున్నది. గుఱ్ఱము తడిసిపోయెను. తాను తడిముద్ద యయ్యెను. గుఱ్ఱము నడుముమీది జీను సన్నని పట్టుపరుపులతో నిర్మింపబడెను. అది తడిసి యిప్పుడు రెట్టింపు బరువయ్యెను. తాను ధరించిన యంగీ తనకే బరువుగా నున్నది. చలిదేశములలో సన్నని దూదిలోన నిమిడించి యంగీలు కుట్టుదురు. మిహిరకులుని యంగీ తడిసి నాల్గురెట్లు బరువయ్యెను. గుఱ్ఱము మాటాడకుండఁ బోవుచుండెను. ఇది యుద్ధాశ్వము. యుద్ధములో దాని కినుప కవచము వేయుదురు. ఇనుప కవచము తొడిగికొనిన రాజు దాని నదిరోహించును. గదయు ఖడ్గములును ధనుస్సును రాజు మోయుచుండును. ఈ బరువు నంతయు నది మోయగలదు. అందుచేత నిది దానికి లెక్కలేకుండెను. గుఱ్ఱమును పరుగెత్తించెను. అది పరుగెత్తుచుండెను. తనకు ముందున్నది కనిపించుటలేదు. దానికిఁ గనిపించుచుండెను. చీకటిలో మానవులకుఁ గనులు కనిపింపవు. జంతువులకుఁ గనిపించును. వరదలై వచ్చిన యావాగును దాటుటలోఁ జాలకాలమయ్యెను. జాము ప్రొద్దుపోయెను. అచ్చట గురువు లేఁడు. వచ్చి వెడలిపోయెనేమో! వచ్చిన తరువాత నెట్లు వెడలిపోవును. అసలు రాలేదేమో! రాకుండుటకు వెనుదీయనివాఁడు వచ్చి వెడలిపోవుట కెందుకు సంశయించును! ఇవి రెండు పరిస్థితులు. మొదటిది రాకుండుటకే సాహసించుట. అది రాజాజ్ఞాధిక్కారము. రెండవది వచ్చి కొంతసేపుండి వెడలిపోవుట, ఇదియు రాజాజ్ఞాధిక్కారమే. మొదటి ధిక్కారము జరిగినచో రెండవది జరుగదు. జరుగనిచో రెండవదియు జరుగదు. రెండుధిక్కారము లెవ్వడును జేయలేఁడు. ఇప్పుడు గురువు రెండు ధిక్కారములుచేసినట్లు మిహిరకులుఁడుభావించెను. ఇవిరెండు దోషములగుటవలనఁ బ్రయోజన మేమి? కోప మిబ్బడి యగుటయే ప్రయోజనము. కోప మిబ్బడి యయినచో శిక్ష యధికమగును. ఇట్టి యాజ్ఞాధిక్కారము బట్టపుగుఱ్ఱము చేయలేదు. తొలుతఁ గొంత చేసినది. అది తెలియని చేయుట. తొలుతఁ దెలియకపోవుట యేమి! జంతు లక్షణము. జంతు లక్షణము సహింపరానిది. ఒక పాపము చేయవచ్చును. దానికి నిష్కృతి చేసికొనవచ్చును. గుఱ్ఱము నిష్కృతి చేసినది. ఆ నిష్కృతి చాలదా? చాలదు.


పాపమెంత తీవ్రముగా నుండునో నిష్కృతి యంత తీవ్రముగా నుండవలయును. పూర్వము తన గురువు తనకుఁ జెప్పిన వన్నియు నపసిద్ధాంతములు. పాపము పాపమే. నిష్కృతి నిష్కృతియే. పాప నిష్కృతులయొక్క తీవ్రతలు నిష్ప్రయోజనములు. అవి మనస్సుయొక్క కాలుష్యాతిశయోద్బోధకములు. పురుషుఁడు స్త్రీ సంగమము చేయును. సంగమించుట, గర్భధారణము, శిశుప్రసవము ముయ్యేడలనొక్కటియే. కాని సంగమవేళ తీవ్రతయుఁదీక్షత్వమును గలిగిన సంతానమునందుఁ బ్రతిబింబింపవు. అది వారి కామోద్రేక లక్షణము మాత్రమే. గురువుచెప్పిన యీమాట తనకు నచ్చలేదు. గురువన్నాఁడుకదా వాని కామోద్రేకమువలన వాఁడు కన్న సంతానమునందు గూడఁ దీవ్రతయుండునని. అట్టిచో నిష్కృతి యందలి తీవ్రత పాపక్రియాచరణమునందలి తీవ్రతను నిస్సందేహముగాఁ బరిహరింపవలయును. అశ్వమునందు మూఁడుదోషములు సంక్రాంతములై యున్నవి. తొలుతఁ దన్నధిరోహింపనీయని దోషము, తక్కిన రెండును గురువుచేసినవి. అతఁడు వచ్చినచో దోసమేలేదు. వచ్చినచోఁ దన సంశయవిచ్ఛేదము చేయని దోషము లధికములు సంప్రాపించి యుండెడివి. అవి యన్నియుఁ గట్టకట్టుకొనివచ్చి గుఱ్ఱము నెత్తిన గూర్చున్నవి. కడచినరాత్రి తండ్రి మేల్కొనియే యుండెను. తనతో మాటాడుటకిష్టములేక కన్నులు మూసికొనియుండెను. పట్టాశ్వమును దా నెక్కివచ్చితినని యెవరో నిస్సందేహముగఁ దండ్రికిఁ జెప్పియుందురు. అతఁడు తన్నడుగలేదేమి? ఆయన యడుగలేదు సరిగదా రాజుయొక్క సాహిణి తన యింటికి వచ్చి గుఱ్ఱముకొఱకు వెదురుచూడవలయును. వాఁడు రాలేదేమి? ఈ గుఱ్ఱమును వాఁడు పట్టించుకొనలేదు. మిహిరకులునకుఁ దాను మహాపరాధములను గొన్నిటిని మూటకట్టిన యొక ప్రోవుమీఁదఁ గూర్చున్నట్లుండెను. చీకటులు బాగుగా నలముకొన్నవి. ఇక రాజసౌధమునకుఁదిరిగి పోద మనుకొనెను. గుఱ్ఱము మీఁదఁ బోవుటయా? నడచిపోవుటయా? చీఁకటిలోఁ దాను పోగలఁడా? తన కచట మార్గములన్నియును పరిచితములే? గుఱ్ఱము మీఁద వెళ్ళినచో మరల రేపు గుఱ్ఱముమీఁద రావలయును. రావచ్చును. నిన్న తాను తన గురువుతో నేఁడు కలసికొమ్మనెనా? రేపు కలసికొమ్మనెనా? నిన్న నెల్లుండి యని చెప్పెను. నేఁ డని తానే పొరపాటుపడెను. కనుక రేపు రావలయును. గుఱ్ఱమునందు నపరాధముల బరువు తగ్గినది. ఎల్లుండి యని చెప్పినమాత్ర మేమి? నేఁ డెందుకురారాదన్న యూహవచ్చెను గాని దృఢము గా లేదు. ఇంటికిఁ దిరిగిపోయెను. గుఱ్ఱమును దానే కట్టివేసెను. ఈనాఁడు జీను తీయలేదు. చీకటిలో దాని ముట్టివంకఁ జూడలేదు. రేపటికి గుఱ్ఱము బ్రతికియుండునో బ్రతికి యుండదో యన్న యూహ రాలేదు. తాను పోయి స్నానాదికములు చేసి భోజనమాచరించి మరలఁ దండ్రి యొద్దకుఁ బోయెను. మహారాజసౌధ మంధకార బంధురమై యుండెను. దీపములు వెలిగింపలేదేమి యన్న యువరాజు కేకవెంట వత్తి తగ్గించి పెట్టఁబడిన పది దీపముల వత్తు లెగసనఁ ద్రోయఁబడి యతనికి మార్గదర్శు లయ్యెను. తండ్రి గదిలోనికిఁ బోయెను. అచట మంత్రి యున్నాఁడు. పురోహితుఁడున్నాఁడు. అంతర్వేశికుఁడున్నాడు. కనులు మూసుకొనియున్న తండ్రి మంచము మీఁదఁ బరుండి యున్నాఁడు. రాజ ప్రకృతుల యౌన్నత్యాదులనుబట్టి యువరాజు మూఁడవవాఁడు. ప్రథముఁడు మంత్రి, ద్వితీయుఁడు పురోహితుఁడు. అంతర్వేశికుఁ డారవవాఁడు. అతఁడు లేచి నిలుచుండెను. మంత్రి పురోహితులు లేవలేదు. మంత్రి యొక్క యంసములు నతములయ్యును శరీర ముత్థానాభిముఖమై యున్నట్లుండెను. పురోహితునియందా లక్షణము కనిపింపలేదు. ఒకపీట రత్నస్థగితమైనది యచట యువరాజుకొఱకుండనేయుండెను. యువరాజు కూర్చుండలేదు. యువరాజు నిలుచుండుట చూచి యొక రెండు నిమిషముల తర్వాత మంత్రి యొక వ్యాజమును గల్పించి లేచి నిలుచుండెను. పురోహితుఁ డవనత శిరస్కుఁడై యట్లే కూర్చుండెను. రాజు కొంతసేపటికిఁ గన్నులు తెఱచెను. కుమారునివంకఁ జూచెను. మరలఁ గన్నులు త్రిప్పికొనెను. ఎవ్వరును మాటాడలేదు. రాత్రి సరిగా రెండుజాము లైనది. హజారమున గంటలు వినిపించెను. మరల యువరాజు పోయి తండ్రి పాదములు స్పృశించెను. నిన్న వెచ్చగా నున్నవి, నేఁడు చల్లగా నున్నవి. తండ్రివంకఁ జూచెను. ఆయన కనులు తెఱవలేదు. యువరాజు వెడలిపోయెను. ముప్వరధికారులును క్రమముగా వెడలిపోయిరి.

మిహిరకులుఁడు మఱునాటి ప్రొద్దున కాల్యకృత్యములు నిర్వర్తించి తన యధికారిని బిలిచి గురువు నింటికి మరల వేయి దీనారములు పంపి గుఱ్ఱపుసాలలోనికిఁ బోయెను. గుఱ్ఱము మేఁతమేయుచుండెను. ముట్టెకుఁ గట్టులేదు, కాపులేదు. తాను దగ్గరకుఁ బోగా నశ్వము సంతోషసూచకముగా సకిలించెను. రాత్రిరాత్రియంతయు సనజ్జితమై యున్న యా గుఱ్ఱము ఒడిలినట్లులేదు. ఇతడు గుఱ్ఱముమీఁద నెక్కెను. నిన్న నితరులు చూడకుండ గుఱ్ఱమును గొండల మీఁదికిఁ

దీసికొనిపోయెను. నేఁడు నిర్భయముగాఁ బోయెను. అందరకుఁ బట్టపు గుఱ్ఱము తెలియును. కర్ణాకర్ణిగా నీ వ్యతిక్రమము విన్నవారొకరిద్దఱు కలరు. అందఱును విస్వెలు పోయిరి. పోయిన విస్వెలు గుండెలలో నాగిపోయెను. మొగములలోఁ గనిపించెడిదేమోః పార్శ్వముల కొత్తగిల్లి వంచిన తలలుగా నిలుచుండుట చేతఁ గనిపించలేదు. గుఱ్ఱము దాటిపోగా నందరును నిలుచుండి వెనుకనుండి చూచినవారే. రాజు యొక్క ప్రాయోపవేశము రాజగృహములందందఱకుఁ దెలియును. ఎవనికి వానికిఁ గారణము దెలిసినట్లే యుండెను. మాటికి మాటికిఁ బ్రాణములు గుప్పిళ్ళలోనికి వచ్చుచుండెను. కాని వెనుకకుఁ బోవుచుండెను. మరల సరిగా నిన్నటి నడకయే. కాంతారారణ్యగిరిఝరీ ప్రదేశముల మిహిరకులుఁడును గుఱ్ఱమును నడచిరి. ఒక్కటియే భేదము. నేఁడు గుఱ్ఱమునకు మూతికట్టు లేదు. ఆ వేళకు మిహిరకులుఁడు మరల నాచోటికి, గురు వేచోటికి రావలయునో యాచోటికి వచ్చెను. గురువు లేఁడు. ప్రతీక్షించెను. గురువు రాకపోవుటకుఁ జేయవలసిన యాలోచన యంతయు నిన్ననే చేసెను. నేఁ డేమియు మిగులలేదు. నిన్న వేయి దీనారములు పంపెను. నేఁడు వేయి దీనారములు పంపెను. రానిచో గురువునందఱి దోషము నాల్గు రెట్లగును. అచట నిశ్చయమైనది. గుఱ్ఱముయొక్క ముట్టికట్టు తా నెట్లూడినది. ఆ వాగు నిన్నటివలెనే ప్రవహించుచుండెను. రాత్రి యున్నంత వేగము లేదు. తగ్గిన వేగము మిక్కిలి తక్కువ. నిన్న నేతీగతో దాని ముట్టెను బిగించెనో యా తీగను వెదకితెచ్చి మరల దాని ముట్టెను బిగించెను. గుఱ్ఱము నెక్కి వాగులో దిగవేసెను. అవతలియొడ్డు చేరువేళకు సంపూర్ణముగా వెలుతురు పోయెను. దాని ముట్టెను పరీక్షించుటకు బదులు గుఱ్ఱమును మరల వాగులోనికి దింపెను. ఈ యెడ్డునకుఁ జేరువేళకు నిన్నటికంటె రెట్టింపు వేళ యయినది. రెట్టింపు దూరమైనది. మరల గురువు రావలసినచోటికిఁ బోవలయునా? అతఁడు వచ్చినచో మరల రేపు తాను వచ్చువఱకు నతఁ డచట నుండవలయును. గుఱ్ఱమును రాజసౌధమునకు మరలించెను. తన కొట్టములో దానిని గట్టివేసెను. స్నానము చేసెను, భోజనము చేసెను. తండ్రి యొద్దకుఁ బోయెను. అచట నెవ్వరునులేరు. వెనుకటి దినమున దీపములు వెలిగించిన వారు యువరాజు కొఱకుఁ బ్రతీక్షించుచు వచ్చుచుండె వచ్చుచుండెనని దీపములు వెలిఁగించిరి. తండ్రి కనులు మూసికొనియే యుండెను. ద్వారపాలకుఁడు ప్రవేశార్హత లేదని చెప్పఁబోయి చెప్పలేదు. మిహిరకులుఁడు తండ్రి పాదములు స్పృశించి వెడలిపోయెను. అతని కప్పుడు జ్ఞప్తికి వచ్చెను. గుఱ్ఱపు ముట్టెయొక్క తీగకట్టు ఝరీకరణవేళ సడలిపోయినదా యన్న సంశయముతోఁ దాను దానికి మరల కట్టి నదీతరణము చేసెను. ఇప్పుడు దాని ముట్టెకుఁ గట్టున్నదా? యువరాజు వెంట సేవకులు దివిటీలు తెచ్చిరి. గుఱ్ఱపు నోటికిఁ గట్టు లేదు. ప్రవాహ వేగమునకుఁ గట్టు నడలునా? ఆ జలములో నా తీగను ఛేదించు గుణమున్నదా? గుఱ్ఱము మీఁది జీనును తీయించెను. పోయి నిదురించెను. మఱునాఁడు మరల గుఱ్ఱము నధిరోహించి పర్వత కాంతార ఝర్గీ ప్రదేశములు తిరిగెను. గురువుకోసమా వేళ కచ్చటికిఁ బోయెను. ఆయన యచట లేఁడు. సంజ చీకట్లు రాకమున్నఁ దాను దన ప్రాసాదమును జేరెను. గురువుకొఱకు వార్త పంపెను. గురు వింటి యొద్ద లేఁడని వార్త వచ్చెను. ఆయన వచ్చెడివఱకుండి యాయనను పిలిచికొని రమ్మని భటులను బంపెను. వారు ప్రొద్దున పోయివచ్చిరి. గురువుకుటుంబము నిన్ననే రాజధానిని వదలిపెట్టిపోయెనఁట!

[సశేషము]

ప్రధానమంత్రి ఆంధ్రప్రదేశ్ పర్యటన




నవంబరు 8 న గుంటూరు బహిరంగసభలో
ప్రసంగిస్తున్న ప్రధానమంత్రి

గుంటూరు సభలో ప్రసంగిస్తున్న భారతప్రభుత్వ
సమాచార శాఖామంత్రిణి శ్రీమతి ఇందిరాగాంధి.







గుంటూరు బహిరంగసభలో ప్రసంగిస్తున్న
ముఖ్యమంత్రి.



నవంబరు 9 న విజయవాడలోని గాంధీకొండలపై గాంధీస్తూపాన్ని ప్రధానమంత్రి ఆవిష్కరించిన దృశ్యం.


నవంబరు 10 న తిరుపతి బహిరంగసభలో ప్రసంగిస్తున్న ప్రధానమంత్రి.






తిరుపతిలో బహిరంగసభ మరోదృశ్యం.

తిరుమల కొండకు వెళ్ళడానికిముందు అలిపిరివద్ద
ప్రధానమంత్రికి ఏనుగు పూలమాల వేస్తున్న
దృశ్యం.







తిరుమల దేవాలయంవద్దకు చేరుకున్న ప్రధానమంత్రి.

ప్రధానమంత్రికి స్వాగతం చెపుతున్న దేవాలయ
పండితులు.







తిరుమలలో ప్రధానమంత్రికి తిరుపతి దేవాదాయ.
దేవాలయ ఉద్యోగులను పరిచయం చేస్తున్నదృశ్యం.



తిరుమల దేవాలయంలో ప్రధానమంత్రి.



నవంబరు 10 న ప్రధానమంత్రి తిరుపతిలో మైసూరు
సత్రానికి ప్రారంభోత్సవం జరిపిన దృశ్యం.



తిరుమలలో తమ కుటుంబంతో ప్రధానమంత్రి.


పాపనాశనంవద్ద ప్రధానమంత్రి.





ప్రధానమంత్రి గౌరవార్థం నవంబరు 10 న జరిగిన శ్రీమతి సుబ్బలక్ష్మి గానకచేరి.


శ్రీమతి సుబ్బలక్ష్మి గానకచేరి మరోదృశ్యం.





ప్రధానమంత్రి కుటుంబంతో తిరుమలవద్ద.

ప్రధాని మద్రాసుకు వెళ్ళే సందర్భంలో రేణిగుంటలో
వీడ్కోలు చెపుతోన్న శ్రీ ఆలపాటి వెంకట్రామయ్య.



ఆంధ్రౌన్నత్యము

—యల్లమిల్లి ప్రభాకరరావు

జాతికి జీవము పోయునది చరిత్ర. ఏజాతి కైనను నూతనోత్సాహమును ప్రసాదించునది ఆ జాతి చరిత్రయే. అత్యున్నత ప్రాచీనచరిత్ర కల్గియుండుట ప్రతిజాతికి ఏకైక గర్వకారణమని చెప్పుటలో అతిశయోక్తిలేదు. భరతఖండమున అనన్యసామాన్య వైభవోపేతమైన చరిత్రకల్గివిరాజిల్లినజాతులలోమనజాతియొకటి. దుర్గమారణ్య భూభాగమును మానవ నివాసయోగ్యము చేయుటయేకాక నందనోద్యానముతో తులతూగునట్లు చేయగల్గిన ప్రాచీనాంధ్రుల చరిత్ర పఠనీయము.

జాతి పుట్టు పూర్వోత్తరాలు

ఆంధ్రజాతి ప్రాచీనమైనది. క్రీ. పూ 3000 సం॥ క్రిందట రచింపబడిన యైతరేయ బ్రాహ్మనమునందు ఆంధ్రజాతినిగూర్చి ప్రస్తావించబడినది. విశ్వామిత్ర మహర్షికి నూర్గురు పుత్రు లుండిరనియు, వారిలో రెండవ ఏబదిమంది ఆయన ఆజ్ఞనుల్లంఘించి శాపగ్రస్తులై వింధ్యపర్వతముల నధిగమించి దక్షిణాపథమునకు చేరిరని తెలియుచున్నది, వారి సంతతివారిలో ఆంధ్రు లొకరు. కావున ఆంధ్రు లార్యులని తెళియవచ్చుచున్నది. వారు ఆక్రమించుకొనిన భూభాగమే ఆంధ్రదేశము. ఆంధ్రుల ప్రశంస రామాయణమునగూడ కలదు. దండకారణ్యములో ఆంధ్రులు శ్రీరాముని ఆదరించినట్లు రామాయణమువలన తెలియుచున్నది. అగస్త్యమహర్షికూడ వింధ్య పర్వతములను దాటి ఈ ప్రాంతమునకు వచ్చెను. విశ్వామిత్రుని సంతతివారు దక్షిణాపథమున వసించిన పూర్వప్రాంతీయులతో సంబంధ బాంధవ్యములను కలుపుకొని ఒక సమ్మిశ్రిత ఉచ్ఛ నాగరికతకు బాట వేసిరి. ఈ పూర్వ ప్రాంతీయులు 'నాగులు' అను జాతివారని తెలియుచున్నది.

త్రిలింగదేశము, త్రికళింగము

ఈ దక్షిణాపథవాసులను ఉత్తరహిందూ దేశములోని ఆర్యులు అంధదేశవాసులని పిలుస్తూఉండేవారు. బౌద్ధుల కాలములో 'అంధకులు' అని పిల్చేడివారు. ఈ శబ్దమే తరువాత ఆంధ్రశబ్దముగా మారినదని తెలియుచున్నది.

శ్రీశైలము, దాక్షారామము, శ్రీకాళహస్తి అను మూడు శివలింగ క్షేత్రములకు మధ్యనున్న ప్రాంతము 'త్రిలింగదేశము' అని పిలువబడినట్లు బ్రహ్మాండ పురాణములో వ్రాయబడినది. కాలక్రమేణా తెనుగుశబ్దము త్రిలింగశబ్దము నుండి వచ్చినదని తెలియుచున్నది:

పూర్వము మలయకొండలనుండి గోదావరివరకు గల ప్రాంతము 'త్రికళింగము' అని పేరుపొందినది. త్రికళింగశబ్దమే 'త్రిలింగ', 'తెలుగు' శబ్దములుగ మారినట్లు మరియొక అభిప్రాయము గలదు.

ఆంధ్ర,శాతవాహన సామ్రాజ్యములు

మన దేశచరిత్ర పుటలను తిరుగవేసిన ప్రాచీన ఆంధ్రసామ్రాజ్య వైభవము కనులకు కట్టినట్లు కన్పించును. ఈ సామ్రాజ్యము క్రీ. పూ. 3 వ శతాబ్దమునుండి క్రీ. శ. 8 వ శతాబ్దమువరకు మహోన్నత వైభవముతో అలరారెను. మౌర్యులు మగధనేలు కాలమున ఆంధ్ర రాజులు వారికి సామంతులై యుండిరి. మౌర్యులకు పూర్వము మగధనేలిన నందుడు నాగాంధ్రుడనికూడా చరిత్రకారు లూహించిరి. మౌర్యుల కాలమున ఆంధ్రులు 'భృత్యులు' అని పిలువబడెడివారు. క్రీ. పూ. 184 లో మగధరాజగు పుష్యమిత్రునకు ఆంధ్రరాజు శాతకర్ణి ఒకయుద్ధములో సహాయము చేసెను. (శ్రీముఖుడు పిదప మగధ నాక్రమించుకొనెను.) సుచంద్రుడు, ఆంధ్ర విష్ణువు, దీపకర్ణిక అను ముప్వురు ఆంధ్ర ప్రభువులపిదప శాతవాహనుడు ఆంధ్ర సింహాసనము నధిష్టించాడు.

ఆంధ్రవిష్ణువు సామ్రాజ్య సుస్థిరతకు కృషిసల్పిన మహనీయుడు. ఆతని రాజధాని శ్రీకాకుళము. శ్రీకాకుళములో శ్రీకాకుళాంధ్రదేవుని ఆలయముకలదు. అశోకుని కాలమున ఆంధ్రరాజులు వారికి సామంతులై యుండిరి. బౌద్ధమతమును కూడా ఆదరించిరి. ఆతని తరువాత శాతవాహనుడు లేక శాతకర్ణి స్వతంత్రుడయ్యెను. ఆతని వంశమే శాలివాహన వంశము. ఆతని సంతతివారు మధ్యప్రదేశము, బీరారు, హైదరాబాదులను జయించి రాజధానిని

అమరావతికి మార్చిరి. క్రీ. పూ. 27 లో కుంతలశాతకర్ణి మగధ నాక్రమించెను. ఆనాటికే వారు తమ రాజధానులను ప్రతిష్ఠాన పురము, వైజయంతులకు వరుసగ మార్చి యుండిరి. శాలివాహనుడు మహారాష్ట్రమును కూడ పరిపాలించెను. గుణాఢ్య పండితుడు ఇతని కాలములోనే 'బృహత్కథ' అను గ్రంథమును పైశాచికభాషలో వ్రాసెను. శాతవాహనుని పిదప 30 మంది ఆతని వంశస్థులు ఆంధ్రరాజ్యమును పరిపాలించి నట్లు మత్స్యపురాణములో వ్రాయబడినది. వీరందరికి 'కర్ణి' అను నది బిరుదు. 'కర్ణాటకం' కర్ణిరాజులు పాలించిన భూభాగమే. క్రీ. పూ. 73 లో శ్రీముఖుడు ప్రభువు. క్రీ. పూ. 52 నాటి హాలమహారాజు స్వయముగ 'గాథాసప్తశతి' అను గ్రంథమును ప్రాకృతములో వ్రాసెను.

శివశాతకర్ణికాలములో (క్రీ.శ.109–130) పశ్చిమ రాజ్యభాగమును గుజరాత్, మాళవ దేశ ప్రభువులు గెల్చిరి. తరువాత గౌతమీ పుత్ర శాతకర్ణి కాలమున సామ్రాజ్యము ఉచ్ఛస్థితిలోనికి వచ్చినది. ఈ ప్రభువు కాలములోనే నాగార్జున పండితుడు జీవించి యుండెను. యజ్ఞశ్రీ శాతకర్ణి కాలమునాటి నాణెములు కన్పించాయి. ఆ నాణెములపై ఓడల చిత్రములు కలవు. ప్రాచీనాంధ్ర శిల్పములలోకూడ నౌకాచిత్రములు కాన వచ్చుచున్నవి. అజంతా చిత్రకళయందు నౌకాచిత్రములు కలవు. నిజముగ ప్రాచీనాంధ్రుల నౌకాయాన కౌశలమూ, నౌకాబలము, విదేశ వాణిజ్యము అతి ప్రతిభావంతము లని ఋజువుపరచునవి వారినాణెములే. కొన్ని ప్రాచీన నాణెములపై విల్లంబుల చిహ్నము కూడ కలదు. నాడాంధ్రుల చిహ్నము నౌక. తమ నౌకాబలముతో శాతవాహనులు సముద్రముల నేలిరి. కావున వారికి 'త్రిసముద్రాధిపతులు' అని బిరుదు ఉండెడిది.

క్రీ. శ ప్రథమ శతాబ్దమున భారత దేశమును పర్యటించిన 'టాలమీ' అప్పటి శాతవాహనసామ్రాజ్యముయొక్క వాణిజ్య నైపుణ్యమును ప్రశంసించెను. సన్నని, మృదువైన పొరలవంటి వస్త్రముల నల్లుట, వానిపై అద్దకము చేయుట వారికి ఉగ్గుతో పెట్టిన విద్య. అగస్టస్ సీజర్ రోము నేలు కాలమున ఆంధ్ర దేశమునుండి వచ్చు వస్త్రముల నెవ్వరు కొనరాదని శాసించెను. రోమన్ సామ్రాజ్య విదేశమారక ద్రవ్యము ఆంధ్రదేశమునకు వెల్లువవలె ప్రవహించుటయే దీనికి కారణము. ఇందులకు చారిత్రక నిదర్శనములు కృష్ణా, గుంటూరు జిల్లాలలో దొరికిన గ్రీకు నాణెములే.

ఆంధ్ర సామ్రాజ్య నగరములలో ధాన్యకటకము చాలా ప్రసిద్ధి నొందినది. దీనిని ప్రస్తుతము ధరణికోట అంటున్నాము. ఈ నగరమున ధాన్యరాసులు అశేషములుగా యుండెడివి. సామ్రాజ్యము ఉచ్ఛస్థితిలో దక్షిణమున మైసూరు మొదలు ఉత్తరమున గంగానదివరకు వ్యాపించినది. రాజులు పరమత సహనులై బౌద్ధ, జైనమతములనుకూడ ఆదరించిరి. బౌద్ధ విహారములు, స్థూపములు నిర్మించిరి. ఉత్తరమున 'శాలిహుండము' నుండి దక్షిణమున 'నాగార్జునకొండ' వరకు, తూర్పున 'నుండపల్లి' నుండి పశ్చిమమున 'కన్హేరీకర్లీ' వరకు నున్న గుహా చిత్రములలో యున్న బౌద్ధ చిత్రకళ అంతయూ ఈ కాలములోనిదే. అమరావతీ శిల్పవాస్తువు, ఎల్లోరా శిల్పకళ కూడా ఈ కాలమునాటిదే. నాగార్జునకొండ, జగ్గయ్యపేట, భట్టిప్రోలు, ఘంటసాల, గుడివాడల వద్ద లభించిన బౌద్ధ శిల్పకళా ఖండములు ఆంధ్రుల పరమత సహనమునకు, చిత్రకళా ఔన్నత్యమునకు గీటురాళ్ళు. ఆంధ్రులు వ్యాపారము చేసిన బర్మా, మలయా, సయాం, కాంబోడియా, యానాం, జావా, సుమిత్రాలలోని శిల్ప వాస్తుకళలో మహాబలిపురం, అమరావతి సాంప్రదాయ లక్షణములు గోచరించుచున్నవి.

'గాథాసప్తశతి', 'బృహత్కథ' ఆంధ్రుల సాహిత్యభాషా జ్ఞానమునకు రెండు మణిదర్పములు. ఆనాటి ఆచార వ్యవహారములు, పంటలు, వృత్తులు, వాణిజ్యము మొదలగునవి సమగ్రముగ తెలుపు గ్రంథము లవియే. ఆనాటికే వారు వరిపంట పిదప జనుమును పొలములలో చల్లెడివారట. ఇండోనేసియా లోని 'బారోబూరు' పట్టణమున అమరావతి శిల్పములు గోచరించుచున్నవి. బర్మాలోని 'తెలింగులు' తెలుగువారని చరిత్రకారుల అభిప్రాయము. అచ్చట దొరికిన శాసనముల లోని లిపి 1, 3 వ శతాబ్దములలోని ఆంధ్ర శాసనలిపిని బోలియున్నది. టాలమీ యాత్రికుని చరిత్రలో భారుకచ్ఛము, మచిలీపట్నము మొదలగు ఆంధ్రనగర నామములు కలవు.

రాజ భాషగా ప్రాకృతము వాడెడివారు. వృత్తులను బట్టి సంఘము లుండెడివి. మోటుపల్లి, భారుకచ్ఛము, మచిలీపట్నము రేవుపట్టణములు. పురుషులు పెద్ద తలపాగలను ధరించెడివారని అమరావతీ శిల్పమున తెలియుచున్నది.

ఆర్యావర్తమును గెలిచిన దాక్షిణాత్యులు ఆంధ్రు లొక్కరే. చంద్రగుప్తుని కాలమున భారత దేశమును పర్యటించిన మెగస్తనీస్ అను గ్రీకురాయబారి మౌర్య సామ్రాజ్యము తరువాత భారతదేశములో ఆంధ్రసామ్రాజ్యమును మించినది లేదు, అని వ్రాసెను. ఆనాడాంధ్రుల సామ్రాజ్యములో 30 వర్గములు, లక్ష కాల్బలము, రెండువేల

ఆశ్వికదళము, నాల్గువేల ఏనుగులు గలిగి యున్నదని తెలియుచున్నది.

ఇక్ష్వాకులు

శాతవాహనుల ప్రతిభ క్షీణింప నారంభించగనే వారి సామంతులగు ఇక్ష్వాకులు స్వతంత్రించిరి. వారి రాజధాని కృష్ణానది మీద నున్న విజయపురి. వీరి మొదటి చక్రవర్తి (క్రీ. శ. 200–219) వాసిష్ఠీ పుత్ర శాంతిమూలుడు. అతడు అశ్వమేధయాగం చేసాడు. 'వాసిష్ఠి' అనునది అతని తల్లిపేరు. క్రీ. శ. 218–219 వరకు పరిపాలించిన శ్రీ వీరపురుషదత్తుడు ఉజ్జయినిని పాలించు క్షత్రవుల కుమార్తెను పెండ్లిచేసుకొన్నాడు. కళింగ, కోసల రాజ్యములు ఇతని కాలములోనే ఆంధ్ర సామ్రాజ్యములో కలిశాయి. శ్రీ వీరపురుషదత్తుడు వైజయంతి నేలు నాగరాజుకు తన కుమార్తెనిచ్చి వివాహం చేశాడు. ఇతని తరువాత వారి ప్రతిభ క్షీణించినది.

పల్లవులు

కంచి రాజధానిగా ఏలు పల్లవులు ఇక్ష్వాకులను జయించి క్రీ. శ. 252 లో పల్నాడులో రాజ్యస్థాపన చేశారు. బృహత్ఫలాయనులు అను ఆంధ్రవంశీయులు పల్లవులను జయించుటకు చాల కృషిచేసిరి. వారిలో బోయవర్మ మహారాజు పేర్కొనదగినవాడు. పూర్వము వీరు శాతవాహన చక్రవర్తులకు సామంతులుగా యుండిరి. వీరి ముఖ్యపట్టణము కోడూరు. ఆనాటి గొప్ప ఓడరేవు. ఘంటసాల, అవనిగడ్డలుకూడ బృహత్ఫలాయనుల ఓడరేవులే. తూర్పుకోస్తా ప్రాంతములోని ఆనంద గోత్రికులు అను రాజులుకూడ మొదట శాతవాహనుల సామంతులే. వీరు కూడ తరువాత స్వతంత్రులైరి. వీరి రాజధాని విజయానందపురము. (బేజర్ల గ్రామము). ఆ గ్రామములో చాల ప్రాచీన శిథిలములు కన్పించాయి. క్రీ. శ. 295 మొదలు క్రీ. శ. 315 వరకు పరిపాలించిన మహారాజా దామోదరవర్మ దక్షిణాంధ్రములోని పల్లవులను జయించెను.

గోదావరీ ప్రాంతములోని శాలంకాయనులు మొదట శాతవాహనుల సామంతులు. క్రీ. శ. 60సం॥ నాటి పెరిప్లస్ గ్రంథములో వీరినిగూర్చి గలదు. వీరి రాజధాని వేంగిపురము, ధాన్యకటకమునుంచి ముసికా, ప్రతిష్ఠానపురముల మీదుగా భారుకచ్ఛము వరకు ఒక్కటే 'నాటురాస్తా' శాతవాహనుల కాలములో యుండెడిది. ఆ రాస్తాను వీరు కాపాడుతూ ఉండేవారు. ప్రస్తుతము ఏలూరు సమీపమున నున్న పెదవేగి, చినవేగి, దెందులూరు వేంగీపురము తాలుకు భాగములే. దీనిచుట్టు ప్రాచీనశిథిల నిర్మాణములు గలవు. వేంగిపురములో చిత్రరథస్వామి దేవాలయము కలదు. మొదటిరాజగు విజయదేవవర్మ (క్రీ.శ. 300–335) కాలములో వైదికమతము విజృంభించినది. ప్రస్తుతము గోదావరీ గర్భములో కలసిన 'ప్రాలూరు' వారి ఓడరేవు. బర్మా, సయాం, కాంబోడియా రాజ్యములలో వర్తకము చేసెడివారు. వర్తకముతో పాటు బౌద్ధ మతము, ఆంధ్రశిల్పముకూడ వ్యాపించినవి.

తరువాత విష్ణుకుండినులు ఆంధ్రరాజ్యము నాక్రమించిరి. వారి రాజధాని విష్ణుకుండిన పురము లేక వినుకొండ. వారిలో మొదటివాడగు మాధవవర్మ (క్రీ॥శ. 420–455) పల్లవులను శాలంకాయనులను ఓడించెను. తిరిగి విష్ణుకుండినులు సంపూర్ణ ఆంధ్ర సామ్రాజ్యమును స్థాపించారు. మాధవవర్మ అశ్వమేధయాగం చేసాడు. ఆ కాలములో కళింగరాజ్యముకూడ ఆంధ్రరాజ్యములోనిదే. రెండవ మాధవవర్మ కాలములో వీరిరాజధాని అమరావతి. మూడవ మాధవవర్మ (క్రీ. శ. 546–561) రాజ్యమేలు కాలమున అతని కుమారుని రథముక్రింద పడి ఒకబిడ్డ మరణింప ఆయన యువరాజునకు మరణశిక్ష విధించెను. ఆ ప్రభువు న్యాయపాలనకు విజయవాడలోని మల్లేశ్వరస్వామి సువర్ణ వర్షమును కురిపించెనట. ఉండవల్లి, బెజవాడ, నెల్లూరు జిల్లాల్లోని భైరవుని కొండ మొదలగు ప్రదేశములలోయున్న శిల్పములు వీరికాలము నాటివి. సంస్కృతము రాజభాష.

పల్లవులు దండెత్తి వచ్చి నెల్లూరు, గుంటూరు ప్రాంతముల నాక్రమించిరి. వారు వైదిక మతావలంబులు. క్రీ.శ.7వ శతాబ్దము నాటి కుమారిలభట్టు జైన బౌద్ధ మతములను ఖండించెను. జైమిని సూత్రములకు భాష్యం వ్రాసెను.

పశ్చిమ చాళుక్యులు

రాజ్య స్థాపకుడు పులికేశి. ఇతడు పల్లవులను వాతాపినుండి తరిమివేసి దానిని రాజధానిగా చేసుకొనెను. ఈ వంశములోని రెండవ పులికేసి (608–642) సౌరాష్ట్ర, కొంకణ, ఘూర్జర, మాళవ ప్రభువులను గెలిచెను. హర్షవర్ధనుని జయించి నర్మదా నదిని దాటి రానీయకుండ ఆపివేసెను. పులికేశి పల్లవ రాజగు నరసింహవర్మతో యుద్ధముచేయుచు మరణించెను. క్రీ. శ. 754 లో రాష్ట్రకూటులు రాజ్యము నాక్రమించిరి.

పశ్చిమ చాళుక్యులు యుద్ధమునందు గుఱ్ఱముల నుపయోగించెడివారు. రాజుల స్నానగృహములు సహితము చిత్రములతోను, స్ఫటికాలంకరణములతోను శోభించుచుండెడివి. రాజుల వస్త్ర గృహములయందు నానా విధములగు రంగువస్త్రములు యుండెడివి. చైనా, కళింగ, వంగ, పాండ్య, సింహళ ప్రాంతములనుండి కూడ

వస్త్రములను దిగుమతి చేసుకొనెడివారు. నేరములను విచారించుటకు ఆరుగురు లేక ఏడుగురు ఆలోచనా పరులగు సభ్యులతో ప్రతి గ్రామమున పంచాయతీసభ లుండెడివి. నేరములను విచారించి తగుశిక్షలు విధించెడివారు. చదరంగము, పావురముల పోరు, కోడి పందెములు, పాములాటలు, మేష మహిష పోరాటములు మొదలగు వినోదము లుండెడివి.

వ్యాపారము బండ్లపైనను, ఎద్దుల పైనను, దున్నలపైనను చేసెడివారు. ఇంద్రజాలము, చేతబడులు కూడా వాడుకలో యుండెడివి. వేదము, తర్కము, న్యాయ శాస్త్రము మొదలగునవి నేర్పుటకు విద్యా కేంద్రము లుండెడివి.

తూర్పు చాళుక్యులు

క్రీ. వె 61 లో రెండవ పులికేశి వేంగి దేశమును జయించి తన సోదరుడగు కుబ్జ విష్ణువర్ధనుని ప్రతినిధిచేసెను. క్రీ.వె. 632లో ఆతడు స్వతంత్రుడై తూర్పు చాళుక్య వంశమునకు మూలపురుషు డయ్యెను. ఇతని రాజధాని వేంగిపురము. ఇతడు పిఠాపురము నాక్రమించెను. వేంగీపురము ఏలూరునకు ఉత్తరముగ 7 మైళ్ళ దూరములో యుండెను. రెండుమైళ్ళ కైవారముతో అది మహావైభవముగ వర్ధిల్లెను. క్రీ. వె. 799 నుండి 843 వరకు పరిపాలించిన నృగేంద్ర మహారాజు రాష్ట్రకూటులతోను, గంగవంశము వారితోను 12 సం॥ లలో 108 యుద్ధములు చేసెనని శాసనములు వ్రాసుకొనెను. ఈ వంశములోని ఏడవ ప్రభువగు రాజమహేంద్రుడు రాజమహేంద్ర పురనిర్మాత. రాజరాజ మహేంద్రుడు క్రీ.శ 1022 – 1063 వరకు రాజ్యమేలెను. నన్నయభట్టు ఈయన ఆస్థానములోనివాడు. నన్నయభట్టు ఆంధ్ర శబ్ద చింతామణిని రచించెను. ఆంధ్ర మహాభారతమును అరణ్యపర్వము వరకు తెనిగించెను.

రాజరాజ నరేంద్రుని కాలములో వర్తక వ్యాపారములు వృద్ధిచెందినవి. దూర దేశములతో వాణిజ్య సంబంధములు పెంపొందినవి. వైదికమతము వృద్ధి చెందినది. జైన, బౌద్ధమతములు కూడా వ్యాప్తిలో నున్నవి. పెనుగొండ ఆకాలములో గొప్ప జైన క్షేత్రము. తెలుగులో గణిత శాస్త్రమును పావులూరి మల్లన రచించెను.

చోళ ప్రభువులు

ఆంధ్రదేశము క్రీ. శ. 8 వ శతాబ్దమున చోళుల ఆధీనమైనది. కుమార సంభవ మును రచించిన నన్నెచోళుడు ఈ కాలములోనివాడు క్రీ. శ. 12 వ శతాబ్దమున నెల్లూరు నేలిన హనుమసిద్ధి కూడా చోళ వంశస్థుడే. తిక్కనసోమయాజి ఈతనికాలములోని భారతములో పదునైదు పర్వములు తెనిగించెను. భాస్కరమంత్రి భాస్కరరామాయణమును అధర్వణాచార్యుడు అదర్వణచ్ఛందమును రచించెను. కేతన, బయ్యన, మారన మొదలగుకవులు ఈ కాలములోనివారు. వీరి కాలమున కూడా విదేశవ్యాపారము బాగుగా జరిగినది.

కాకతీయ సామ్రాజ్యము

చాళుక్య సామ్రాజ్య పతనానంతరము కాకతీయ సామ్రాజ్యావతరణతో మరల భానోదయ మైనది. గణపతిదేవుడు, రాణి రుద్రమదేవి సామ్రాజ్యమునకు మూల స్థంభములు. వీరి కులదేవత కాకతి. మొదటి ప్రభువు 1050 ప్రాంతపు ప్రోలరాజు. క్రీ.శ. 1158 నుండి 1195 వరకు పరిపాలించిన రుద్రమదేవుడు రెండవవాడు. ఈయన కాలములో మల్లికార్జున పండితుడు బసవ పురాణమును రచించెను. రుద్రమదేవుని పిదప రాజ్యమునకు వచ్చిన గణపతిదేవుడు క్రీ.శ. 1198 నుండి 1261 వరకు రాజ్యమేలెను. కళింగ, పాండ్య ప్రభువులను జయించెను. పాకాలచెరువు, రామప్ప శిల్పములు ఈయన కాలములోనివే. తరువాత రాజ్యమునకు వచ్చినది రుద్రమదేవి. సమర్ధవంత మగు పరిపాలనాదక్షత చూపి రుద్రమ్మ మనదేశ చరిత్రకు వన్నెతెచ్చినది. తరువాత సింహాసనమునకు వచ్చినది ప్రతాపరుద్రుడు. ఈతడు 1290 నుండి 1326 వరకు పాలించెను. ఈతని కాలములో సామ్రాజ్యము ఉచ్ఛస్థితికి అందుకొనినను, మహమ్మదీయ దండయాత్రలకు బలియైనది. మాలిక్‌కాఫర్ దండెత్తి ప్రతాపరుద్రుని బందీగా ఢిల్లీకి కొనిపోవుచున్నపుడు మార్గ మధ్యమున నర్మదానదీ తీరమున ఆత్మహత్య చేసుకొనెను.

కాకతీయసామ్రాజ్య కాలములో శైవ మతము వ్యాప్తిలోనికి వచ్చినది. రాజులు కళాపోషకులు. రామప్పగుడి, పాకాల చెఱువు, ఓరుగల్లు ద్వారము, వేయిస్తంభముల దేవాలయము వారి శిల్పకళాపోషణకు, శిల్ప చాతుర్యమునకు నిదర్శనములు. వారి రాజధాని ఓరుగల్లు గతించిన దేవేంద్ర వైభవమునకు చిహ్నముగ నిలిచియున్నది. మోటుపల్లి ఆనాటి గొప్ప ఓడరేవు. ఆ కాలములో మనదేశమును దర్శించిన 'మార్కొపోలో' ఆ సామ్రాజ్య వైభవమును కన్నులకు గట్టినట్లు వర్ణించినాడు. క్రీడాభిరామము ఆనాటి సంస్కృతి, సాహిత్యముల ప్రతిబింబము.

కాకతీయుల ఆయుధములు ముఖ్యముగా కత్తులు, బల్లెములు, ఏనుగులు, గుఱ్ఱములు కూడ ఎక్కువగ ఉపయోగించెడివారు. ఓరుగల్లును ఆంధ్రనగరము అని పిలిచెడి

వారు. ఓరుగల్లులో ఏడుకోట లుండెడివి. లోపలిది రాతికోట. దానిలో రాజు వుండెడివాడు. తురకలు విధ్వంసము చేసిన స్వయంభూదేవాలయము నాల్గుదిక్కుల హంస శిఖరములతో నుండిన పెద్ద శిల్ప స్తంభముల మహాద్వారము లుండెడివి. అందు ఇప్పుడు రెండు మాత్రమే అవశేషములు.

రాజులకు ఒక విధమైన గడియార స్తంభము లుండెడివి. కాకతీయుల కాలములో మతబోధ, వేదములు, కావ్యములు, న్యాయశాస్త్రము విద్యార్థులకు బోధించెడివారు. వస్త్రపరిశ్రమ, దంతపు పనులు, చెక్కపనితనము, కంబళ్లు, తివాసీ లల్లుట వాడుకలో నున్నవి. కాకతీయుల కత్తులు 'డెమస్కస్' కు ఎగుమతి చేయుచుండెడివారు. ప్రజలు జాగ్రత్తగా పరిపాలింపబడెడివారు. మోటుపల్లి, మచిలీపట్నము మొదలగు ఓడరేవులనుండి అరేబియా, చైనా, పర్షియా దేశములలో వర్తకము చేసెడివారు. నందికోట, తోలుబొమ్మలు, రంకులరాట్నం ఆనాటివే. స్త్రీలు గోరంటాకు గోళ్ళకు, శరీరమునకు పసుపు, కన్నులకు కాటుక, కాళ్ళకు పారాణి ఉపయోగించెడివారు. జాయపసేనాని 'నృత్తరత్నావళి' అను గ్రంథమును వ్రాసెను.

అలూఫ్ ఖాన్ "ఏదిక్కు చూచినను రెండుమైళ్ళ పొడవున నీటి నాళములు, తోటలు యుండెను. వాటిలో మామిడి, అరటి, పనస లుండెను. పుష్పములన్నియూ హిందూ పుష్పములే. చంపకము, మల్లి, మొగలి పూలుండెను" అని ఓరుగల్లును వర్ణించెను.

వెలమ, రెడ్డి రాజ్యములు

వీరు మొదట కాకతీయచక్రవర్తుల సేనానులు. రాచకొండ, దేవరకొండ రాజ్యములను వారు ఆక్రమించుకొనిరి. క్రీ. శ. 1323 లో అద్దంకి రాజధానిగా రెడ్డిరాజ్యము వెలసినది. నాచన సోమనాథుడు దాని ఆస్థాన కవి. తరువాత రాజధాని కొండవీటికి మారినది. క్రీ. శ. 1383 నుండి 1400 వరకు పరిపాలించిన అనవేమారెడ్డి సుప్రసిద్ధుడు. కుమారగిరిరెడ్డి రాజ్యముచేయుచు వసంతరాజీయము అను కావ్యమును రచించెను. తరువాత పెదకోమటి వేమారెడ్డి ప్రభువయ్యెను. ఈతని ఆస్థానకవి శ్రీనాథుడు.

శ్రీనాథుడు రచించిన నైషధము, హరవిలాసము, పలనాటిచరిత్ర పేర్గొనదగినవి. ఆయన పద కవిత్వమును నాదరించెను. ఆయన సమకాలికుడు పోతన. ఆయనసార్వజనీ నాదరణము పొందిన మహాభాగవతమును రచించెను. అనంతామాత్యుడు తెనుగుభాషకు కీర్తిప్రతిష్ఠలు తెచ్చెను. హరిశ్చంద్రోపాఖ్యానమును, నవనాథ చరిత్రమును, లక్షణదీపికను రచించిన గౌరన, కవియోగివేమన ఈ కాలములోని వారే.

కొండవీడు విశాలమైన రాజవీధులతోను విపణివీధులతోను రమణీయ ఉద్యాన వనములతోను, రమ్య హర్మ్యములతోను విలసిల్లినవి. సేరి, తవాయి, మొదలగు విదేశములలో వర్తక వ్యాపారము చేసిరి. మోటుపల్లి ఓడరేవు. ఏనుగులు, గుఱ్ఱములు, రత్నములు, ముత్యములు, బంగారము. వెండి. కస్తూరి, చందనము మొదలగునవి వ్యాపార వస్తువులు. జ్యోతిషశాస్త్రవేత్త మామిడి సింగన్న. ప్రఖ్యాత కవులగు పెద్దిభట్టు, వామనభట్టు, గౌడడిండిమభట్టు మొదలగువారు ఈ కాలములోనివారే. సంగీతకళకూడ అభివృద్ధి చెందినది. ప్రతిగృహమున రాట్నము వాడెడివారు. పట్టుబట్ట లుపయోగించెడివారు. ముడి ఇనుమును భూమినుండి తీసెడివారు. అద్దములు వాడుకలో నున్నవి. తాళపత్రములపై గంటముతో వ్రాసెడివారు. క్రీడా సరస్సు లుండెడివి.

పెదకోమటి వేమారెడ్డి కాలమున భాస్కరాచార్యుడను ప్రసిద్ధినొందిన ఆయుర్వేదశాస్త్ర వైద్యుడుండెను. రెడ్డిరాజులు మహోన్నత దుర్గములను కట్టించిరి. అందు గృహరాజు మేడ ముఖ్యమైనది.

విజయనగర వైభవము

మహమ్మదీయ దండయాత్రవలన పతనమైన కాకతీయ సామ్రాజ్య పునాదులపై తల ఎత్తి హైందవమతమును, ఆచార వ్యవహారములను, నిలబెట్టిన మహోన్నత సామ్రాజ్యము విజయనగర సామ్రాజ్యము. తుంగభద్ర నదీతీరమున హంపీ క్షేత్రమున శ్రీ విద్యారణ్యస్వామి ఆశీర్వాదముచే హరిహరరాయలు, బుక్కరాయలు అనుసోదరులు దీనిని స్థాపించిరి. క్రీ. శ. 1505 న నరసనాయకుడు రాజ్యమును పాలించుటలో తుళువ వంశము ప్రారంభమైనది. క్రీ. శ 1507 న సింహాసనము నధిష్ఠించిన శ్రీకృష్ణదేవరాయలు జగపతుల, సుల్తానుల మదమణచి కన్యాకుమారి మొదలు కృష్ణా, తుంగభద్రా నదులవరకు రాజ్యమును పెంచెను.

రాయలు కళాపోషకుడు, పండితుడు. 'దేశభాషలయందు తెలుగు లెస్స' అని పలికి స్వయముగ 'ఆముక్తమాల్యద' అను గ్రంథమును రచించెను. ఆంధ్ర, గీర్వాణ, కన్నడ భాషలను పోషించెను. ఆంధ్రభోజుడని వాసికెక్కెను, ఆయన ఆస్థానములోని అష్టదిగ్గజములు తెనుగుభాషకు నూతనభూషణములను ప్రసాదించిరి. అల్లసాని పెద్దన మనుచరిత్రమును, నందితిమ్మన పారిజాతాపహరణమును, భట్టుమూర్తి హరిశ్చంద్రోపాఖ్యానము మరియు వసుచరిత్రను, ధూర్జటి కాళహస్తి మాహాత్మ్యమును, మల్లన రాజశేఖర చరిత్రమును, రామభద్రుడు సకలకథా

పార సంగ్రహము మరియు రామాభ్యుదయమును, పింగళి సూరన రాఘవ పాండవీయము, కళాపూర్ణోదయము, ప్రభావతీ ప్రద్యుమ్నమును, తెనాలి రామకృష్ణుడు పాండురంగ మాహాత్మ్యమును రచించిరి. కవయిత్రి మొల్ల ఈ కాలములోనిదే. ఇట్లు రాయలయుగము ప్రబంధయుగమై విరాజిల్లినది.

ఉగ్ర నరసింహాలయమును, విఠలాలయమును, హజారరామాలయమును, శివాలయమును కట్టించెను. పోర్చుగీసు ఇంజనీర్ల సహాయమున కాల్వలను, జలాశయాలను త్రవ్వించెను. దేశము పాడిపంటలతో సుభిక్షముగ నుండెడిది. 300 రేవుపట్టణములతో విదేశవ్యాపారము జరిగెడిదట.

విజయనగరము చుట్టుకొలత 14 మైళ్ళు. ఏడు ప్రాకారములు గల్గియుండెడిది. మొదటి మూడు ప్రాకారములలో వ్యవసాయము చేసెడివారు. విజయనగర పురవీథులలో రత్నములను రాసులుగ పోసి విక్రయించుచుండెడివారు. ఆ నగరములో నున్న దసరా దిబ్బ గోడలమీద నున్న సైనికచిత్రముల పంక్తులు ఒకవైపునుండి చూచిన పురుషుల వలెను, మరియొక వైపునుండి చూచిన స్త్రీల వలెను కన్పించును. రంగులు వేయుట కూడ ఆకాలమున కలదు. పద్మమహలు, ఏనుగుల శాల, గణేశువిగ్రహము నేటికిని నిలిచియున్నవి.

క్రీ. శ. 1420 లో విజయనగరమును దర్శించిన 'నుకోరికొంటి' అను ఇటలీ యాత్రికుడు "60 మైళ్ళ కైవారము కల్గి 70 వేల యుద్ధవీరులను కల్గియున్నది" అని విజయనగరమును వర్ణించెను.

అబ్దుల్ రజాక్ అను పెర్షియా యాత్రికుడు "చక్రవర్తి ధనాగారములు కరగించిపోసిన బంగారపు సొరంగములు" అని వ్రాసెను.


పోర్చుగీసు యాత్రికుడు "సుందరమైన తటాకములతోను, ఉద్యానవనములతోను, లక్షకు మించిన భవనములతోడను విజయనగము రోమునగరమంత పెద్దదిగ యున్నది" అని కొనియాడెను.


క్రీ. శ. 1516 లో విజయనగరమును చూచిన బార్బోసీ "చాల జనసంఖ్యగల్గి దేశీయ వజ్రములు, పెంగూ కెంపులు, చైనా, అలెగ్జాండ్రియాల పట్టు, మలబారులోని ఇంగిలీకము, కర్పూరము, మిరియము, మంచి గంధము మొదలగువానికి వర్తకకేంద్రమై అలరారుచున్నది" అని వేనోళ్ళ కొనియాడెను.

ఇట్టి విజయనగర వైభవము క్రీ. శ. 1565 సం॥ తాళికోట యుద్ధముతో నామమాత్రావశిష్ఠమైనది. మహమ్మదీయ సేనానివహ పదఘట్టనముచే పతనము చెందినను హంపీ, విజయనగర శిథిలములు ఆంధ్రౌన్నత్యమును జ్ఞప్తికి తెచ్చుచున్నవి.

విజయనగర రాజులపిదప ఆంధ్ర రాజ్యము మరల తల ఎత్తలేదు. మొదట గోల్కొండరాజ్యమున చేరినను, పిదప మొగల్‌పాదుషా ఔరంగజేబు వశమైనది. తరువాత నైజాము రాజ్యములోనూ ఆ పిమ్మట బ్రిటిషువారి చేతులలోకి చేరిపోయినది. దేశ స్వాతంత్ర్య సముపార్జనలో గూడ ఆంధ్రులు గణనీయమైన కృషి సల్పిరి.

దండయాత్రా పరంపరలచే నశించి, పరాయి ప్రభువుల పాలబడినను, ఆగడచిన స్వర్గయుగముల వైభవములను తలచుకొని కన్నీరు విడువని ఆంధ్రు డుండడు.





వెన్నెలరేయి

—వఝ్ఝల కాళిదాసు

శా. శ్రీ లక్ష్మీ రుచిరస్మితంబు
        లమృతస్తోమంబులున్ దేవతా
స్త్రీ లావణ్య విలాస విభ్రమములున్
        క్షీరాబ్ధి ధావళ్యముల్
ప్రాలేయాంశురుచుల్ తమోపహ
        యశో వాల్లభ్యముల్ పైడి చూ
లాలున్ స్థాపన ముద్రితన్ నిమిరె
        సౌహార్దమ్ము సాంద్రమ్ముగా !

గీ. స్వచ్ఛమైన మానస సరోవరమునందు
నబ్జమధ్యంబునన్ రాజహంస పగిది
తారకాగణ పరివేష్టితమయి నిర్మ
లాంబరంబునఁ జంద్రబింబంబు తనరె.

ఉ. అంబర దుగ్ధసాగరమునందు
        వెలుంగను దేవతాళి ధ్వాం
తంబను దానవుల్ కలసి
        త్రచ్చఁగఁ బుట్టిన శీకరాళి బు
ద్బుదంబులు, ఫేనమాలికలు
        క్రమ్మెడు వెన్నెలలున్, సుధా చులూ
కంబు శశాంకబింబ మనఁగాఁ
        దనరారె శరన్నిశీ గతుల్ !

క. రవి గ్రుంకినంతఁ జీఁకటి
భువిఁ గ్రమ్మనటంచుఁ గాలపురుషుఁడు భాను
చ్ఛవిఁ బ్రతిఫలింపఁ జేయన్
దవిలించిన ముకురమో యనన్ శశి తోఁచెన్ !

చ. సరసినిఁ బిల్లగాలి నును
        చక్కిలిగింతలఁ బుట్టు లేయలల్
దిరుగఁగ వానిలోఁ బ్రతిఫలించి
        శశాంకుని వేయిబింబముల్
వరఁగె కుముద్వతీ ప్రమదలన్
        జలకేళులయందుఁ దన్పఁ జం
దిరుఁడు నభస్థలిన్ వదలి
        నీరమునందుఁ బ్రవేశమయ్యె నాన్ !

చ. చిరు కెరటాల యూయెలలఁ
        జిత్రముగా విహరించుచున్ బర
స్పరముగ మూరుకొంచు
        నెకసక్కెము లాడుచుఁ దేలి మున్గుచున్
సరసున సంచరించెడి
        ఝషమ్ముల మైమెఱుఁగుల్ స్ఫురించె న
ప్పరమును వీడి తారకలు
        వ్రాలి యటన్ విహరించుచున్నటుల్ !

ఆ. కటికి రేయితిండి కరముల గిలిగింతఁ
బులకరించి కులుకు కలువకన్నె
కరఁగుచుండె మోదభరమున ననఁగ వె
న్నెలలతళుకు లీను కొలను దోఁచె !

ఉ. మిన్నున నాడు నచ్చరల
        మేని తళత్తళ లుర్విమీఁదకున్
గ్రన్నన జారుచుండె ననఁ
        గన్పడె వెన్నెలవెల్లువల్ ; తదీ
యోన్నత చందనాంకిత
        కుచోపరిన ర్తిత రత్నహార సం
పన్నిలయమ్ములై కనులపండువు
        సేసెను దారకావళుల్ !

క. తళతళ మని మిలమిలమని
వలిపమ్ముల నీను పసిఁడి వలువ సొగసులన్
దలపించు లేత వెన్నెల
వెలుఁగులఁ బూదోట కనుల విందొనరించెన్.

ఉ. అల్లన గాలిలోఁ గదలియాడుచుఁ
        బచ్చిక లేఁత కంబళుల్
తెల్లని వెల్గులన్ బ్రతిఫలించుచు
        నుండఁగ దర్శనీయమై
చల్లని చందమామ నును
        చక్కిలిగింతలలో ధరిత్రి సం
ఫుల్ల మనస్కయై
        కరిగిపోవుచునుండె ననన్ గనంబడెన్ ! ! !

ఇంతే

రావూరి ప్రసన్న సత్యనారాయణ

'ఈ పరిస్థితిలో ఏం చేయటమో నాకేమీ పాలుపోవటం లేదు. ఏ మార్గమైనా మీరే ఆలోచించి నిర్ణయించండి'. ఆందోళనతో మాట పెగలక వూరుకున్నాడు మహారాజు విక్రమేంద్రవర్మ.

'ప్రభూ! ఈ సందర్భంలో ఎవరైనా చేయవలసింది చేయగలిగింది ఒకేఒకపని. ప్రచండసేనుడు కోరినట్టు కల్యాణిని తీసుకొచ్చి అతనికి ఒప్పగించడమే', మంత్రి సుబుద్ధి తన నిశ్చయాన్ని చెప్పేశాడు.

రాజు దీర్ఘాలోచనలో యున్నారు.

'ఏమిటి ఆలోచిస్తున్నారు?'

'ఆఁ ఏమీ లేదు. మీ అమ్మాయి కల్యాణిని మా సేనాని దగ్గరకు ఒకసారి పంపుతారా అని ఎంతసామంతుడైతేమాత్రం ఏ మొగంతో అడగటమా అనుకుంటున్నాను.'

'ప్రభువులు చిత్తగించాలి. ఇష్టాయిష్టాలు గాని బాగోగులు కాని ఆలోచించటానికి ఇది సమయం కాదు ప్రభూ! పరిస్థితి విషమించింది!'

'పెళ్ళి చేసుకోమంటే అందుకేమో ఒప్పుకోకపోయె. కల్యాణిని పాపం చేతులార చెడగొట్టటమా!'

'ప్రభువులు మన్నించాలి. ప్రచండసేనుడి చేతుల్లో ఆయుధం వుంది. వాడు తలుచుకుంటే ఈ సమస్త భూతలాన్నీ క్షణంలో మసి చేయగల మారణాస్త్ర మది. దాని నతను ప్రేల్చకుండా చూడటమే మన కర్తవ్యం, ధర్మముగూడ. లక్షలాది ప్రజల జీవితాలకంటె, రాజ్యంకంటె, మీకంటె, జయసింహుడికంటె కల్యాణి, కల్యాణి జీవితం ఎక్కువైనవా ప్రభూ! లోకశ్రేయస్సు కోసంకాని ధర్మంవల్ల ప్రయోజనం ఏమిటి ప్రభూ!'

'సరే, మీ యిష్టం. కానివ్వండి.'

'సెలవిప్పించండి. రేపు ఉదయమే జయసింహుడి దగ్గరకు వెళ్ళివస్తాను.' అని వంగి నమస్కరించి రహస్యాలోచన మందిరాన్నుంచి వెళ్ళిపోయాడు సుబుద్ధి. రాత్రి పన్నెండు గంట లయివుంటుంది.

* * *

జయసింహుని రహస్యాలోచన మందిరం దగ్గరగా ఒకరి కొకరు ఎదురెదురుగ జయసింహవర్మ, మంత్రి సుబుద్ధి ఆసీనులై వున్నారు. జయసింహుడు మెల్లగా సంభాషణ ప్రారంభించాడు.

'మహామంత్రీ! ఒక్కవార్త పంపితే నేనే వచ్చేవాణ్ణిగదా! మీరై రావలసిన అవసరం ఏమిటో:'

'మహారాజా! నేనే రావలసి వచ్చింది. ఏమీ ఫరవాలేదు. ముఖ్యమైన ఒక చిన్న విషయం మాట్లాడదా మని వచ్చాను. మా ఆస్థానంలో శాస్త్రజ్ఞుడు సత్యశీలి వున్నాడే ఆయన ఆమధ్య మహాపట్టుదలతో ఏవో పరిశోధనలు సాగించాడు. ఏదో ఒక కొత్త విషయాన్ని కనిపెట్టాలని చివరకు హిమాలయాలకు వెళ్ళి నాలుగేళ్ళు నిద్రాహారాలు లేకుండా కఠోరమైన తపస్సు చేశాడు.'

'ఔను. వెడుతున్నాడని విన్నాం.'

'ఔను రాజా: ఆ తపస్సు మహిమవల్లనో యేమో ఆయన అస్త్రం అంటూ ఒకటి కనిపెట్టాడు. దాంతో కన్ను మూసి తెరిచేంతలో కొన్ని లక్షలమంది జనాన్ని నాశనం చెయ్యవచ్చుట. అణ్వస్త్రం అని దాని కాయన పేరు పెట్టాడు.'

'ఆఁహఁ' ఆశ్చర్యంగా చూస్తున్నాడు రాజు.

'ఆ అస్త్రంనించి రక్షింపబడేందుకు తగిన కట్టుదిట్టాలతో ఆశ్రమం ఒకటి నిర్మించుకుని ఆయన మా నగరం పక్క కొండమీద వుంటూ రెండేళ్ళనుండి తన పరిశోధన లేవో ఇంకా సాగిస్తూనేవున్నాడు. అక్కడికి అట్టె జనాన్ని గూడా రానివ్వటం లేదు.'

'ఆఁ ఐతే?'

'మా దండనాయకు డున్నాడే —'

'ఎవరు ప్రచండసేనుడా?'

'ఉఁ అతను మెల్లగా సత్యశీలి పక్కన చేరి శుశ్రూష ప్రారంభించి ఆ అస్త్రాన్ని గురించిన ప్రయోగోపసంహారాది వివరాలన్నీ తెలుసుకుంటూ శాస్త్రాన్ని నేర్చుకొవా లన్న అసక్తిని ప్రకటిస్తూవచ్చాడు. రాత్రింబగళ్లు ఆశ్రమంలోనే ఆ యిద్దరూ వుండేవారు.'

'అయితే ఏమయింది?' కుతూహలం ఎక్కువైంది రాజు మనస్సులో.

'ఉన్నట్టేవుంది మొన్నరాత్రి సత్యశీలిని వంపేసి అస్త్రాన్ని చేజిక్కించుకున్నాడు. ఆ ఆశ్రమాన్ని ఆక్రమించేశాడు. ఆశ్రమం ఇప్పుడు శిబిర మైంది.'

'ఎంతపనయింది!' దీర్ఘంగా చూస్తు న్నాడు రాజు.

'నిన్నటినుంచి అతని ఆటలకు హద్దు లేకుండా వుంది.'

'ఉండదూ మరి! కోతికి కొబ్బరికాయ దొరికితే?'

'అతనిబుద్ధి' బుగ్గిగాను ఎంతవరకు వచ్చాడో చూడండి. ఇంతకుముందు ఎప్పుడో మీ అమ్మాయని చూచాట్ట. రెండు రోజులలో ఆ అమ్మాయిని తెచ్చి యిస్తే యిచ్చినట్టు— లేకపోతే అస్త్రం వుండనేవుంది అని ప్రభువులనే నిన్న సాయంకాలం బెదిరించాడు రాజా!'

'మా అమ్మాయినా? కల్యాణినా?' తత్తరపోయి చూస్తున్నాడు జయసింహుడు.

'ఔను మహారాజా! పెళ్ళి చేసుకోమని ఎన్నివిధాలనో నచ్చచెప్పిచూశాం. కానీ యేమీలాభంలేదు. కార్యం మించిపోయింది.'

'అమ్మాయిని పంపమన్నారా? ఇందు కేనా మీరు వచ్చింది? ఆ పాపిష్టుడి దగ్గరకు పంపమన్నారా మంత్రీ! జరగని పనికోసం వచ్చారు. నా గొంతులో వూపిరి వుండగా బ్రహ్మాండం తల్లక్రిందు లయ్యేది; బ్రహ్మ విష్ణు రుద్రాదులెదురై నిలచేది; ఆ నీచుడికి పిల్లనివ్వను మంత్రీ; ఇవ్వలేను. ఇక మీరు వెళ్ళవచ్చు.' లేచాడు రాజు. ఆవేశంలో మాట ఆగిపోయింది. కళ్ళనిండా నీరు కమ్మింది.

సుబుద్ధి ఆలోచనామగ్నుడై తిరిగి యీ లోకంలోకి వచ్చాడు. తానుగూడా నించు న్నాడు.

'మహారాజా; మీ పరిస్థితిలో వుంటే నేనూ అమాటే అంటాను. దీర్ఘంగా ఆలో చించండి; మీ హృదయవేదనను కాదనను. ఏ తండ్రీ అలా చేయలేడు. మీకంటె ఎక్కువ వేదనను అనుభవించినతరువాతనే మార్గం లేక నిర్జీవంగా మీ దగ్గరకు వచ్చాను అడగటానికి. ఏ కల్యాణి జీవితాన్ని పూల పాన్పులా చేసి ఆనందించుదామనుకుంటు న్నారో, ఏ కల్యాణిని చూడనిది క్షణం గూడ వుండలేమనుకుంటున్నారో ఆ కల్యాణి గూడ వుండబోదు, పంపనందువల్ల. మీరు మేము ఎవరమూ వుండము. రాజ్యమే వుండదు. సర్వము నాశనమే. ఒక వ్యక్తి సంఘం దృష్టిలో చెడిపోయినా ఎన్ని లక్షల మంది ప్రాణదానం చేసి ఒక రాజ్యానికి రాజ్యాన్నే నాశనంనించి కాపాడిం దంటే అంతకంటె ఏం కావాలి? ప్రచండసేనుడు దుర్జనుడు. అతనికంటె సర్పం ఎన్ని విధాలనో నయం. ఐనా ఇప్పుడు మించి పోయింది లేదు. మీ మంత్రులతోగూడ ఆలోచించండి.'

రాజు, తరువాత సుబుద్ధి తిరిగి కూర్చు న్నారు. జయసింహుని మంత్రి మహామతిని పిలిపించాడు. అతనితో పరిస్థితి అంతా విప్పి చెప్పాడు సుబుద్ధి. అంతా విని ఎంతో ఆలో చించి మహామతి తన అభిప్రాయాన్ని చివరకు ఇలా వెలిబుచ్చాడు.

'ప్రభూ! కల్యాణిని పంపటంకన్న మరో మార్గం ఏమీ తోచటం లేదు అదే అందరికీ మంచిది. సందేహించకండి.'

ఒక దీర్ఘ విశ్వాసంతో రాజు లేచాడు.

... ...

ఊరు ప్రక్క కొండమీద అణ్వస్త్ర రక్షణాశ్రమం. కొండకు రెండవ పైపు సముద్రం. అమావాస్య, అర్ధరాత్రి. ప్రచండ సేనుడు తన గదిలో పడుకొని హుక్కా లాగుతున్నాడు. ఇంతలో ఒక స్త్రీవ్యక్తి గభీమని తలుపు తీసి లోపలకు వచ్చింది. గడియవేసి తల వంచుకు నించుంది స్త్రీ సహజమైన లజ్జతో.

'ఓహో కల్యాణీ! నీవేనా! రా, నీ కోసం ఎంత తపించిపోయా ననుకుంటు న్నావు? నీవు లేనిది ఒక్క క్షణంగూడ గడపలేకనే నిన్ను రప్పించాను. ఏమంటావు; సిగ్గెందుకు! రా. వచ్చికూచో కల్యాణీ!' అంటూ హుక్కా ఆపి ద్రాక్షాసవం గ్లాసుతో పోశాడు ప్రచండసేనుడు.

'అదుగో! సిగ్గు పడుతున్నావులే! నాకు తెలుసు! ఇదుగో! ఈ ఆసవం ముందు పుచ్చుకో! తరవాత మాట్లాడుదాం తీసు కోవూ! మంచిదానివిగా తీసుకో!' అంటూ గ్లాసు అందించాడు. తీసుకుని విసిరి నేలకేసి కొట్టింది కల్యాణి.

'అదుగో! అసలే కోపంగా వున్నావు! నిన్ను నవ్వించటానికేగా తీసుకొచ్చింది! ఇక నవ్వటమే గదా అనేనా ముందు కోపి స్తున్నావ్! ఇదుగో! నా మాట విను. ఈ ఆసవం పుచ్చుకో — కొత్త వుత్సాహం వస్తుంది. శక్తి, వుత్సాహం లేనిది మన మేం చేయగలం! ఇంద తీసుకో!' అంటూ మరోగ్లాసు తీసుకెళ్ళి పక్కమీద కూచో బెట్టటానికి పైన చేయి వేశాడు. తోక తొక్కిన త్రాచులా లేచింది కల్యాణి.' 'నన్ను తాకకండి. ముందు దూరంగా పొండి.'

'ఒహ్హోహ్హో, ఏమి కోపం! అవునులే, పానకంలో మిరియాలపొడి లేనిది మందం చేస్తుంది. నిజమే అది అవసరమే' అంటూ తానే తాగాడు ఆసవం.

'కల్యాణీ కరుణించవా? ఈ దాసునిపై అనుగ్రహం చూపవా?' అంటూ ఆమె నడుంచుట్టూ చేయి వేసి మూడడుగులు

ముందుకు తీసుకొచ్చాడు. నాలు గడుగులు వెనుకకు పోయింది ఆమె.

'పిచ్చిపిల్లా! లోకం తెలియదు' ఏమంటాం? మనమే నేర్పుకోవాలి అన్నీ' అంటూ మంచంమీద కూలబడ్డాడు ప్రచండసేనుడు.

కల్యాణి తల యెత్తింది.

'పిచ్చిదాన్ని గనకనే యింతవరకు వచ్చాను.' తీక్ష్ణంగా అన్నది.

'అమ్మయ్య! ఎంత పుణ్యం చేసుకున్నాను! నీమాట ఇప్పటికి విన్నాను! నా చెవులలో అమృతం పోసినట్టుంది. ఆనందంతో వుప్పొంగిపోయాడు ప్రచండసేనుడు.

'మీరు ఎంతో పుణ్యం చేసుకోబట్టే నాకై నేను ప్రత్యక్షంగా వచ్చాను, సమాధానం చెప్పుకోటానికి.'

'సమాధానం దేనికి కల్యాణీ! మాటలతో కడుపు నిండుతుందా?'

'నిండదు తెలుసు, కాని నాపరిస్థితి ఏ అణుమాత్రం విచారించివున్నా మీ రిటువంటి పనికి పూనుకోరు.'

'లోకంలో మనిషి కోరకం పరిస్థితి వుంటూంటుంది, దానికేమిటిచెప్పు'' తూష్ణీం భావం వెల్లివిరిసింది ప్రచండసేనుడిలో.

'నేను స్త్రీని, అబలను, అవివాహితను. మీ సామంతరాజు పిల్లను. ఈ స్థితిలోనే మీ అమ్మాయి వుంటే మీ కెలా వుంటుంది? చెప్పండి?'

'అబ్బే. నా కమ్మాయి లసల్లేరు.'

'మీకు లేకపోవచ్చు, ఉన్నా మీకు తెలియదు. ఎద్దుపుండుబాధ కాకి కేం తెలుస్తుంది?'

'మాటలుకాదు కల్యాణీ! చేతలు కావాలిప్పుడు.'

'నాకూ జీవితంలో ఒక భర్తఅంటూ వుండొద్దా? నేనూ సంఘంలో వేలెత్తి చూపించుకోకుండా తలెత్తుకు జీవించవద్దా? నేనూ ఒక ఇల్లాలుగా మనవద్దా? ఇష్టాయిష్టాలు మీకేనా వుండేవి? నాకూ వుండవూ! ఇవేమైనా ఆలోచించారా?'

'ఇందులో అంతపెద్ద ఆలోచించవలసిందేముంది కల్యాణీ! ఇదేమీ లోకాన్ని తల్లక్రిందులు చేయటంకాదు.'

'అంతే మీకు. కాని నాకుగూడ అంతే అని అనిపించాలిగా! నే నేనాడో ప్రమోద కుమారుడికి హృదయం అర్పించాను.'

'మనం అర్పించింది మనం తీసుకోవచ్చు. అందులో ఇదేమీ వస్తువుకాదు, మళ్లీ ఇవ్వడేమో అనుకోటానికి. పరేగాని అతగాడెవడు?'

'మా మంత్రి కుమారుడు.'

'ఎవరు మహామతి కొడుకా? అతని కంతటి కొడు కున్నాడూ?'

'ఐనా మీతో జీవితం గడపటానికి సంసిద్ధమే. నన్ను వివాహ మాడండి.'

'చిరుతిండికిగూడ స్నానంచేసి సంధ్య వార్చంది వీలు లేదంటే ఎలా కల్యాణీ? అలాగైతే ఎన్నివందలమందిని పెళ్ళి చేసుకోవలసివస్తుందో తెలుసా?'

'ఐనప్పుడు నన్ను మరచిపొండి.'

'ఐతే యీ విషయం చెప్పటానికి వచ్చావన్నమాట?'

'ఆ ఒక్క దానికోసం మాత్రమేకాదు వచ్చింది. మీది పరమపైశాచికమైన వాంఛ అయినా, నా సౌందర్యాన్ని గ్రహించగలిగిన మీ హృదయంలో ఏమూలనైనా రవంతయినా సరసత్వం వూపిరి లేక పడివుండకపోదని, దానికి వూపిరి పోసి, కొంతనైన నేను మీ కళ్ళు తెరిపించ లేకపోతానా అని గంపెడాశతో వచ్చాను. కాని నా ఆశ వటిస్తుందన్న నమ్మకం నాకు పోయింది.'

'కాని పందొమ్మిది-ఇరవై ఏళ్ళలోనే ఇంత వేదాంతం ఎలా సంపాదించావో ఆశ్చర్యంగా వుంది.'

'అవును తెలియనప్పుడు అంతా ఆశ్చర్యమే. తెలిసిన తరవాత ఆశ్చర్యమే వుండదు.'

'కల్యాణీ! ఇంతవరకు అనవాని వని కన్య వని వూహకున్నాను. కాని హద్దుమీరుతున్నావు.'

'నేనుకాదు హద్దుమీరింది-మీరుతున్నది మీరు. నా కన్యత్వాన్ని భంగం చేయవచ్చు: కాని నా మనసు మీవైపు తిప్పుకోలేరు. ఆ మధ్యనే విన్నాం శస్త్రిచికిత్సకోసం మత్తుమందిచ్చినసందర్భంలో ఒక స్త్రీసౌందర్యానికి మోహావిష్టుడై కామవాంఛాతృప్తి గావించుకొన్న ఒకానొక వైద్యుణ్ణిగురించి. ఒకవేళ బలవంతాన మీరూ నా కట్టెను అలాగే వుపయోగించుకోవచ్చు. కాని అంతటితోనే తృప్తి చెందే మీరు అల్ప సంతోషులు. శరీర సౌందర్యానికే ఇంత ఆరాటపడే మీరు మనసౌందర్యాన్ని ఆత్మ సౌందర్యాన్ని చూడ గలిగినప్పుడు అందులో లీనం కాకుండా వుండలేరు. వచ్చే జన్మలోనైనా మీ కా జ్ఞానం కలిగించమని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను.'

'కథ చాలావరకు వచ్చిందే! చూస్తాను' విసురుగా లేచి వెళ్ళాడు ప్రచండసేనుడు గదిలోనించి.

* * *

మరునాడు రాత్రి పన్నెండు గంటల సమయం. అదే గది. 'కల్యాణీ! ఇటు రా' పెద్దగా పిలిచాడు ప్రచండసేనుడు.

ప్రక్కగదిలోనించి కల్యాణి వచ్చింది. చూచింది గాని నోటమాట రాలేదు. ఎదురుగా

ప్రమోదకుమారుడు కట్టెమాదిరిగా నించుని వున్నాడు. కల్యాణిచూపు విశ్వానికి అవతల విహరిస్తున్నది. ప్రచండసేనుడి కళ్ళల్లో పిశాచాలు నృత్యం చేస్తున్నయ్. ప్రమోద కుమారుడు కళ్ళతో దేవతలను ఆహ్వానిస్తున్నాడు.

'ఇదుగో ! నీ ప్రియుడు ప్రమోద కుమారుడు ! తీసుకో, వెళ్ళిపోతున్నాడు...... ఐందా తీసుకోటం ? ఇదుగో నీ ప్రియుడు వెళ్ళిపోతున్నాడు స్వర్గానికి' అంటూ ప్రచండసేనుడు తన ఖడ్గంతో ప్రమోద కుమారుడి తల నరికేశాడు.

కల్యాణి ఒక్క వెర్రికేకతో స్పృహ తప్పి పడిపోయింది. మెలకువ వచ్చేసరికి ప్రచండసేనుడు తనతో పశువయి ప్రవర్తిస్తున్నాడు. కళ్ళు మూసుకుంది ఆమె.

* * *

మూడవనాడు సాయంకాలం, సంధ్యా సమయం. అసత్యం గతి యింతే నన్నట్టు విదియచంద్రుడు మెల్లగా దిగిపోతున్నాడు ఆకాశంలో. ప్రపంచాన్ని చూసి కాబోలు సముద్రుడి హృదయవేదన చెప్ప తరం గాకుండా వుంది. సౌధంమీద విహరిస్తూ సముద్రంవంక చూస్తున్నారు కల్యాణీ ప్రచండసేనులు. మేఘాలు చకచకా పరుగెత్తిపోతున్నయ్ నిలవకుండా.

మేఘాలవంక చూసిచూసి అన్నాడు ప్రచండసేనుడు.

'చూడు కల్యాణీ! మేఘా లెంత తొందరగా పోతున్నయ్యో !'

'మిమ్మల్ని చూసే పరుగెత్తుతున్నయ్.'

'హుం. ప్రాణం లేని వాటికి గూడా మనం అంటే హడలే.'

'ఇటు చూడు. నిజంగా సముద్రం ఎంత విశాలమైందో !'

'ఎంతో లోతైందిగూడా కదండీ!'

'అవును. విశాలమై లోతు లేంది భూమి ఒక్కటే.'

'సముద్రం వున్నది భూమి మీదేగా ! లోతు లేదంటారేం?'

'నిజమే మనం ఎంత ఎత్తునవున్నామో చూడు. అంతా మన క్రింద వుంది.'

'క్రిందికి చూడకండి కళ్ళు తిరుగుతయ్.'

* * *

రాత్రికి భోజనం దగ్గర ఆమెను వడ్డించ మన్నాడు. ఆమె వడ్డించ నన్నది. ఉన్న దానికి నిన్ను బతిమాలే దేమి టని తానే పెట్టుకున్నాడు. కోపంతో కొంచెం ఎక్కువ తిన్నాడు.

ఒంటిగంటయింది. అతను గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. పక్కనే పడుకున్న ఆమెకు నిద్ర రాలేదు. ఆలోచిస్తున్నది. నేను జీవించి ఏం లాభం ? ఎవరిని వుద్ధరించను ? నా మనసిచ్చిన ప్రమోద కుమారుడు లేడు. అతను లేని నా జీవితం వ్యర్థం. అతనికోసమే పుట్టా ననుకున్నాను. ఎంతో మురిసిపోయి ఎన్నో గాలిమేడలు కట్టుకున్నాను; కాని నా కా యోగం లేదు. జీవచ్ఛవంగా తల్లి దండ్రుల ఆసరాక్రింద బ్రతుకుదామన్నా వారు నన్నే మొగంతో రమ్మంటారు ? నా సతీత్వం పోయింది. మొగం బయటకు పెడితే అందరూ తోట కూర కాడలో పురుగులా విదిలించరూ ? కాకిని పొడిచినట్టు పొడవరూ ? అసలిక్కడి నించి ఎలా తప్పించుకుపోగలను ? అది అసంభవం. ఉండి ఈ నరకం అనుభవించ గలనా ? అది అబద్ధం. ఎలా బ్రతికి వుండ టం ? లేదు. నాకు జీవించే అర్హత ఇక లేదు. ఈ జన్మ కింతే ప్రయోజనం. వచ్చే జన్మలోనైనా వేగంగా నా ప్రియుణ్ణి కలుసుకుంటాను. ఇదే వున్న మార్గం. వచ్చే జన్మలో నన్నిలా చేయవుగా ప్రభూ?'

చీమ చిటుక్కు మనకుండా మంచం దిగింది. ఆలోచన పరుగెత్తుతున్నది. 'నన్నిలా చేసింది యీ ప్రచండసేనుడు. నా జీవితాన్ని బూడిద చేశాడు. ఇతనే లేకపోతే? ... అవును, ఏమీ వుండేది కాదు. నా మరణానికి కారణం యీ ప్రచండసేనుడు. ఇతను నీ మరణానికి కారకుడయ్యాడా ? నీకు జరిగిందంతా యితను చేశా డనుకుంటున్నావా ? నిమిత్తమాత్రు డితను. తా నెందుకు నిమిత్తంగా నిలవాలి ? అతని చేతిలోవుండా నిమిత్తంగా నిలవటము నిలవక పోవటమూను ; లేదు నిజమే. తాను కోరకుండా వుంటే నా జీవితం నాశన మయ్యేది కాదుగా ! అప్పుడు మాత్రం ఇలా కాదన్న నమ్మకం ఏమిటి ? నమ్మకం లేదు. కాని యిలాగే అవుతుందన్న నమ్మకం ఏముంది? నన్ను బలిగా తీసుకున్నాడు పాపిష్ఠుడు. నేను ఆడదాన్ని — రాక్షసి నని తెలియదు. నాతోనే ఆటలాడాడు. తనను చంపిగాని చావను. అప్పుడుగాని నా హృదయం చల్లారదు.'

మెల్లగా గోడనున్న కత్తి తీసింది. కంపంతో చేయి వణికి తీయటంలోనే అది కిందపడ్డది. ఆ శబ్దానికి ప్రచండసేనుడు మేలుకున్నాడు. కళ్ళు తెరిచి చూచాడు. కల్యాణికత్తి పుచ్చుకుని మెల్లగాదగ్గరకువచ్చి నించుని చేయి యెత్తింది పొడిచేద్దామని. ఉపాయం ఏమీ తోచలేదతనికి. పడుకొని వున్నపాటునే ఆమె గుండెల్లో ఒక తన్ను ఈడ్చి తన్నాడు. దభీమని కల్యాణి వెనుకకు పడింది 'అమ్మా' అంటూ. ఒక్కగంతులో ఆమె చేతిలోనించి కత్తి లాక్కుని, కత్తి చివర ఆమె గుండెల మీద ఆనించి నించున్నాడు. కల్యాణి నిర్జీవంగా చూస్తున్నది పడుకుని.

'ఎంతకు పూనుకున్నావ్ కల్యాణీ !'

ఆవేశంలో తేలిపోతున్నది ప్రచండసేనుడి శరీరం. 'నీవు ఆడదానవని తెలిసిగూడ ఏమరిలి వుండటం నాదే పొరబాటు; మేలు కొలిపావు. నన్ను ప్రేమించని నీ జీవితాన్ని నాశనం చేశాను. నా వాంఛ తీరింది. నీ శరీరం ఇక వుండకూడదు.' అంటూనే కత్తిని ఆమె గుండెలోకి దించేశాడు. గిలగిలా తన్నుకుంటూ ప్రాణం విడిచింది కల్యాణి. ఆమె శవంమీద ఎక్కి కొంతసేపు చిందులు తొక్కాడు. 'నన్నే చంపటానికి వచ్చింది పాపిష్ఠిది' అంటూ ఆమె వక్షస్థలాన్ని కత్తితో కోశాడు. 'ఈ ప్రచండసేనుణ్ణి చంపటం నీ వశమా కల్యాణీ!' అంటూ చివరిసారిగా ఆమె కడుపుమీద కెగిరి ఒక్క తొక్కు తొక్కాడు. 'నీ గతి నీవు తెలుసుకోలేక నన్ను చంపటానికి వచ్చావా!' అంటూ మంచంమీదికి వెళ్ళి కూచున్నాడు. శవం చిందర వందరగా వికారమై పడివుంది. బాగా దాహం వేస్తోంది. గ్లాసెడు మంచి నీళ్ళు గటగట తాగేశాడు.

తదేక దీక్షగా చూస్తున్నాడు శవాన్ని. ఇరవై నిమిషాలు కడచివుంటయ్. చూచి చూచి వెక్కి-వెక్కి ఏడవటం ఆరంభించాడు. 'కల్యాణి పోయింది. చచ్చి పోయింది. చచ్చిపోయినావా కల్యాణీ? నిన్ను నా చేతులతో చంపాను. ఈ పాపిష్ఠుడే నిన్ను చంపింది కల్యాణీ! ఈ చేతులతోనే చంపాను. నీ శరీరాన్ని కోశాను. నీ శవం మీద ఎక్కి తొక్కాను కల్యాణీ! కోపం పోక.' అంటూ శవం పక్కన కూచుని భోరుని ఏడుస్తున్నాడు. 'నన్నెందుకు చంపటానికి రావాలి? నీవు రాకపోతే నిన్ను చంపేవాణ్ణి కాదుగా? నా కోపం పట్టలేక పోయాను కల్యాణీ! ఇక నీవునాకు కన్పించవుగా! నిన్ను ప్రాణంతో ఇక చూడలేనుగా! నీవు నడవటాన్ని చూడలేనుగా కల్యాణీ! నిన్ను మొదటిగా చూసినప్పుడే నీవు నాకు కావాలనిపించావు. నీవు లేనిది వుండలేక పోయాను. ఎంతో తపించాను, విలపించాను. కొన్ని రోజులు అన్నమే తినలేదు కల్యాణీ! నిన్ను రప్పించటం కోసమే కల్యాణీ! యీ అస్త్రాన్ని యింత కష్టపడి సంపాదించాను. దీన్ని చూపి బెదిరిస్తేతప్పక వస్తావనుకున్నాను. వచ్చావు. వచ్చిన దానివి హృదయ మిచ్చి ఒక్క మాట మాట్లాడకూడదూ? కల్యాణీ! నా మనసెంత ఆనందించేదోగా! నేనెంత నీచుణ్ణయినా దుర్మార్గుణ్ణయినా నిన్ను ప్రేమించాను కల్యాణీ! నీ జీవితాన్ని నాశనం చేసినా, చేద్దామని చేయలేదు కల్యాణీ! నీ మనసు పవిత్రమైంది. నాకు తెలుసు. కాని నా చేతులతో నేనే నిన్ను చంపేట్టుగా చేశావు. ఇంతకంటె నాకు వేరే శిక్ష లేదు. అది నా హృదయాన్ని కొరికి తింటున్నది కల్యాణీ! కొరికి తింటున్నది. నేను జీవించలేను. జీవించి దీన్ని భరించలేను. కల్యాణి లేని జీవితం వ్యర్థం. ఇక వుండకూడదు. వుండలేను కల్యాణీ!' అంటూ కత్తి చేతిలోకి తీసుకోబోతున్నాడు ఆత్మహత్య చేసుకోటానికి. ఇంతలో దుఃఖం రవంత వుపశమించింది. మెదడులో ఆలోచన తొంగిచూచింది. ఎవరో పెద్దగా పిలిచినట్టయింది. 'ప్రచండసేనా! ఆగు, ఏమిటి నీవు చేయబోయేది? నిన్ను నీవు చంపుకోబోతున్నావు. నిన్ను నీవు లేకుండా చేసుకుంటున్నావన్నమాట. అందువల్ల ఏమిటి నీవు సాధించబోయేది?'

'నాకు దుఃఖం లేకుండా చేసుకుంటాను' ఎవరో జవాబు ఇచ్చినట్టయింది.

'నీ శరీరం లేకుండా చేసుకున్నందువల్ల నీ దుఃఖం పోతుం దనుకుంటున్నావా?'

'అవును.'

'అయితే భ్రమ పడుతున్నావు.'

'లేదు, నేను భ్రమించటం లేదు. నా కల్యాణి పోయింది, నేను జీవించలేను.'

'ఆమె పోలేదు, కల్యాణిని నీ చేత్తో పొడిచి చంపావు. ఉత్తమ స్త్రీ ఆమె. ఆమెను పొట్టన బెట్టుకున్నావు, స్త్రీ హంతకుడివి. ఏదో ఆనందం సంపాదిద్దామనుకున్నావు. దుఃఖాన్ని కొని తెచ్చుకున్నావు. నీ దుఃఖానికి ఇక అంతుండదు; నీ పాపానికి ప్రాయశ్చిత్తం లేదు. అంతా అనుభవిస్తావు. నరకంలో పురుగై పడివుంటావు. నీ గతి అంతే పో.'

'పోతాను, నాదుఃఖాన్ని అనుభవిస్తాను, అనుభవించక తప్పదు, నాకు తెలుసు.'

'దీని కంతా మూలం నీలోని క్రోధమే. నీ క్రోధంవల్లనే యిన్ని పనులు చేశావు. చివరకు అదే నిన్ను చంపబోతున్నది. ఇకనైనా జాగ్రత్తగా మెలగు.'

'అవును, ఇంతకూ మూలం నాలోని క్రోధమే, క్రోధంలేనిది నే నుండలేను. నన్నినాడు ఉత్తముడని, మంచివాడని ఎవరూ అనరు. అననప్పుడు నేను మంచిగా ప్రవర్తించిమాత్రం ఏం లాభం? నన్ను దుర్మార్గుడు, నీచుడు అని అంటున్నప్పుడు దుర్మార్గంలోనే నీచంగానే ప్రవర్తిస్తాను. నాలో మిగిలివున్న క్రోధాన్ని గూడ తీర్చుకుంటాను. నన్నుమంత్రిని చేస్తాను,చేస్తానని చెప్పి యింత వరకు చేయని రాజును చంపుతాను. చెయ్యనివ్వకుండా చేస్తున్న మంత్రిని చంపుతాను. దుష్టుడు, దుర్మార్గుడు, పాపిష్టుడు అంటున్న ప్రజలను చంపుతాను. అందరినీ చంపుతాను. నా అస్త్రాన్ని ప్రయోగిస్తాను. సర్వనాశనం చేస్తాను. ప్రపంచం పుట్టినప్పటినించీ యింత వరకూ ఎంతమంది ప్రవక్తలు, నాయకులు, ఉద్ధారకులు పుట్టలేదు? వా రందరు శాంతి, శాంతి; ప్రపంచానికి ప్రజలకు కావలసింది శాంతి; శాంతిని ప్రపంచానికి ప్రసాదించాలి;

ప్రపంచం అంతా శాంతితో నిండాలి ; శాంతి మయం కావాలి ; అనాడే మానవకోటి తన పరమార్థాన్ని చేరుకోగలుగుతుంది అని ఎంత ఘోషించలేదు ? చివరకు వారే మయ్యారు ! ఏ ప్రజలకైతే శాంతిని ప్రసాదించాలనుకున్నారో ఆ ప్రజలే బలవంతగా వారి నందరినీ చంపలేదూ: వారందరు తమ జీవితాలకు జీవితాలను బలిచేసిగూడా సాధించలేని శాంతిని ఒక్క-క్షణంలో, ఒక్క ఆయుధం వల్ల సునాయసంగా చీమ చిటుక్కుమనకుండా సాధిస్తాను. ప్రపంచ మంతటా శాంతిని తాండవింప జేస్తాను. ప్రపంచానికి శాంతిదూత నవుతాను. ఆ శాంతిని అనుభవిస్తూ హాయిగా వుండిపోతాను. నా కిం కేంకావాలి.

మెల్లగా లేచాడు కాళ్ళు తడబడుతున్నయ్. ఎలాగో నిలవదీసుకున్నాడు. నడచి వెళ్ళాడు, అస్త్రం వున్న గదిలోకి. 'తొందరపడకండి ; వెళ్ళకండి ; నా మాట వినండి ; మీ సాధుహింస మిమ్మల్ని ఈ మారు ఏం చేస్తుందో అని భయంగా వుంది. దానికితోడు రాత్రి పీడకలకూడ వచ్చింది' అని అంటున్నది. సుగ్రీవునితో యుద్ధానికి వెళ్ళే వాలితో తార, అస్త్రంవున్న పెట్టిపైన వేలాడుతున్న చిత్రంలో, మాట వినక వెళ్ళిపోతున్నాడు వాలి. ప్రచండసేనుడు జాగ్రత్తగా అస్త్రం తీశాడు పెట్టిలోవించి. మీట సరిచూసుకున్నాడు. దారిలో వున్న సోఫాను ఒక్కతోపు తోశాడు. తనకు తెలియకుండానే మేడపైకి నడచివెళ్ళాడు. చుట్టూరా కలయజూచాడు. కోళ్ళు కొద్దిగా కూస్తున్నయ్. పట్టణంలో దీపాలు బాగా వెలుగుతున్నయ్, అప్పుడే కొద్దికొద్దిగా లేస్తున్నారు మనుషులు. మిగతావైపుల చూశాడు. అంతా చీకటి. సముద్రం మాత్రం, ఘోషిస్తూనే వుంది. రెండుచేతులతో అస్త్రాన్ని కళ్ళ దగ్గరకు ఎత్తాడు. విక్రమేంద్రవర్మ కోట మీది ఎర్రదీపంవైపు గురి చూశాడు.

'రాజా ! నీవు నీ పరివారం నీ ప్రజలు అంతా ఇక వుండరు—వుండదగరు. చావండి. అంతా బూడిద అయిపోతారు.' అనుకుంటూ మీట మెల్లగా నొక్కాడు.

ఓం హ్రీం శ్రీం ఫట్ !

ఘూమ్ ఘామ్ ఘుస్ :

దమ్ రమ్ లమ్ సమ్ వమ్ !

ఐం క్లీం హుం స్వాహా !

* * *

కనుచూపుమేర ఎటు చూసినా ఫెళఫెళార్భటులతో సెగలు ! పొగలు ! హాహారవాలు ! ఆర్తనాదాలు !

ప్రళయ లయ వేస్తున్న ప్రచండ భైరవ విలయ తాండవ ఢక్కా హుడుక్కా ఢమరుక ఢంఢమ ధ్వానాలు !

హాలాహలం ! కోలాహలం !

ఎటు చూసినా విశృంఖల నీరవ నైరాశ్య నిరంతర ధారాస్రవంతులు !

చిటపటలు ! చిందర వందరలు !

ఎటు చూసినా జగదీశ్వరి భువనేశ్వరి పరాశక్తి పరంజ్యోతి పరమాకృతి !

ధగధగలు ! భుగభుగలు !

ఎటు చూసినా పర్జన్య గర్జానుకారి కాలాంతక వికటహాస ద్విగుణీకృత మహిష ఘంటా ఘణం ఘణలు !

వికవికలు ! చకచ్చకలు !

ఎటు చూసినా భయంకర యమ భట సంపూరిత కాహళ ఝంకార ప్రతిధ్వనిత దిగంతములు !

ఎటు చూసినా ప్రకృతి పరమేశ్వరుల అపడ క్షీణ మధురభావ పరంపరల పరస్పర వివేదనలు :

పునర్జన్మ భయంలేని మహర్షి హృదయంలా అంతా ప్రశాంతం ! మహాత్ముల అహంకారంలా అంతా శూన్యం !

పరమాత్మను ముద్దాడే జీవాత్మలా భూమి ఆకాశంతో ఏకమైంది !

ఎటు చూసినా అంతా అవకాశం !

ఒకప్పుడు ఇంద్ర సంపదతో తులతూగిన పట్టణం ఇప్పుడు శ్మశానం !

కోడి కుయ్యకుండానే తెల్లవారింది, అసలు కుయ్యడానికి కోడెక్కడిదీ !

ప్రచండసేనుడి పత్తేదార్ వీరమల్లు రొప్పుకుంటూ రోజుకుంటూ వచ్చాడు.

శిబిరంలో తప్పతాగిన వాడిలా పడి వున్నాడు ప్రచండసేనుడు.

వీరమల్లు తుమ్ముకి మెలకువ వచ్చింది ప్రచండసేనుడికి.

'ఏరా ! ఏం జరిగింది ?'

'సర్వనాశన మయిందండి.'

'రాజుగా రెలావున్నారు ?'

'లేదండి. రాజుగారు పోయినారు. ఊరంతా పోయింది !'

'పోతే పోయినయిలే వూరుకో.'

'భవనా లన్నీ కూలిపోయినయ్యండి !'

'పోవూ మరి ! పోతయ్.'

'వూరు గుర్తుపట్టలేమండి !'

'నీ కేమైనా వూల్లో పనున్నదా ?'

'కాదండి, వూరంతా బూడిదై పోయిందండి. ఎక్కడ చూసినా బూడిద తప్ప ఏమీ లేదు.'

'పోయేటప్పుడు నీవూ నేను పట్టుకుంటే ఆగుతుందా ? ఎప్పటి కెలా జరగాలో అలా జరిగిపోతుంది. దానికి విచారించి ప్రయోజనం ఏముంది చెప్పు !'

'ఊళ్ళో జనమంతా చచ్చిపోయినారండి. ఒక్క మనిషిగూడా మిగల్లేదు '

'ఒరే రాజుగారే పోంగా ఇక జనం వుంటారా ?'

'ఒక పసిపిల్లగూడ మిగల్లేము. సర్వం పోయినారండి—రెండు లక్షల మంది!'

'ఏదో లెక్కగూడా చెబుతున్నావ్. ఏమిటది?'

'రెండు లక్షల మందండీ పోయింది?'

'పది లక్షలనరాదు! ఇప్పుడేం పోయింది!'

'కాదండి రెండు లక్షల మంది పోయినారండీ!'

'రెండు లక్షలని నీకెలా తెలుసురా?'

'మా 'సిన్నాయినేగదండీ ఇక్కడ జనాభా లెక్కలు చూసేది!'

'ఐతే నీ కొచ్చి చెప్పాడా? రెండు లక్షల మందని?'

'మొన్ననే గదండి జనాభా లెక్కలు చూసింది అవన్నీ రాసింది నేనే గదండి!'

'కొంపతీసి రెండు లక్షలనే రాసేవేమిటి లెక్క?'

'వచ్చిన లెక్కలన్నిటినీ స్వయంగా పరీక్షించి నా స్వహస్తతో రాశానండి లెక్క. మన పట్నంలో రెండు లక్షలండి. ఉంటే ఇంకా ఎక్కువే వుండాలి. తక్కువ మాత్రం వుండదండి.'

'ఏమిటి రెండు లక్షల మంది జనమా?'

'అవునండి!'

'అంతమందీ చచ్చిపోయినారంటావు?'

'పోయినారండి!'

ప్రచండసేనుడు నిశ్శబ్దం అయినాడు. హృదయంలో ఎలుక కన్నం వేస్తున్నది. రెండు లక్షల మందే! ఇంతమంది నా చేతో నా ఆయుధంవల్లనే చచ్చిపోయినారా! రాజు, అతని పరివారానికని ప్రయోగిస్తే ఇది యింతపని చేసిందా? రెండు లక్షలమంది జనం చావటానికి నా ఆయుధం కారణమైందా?' నిలుచున్నవాడు కూలిపోయినాడు. వీరమల్లు లేవదీశాడు. రెండు నిమిషాలకు ఎలాగో తేరుకున్నాడు.

'ఒరేయ్! అంతమంది పోగా నువ్వు ఒక్కడివీ మిగిలివుండి యింత ఘోరవార్త నీ నోటితో నా చెవిన వేస్తావా?' వీరమల్లు మెడ కత్తితో తెగేశాడు.

ఒకచోట కూలబడ్డాడు. అతని ఆందోళన భువనాలన్నిటినీ చుట్టి వస్తున్నది. అయినప్పటికీ ఆలోచిస్తూనే వున్నాడు.

'ఏమిటి! నా ఒక్క అస్త్రంవల్ల ఇంతమంది జనం పోయారా! ఇంతమందిని చంపింది నా అస్త్రమా! దీనికింత శక్తి ఎలా వచ్చింది? ఎక్కడినించి వచ్చింది? ఎక్కడినించో వచ్చేదేమిటి; అందులోనే వుంది ఆ శక్తి. అందులో లేకపోతే ఎక్కడినించి వస్తుంది? నిజమే, కాని అందులో ఆ శక్తి దానంతట అది ఎలా వుండగలదు? అలా వుండ గలిగితే నాలో లేదేమి? లేదు. అందులో స్వతస్సిద్ధంగా లేదు; దానిని మొదటసారిగా కనుగొన్నది సత్యశీలి. సత్యశీలివల్ల దానికా శక్తి వచ్చింది. సత్యశీలివల్ల మాత్రమే దానికా శక్తి రావటానికి కారణమేమిటి? సత్యశీలిలో ఆ శక్తి వుందా? అలాగైతే నాలోనూ వుండాలిగా! లేదు. అతనిలో అంతకుముందు లేదు కఠోరంగా పాపం ఎంతోకాలం తపస్సు చేశాడు. ఆ తపస్సువల్ల సంపాదించాడు. తపస్సు చేయటంవల్ల సంపాదించాడంటే తపస్సు ఆ శక్తి నిచ్చిందన్నమాట! తపస్సు ఆ శక్తి నిచ్చిందంటే తపస్సులో ఆ శక్తి వున్నదన్నమాట! ఇవ్వటానికి శక్తి దాని కెక్కడినించి వచ్చింది? దాని కెక్కడినించో రాలేదు. అది అందులో స్వతస్సిద్ధంగా వుంది. ఐతే తపస్సులోఎంతో శక్తి వున్నదన్నమాట! కాగా తపస్సువల్ల సంపాదించిన శక్తిని సత్యశీలి ఈ అస్త్రంలో బంధించాడు. అస్త్రంలో వున్న శక్తి నాకు వశమైంది. నేను దానిని ప్రయోగించాను అంటే దాని పనిని అది చేసేట్టుగా చేశాను. ఇంతమందిజనం నాశనం అయ్యారు. అస్త్రంలో వుంటే పాపం! అదేం చేసింది? అది జనాన్ని చంపిందా? లేదు. శక్తి వున్నా అదేం అపకారం చెయ్యదు. నేను దానిని ప్రయోగించటమే యింత ఘోరానికి కారణం. నేను చేసిన పనివల్ల యింత ఘోరం జరిగింది. ఇంత ఘోరం జరగటానికి కారణం నేను చేసిన పని. నేను చేసిన పనికి కారణం నేను. నావల్ల ఇంతమంది జనం నాశనమయ్యారు. ఇంతమంది చచ్చిపోటానికి యిదంతా సర్వనాశనం కావటానికి కారణం నేనన్నమాట! నేను లేకపోతే యింతమంది చచ్చిపోరుగా! ఇంత నాశనం అయ్యుండేది కాదుగా!'

అంతే. ఒక్కమారు సువ్వి పెట్టినవాడిలా అయిపోయాడు. వెర్రిచూపులు చూస్తున్నాడు. రయ్యన అటూ ఇటూ పరుగెత్తుతున్నాడు. గోడకేసి తల బాదుకున్నాడు. రక్తం కారింది. జుట్టంతా పీక్కున్నాడు. మధ్య మధ్య నవ్వుతున్నాడు సామానంతా చిందర వందర చేశాడు. గుడ్డలన్నీ చింపుకున్నాడు. తనను తనే యీడ్చి యీడ్చి బాదుకుంటున్నాడు. గోడను లాగిలాగి ఫెడీ ఫెడీ తన్నుతున్నాడు. ఉండి ఉండి భూమి మీదినించి పైకెగురుతున్నాడు. కింద పడుతున్నాడు. లేస్తున్నాడు మధ్య మధ్య యేడుస్తున్నాడు. గొణుగుతున్నాడు. ఇంతలో కత్తిమీద పడి కుడిచెయ్యి కోసుకుపోయింది. రక్తం వరదలుగా కారుతున్నది. రెండో చేతికి గూడ అయింది. రక్తాన్ని పరీక్షగా చూసి చూసి వాసన చూశాడు. తలకు రాచుకున్నాడు. ఒంటికంతా పులుముకున్నాడు. పైన వున్న దీపాన్ని అందుకుందామని కుప్పించి యెగిరాడు. దభీమని కింద

పడ్డాడు. పడ్డవాడు అలానే పడుకుని చూస్తున్నాడు.

నాలుగువేల చదరపుమైళ్ళ రాజ్యాన్ని యేకచ్ఛత్రాధిపత్యంగా యేలిన మహారాజు విక్రమేంద్రవర్మ దండనాయకుడు, కాలు కదిపితే చాలు 'శ్రీశ్రీశ్రీ ప్రచండసేన మహాసేనానులకుజై, ప్రచండసేన మహాసేనానులకు జై, ప్రచండసేన మహాసేనానులకు జై' అని జయ జయ ధ్వానాల మధ్యనే జీవితమంతా గడిపి అపజయం అన్నది యెరుగని దండనాథుడు, పేరు రాజుదైనా పరిపాలనంతా తన యిష్టా యిష్టాలకు అనుగుణంగా తన మనసులో మర్కటం చెప్పిన విధంగా తన చేతిమీదుగా కావించిన మహాసేనాని, తనవలెనే యితర ప్రాణులకు గూడ ఇష్టా యిష్టాలు సుఖ దుఃఖాలు ఉంటయ్యన్న భావనవల్ల కలిగే మనసు బలహీనతను అణుమాత్రం గూడ యెరుగని ప్రచండసేనుడు ప్రపంచానికి శాంతిని ప్రసాదించ దలచుకొని, ఆ శాంతిని అనుభవిస్తూ జీవితం ఆనందమయం చేసుకోవాలని మారణాస్త్రాన్ని ప్రయోగించాడు. అంతా ప్రశాంతమైంది. ఒక్క ప్రాణైనా వుంటేగా అశాంతి అనేది కలగటానికి! తీరా తాను సాధించిన శాంతిని తానే భరించలేకపోయినాడు దుర్భరమైంది. ఏమి తోచటం లేదు. దేనిని సాధించుదామనుకున్నాడో దానిని సాధించలేకపోయాడు. శాంతిని సాధించుదామనుకుని అశాంతిని కొని తెచ్చుకున్నాడు. పాపం! ప్రచండసేనుడు అవివేకి. దౌర్జన్యం వల్ల హింస వల్ల శాంతిని, సౌఖ్యాన్ని పొందవచ్చుననుకున్నాడు. శాంతి సాధనకు తన మనసు తప్ప మరొకదానితో పని లేదన్న విషయం తెలియ దతనికి. శాంతి అనేది బయట ఎక్కడో వున్నదనీ, దానిని శరీర కార్యాల వల్ల సంపాదించవచ్చుననీ అనుకున్నాడు. మానవుడు ప్రయత్నంతో తన వరకు తాను దానిని సాధించుకోగలడే కాని ఇంకొకరికి ప్రసాదించలేడన్న సంగతికూడ అతనికి తెలియదు. శాంతి అనేది ఆత్మ వల్ల మాత్రమే గ్రహించగలిగిన పరమస్థితి. మానవుడు చేరుకోవలసింది దానిని — అదే దైవం అని ప్రచండసేనుడికేం తెలుస్తుంది. అతని జీవిత చక్రానికి యిరుసుగా పని చేసింది పిరికితనం. ప్రపంచంలోని పాపాని కంతటికీ మరి మూలం అదేగదా!

అలాగే పడుకుని యేడుస్తున్నాడు. ఇంతలో సత్యశీలి, కల్యాణి, ప్రమోదకుమారుడు, జయసింహుడు, విక్రమేంద్రవర్మ, సుబుద్ధి, మహామతి మొదలైన వారి ఆత్మలు ముందు నడుస్తూ రాగా రెండు లక్షల మంది ప్రజల ఆత్మలు కిలకిలమంటూ బిలబిలా వచ్చిపడ్డయి. ప్రచండసేనుణ్ణి చుట్టుముట్టినై. అతని తల చుట్టూ తిరుగుతున్నై. మిలమిల లాడుతూ గలగలమంటున్నై. చేతితో తోలుకుంటూ అక్కడినించి లేచి దూరంగా వెళ్ళాడు. నీళ్ళ ఒరవడికి ఊగుతూ వెడుతున్న పడవలా అవి అతని చుట్టూనే తిరుగుతున్నై. ప్రచండసేనుడు కూచోబడ్డాడు 'అదుగో సత్యశీలి, అదుగో కల్యాణి, అదుగో విక్రమేంద్రవర్మ, జయసింహుడదుగో!' అంటూ వేలుతో చూపుతూ వాటిలో కొన్నిటిని గుర్తుపట్టాడు. గుర్తుపడుతున్నకొద్దీ అవి మరింత దగ్గరగా వచ్చి కదులుతున్నట్టుగా అతని శరీరాన్ని తాకుతూ నృత్యం చేస్తున్నయ్. భరించలేకపోయినాడు. 'మిమ్మల్ని యిలా బాధించిన ఆ నికృష్టుడు ప్రచండసేనుడు ఎక్కడ వున్నా వెదికి వాణ్ణి పరిమారుస్తాను. ఉండండి. వాణ్ణి చంపి తీసుకొచ్చి మీ కిస్తాను.' అంటూ లేచాడు. ప్రక్కనే గద ఒకటి వున్నది. దానిని చేత పుచ్చుకున్నాడు. 'ఓరి ప్రచండసేనా! నీచుడా! దాక్కున్నంతమాత్రాన నిన్ను చంపనిది వదలిపెడతా ననుకున్నావుట్రా!' అంటూ పరుగులు వేశాడు. ఇంతలో ఒక పెద్ద నిలువుటద్దం వచ్చింది. అందులో తన ప్రతిబింబమే కనిపించింది. ఇంకేం! పళ్ళు పటపట కొరుకుతూ 'ఏమిరా ప్రచండసేనా! ఇప్పటికి కనిపించావుట్రా? నిన్ను వదలిపెట్టను ఇక నిన్ను వదలిపెట్టనురా దుర్మార్గుడా!' అంటూ యీడ్చి గదతో అద్దం పగలగొట్టాడు అద్దం పప్పు పప్పు అయింది. తన ప్రతిబింబం కనిపించలేదు. 'ప్రచండసేనుడు పారిపోయినాడు. వెధవ! నన్ను చూసి పారిపోతే నిన్ను వదలిపెడతానా? నా గదతో నిన్ను చంపనిది వదిలి పెడతానటరా?' అంటూ బయలుదేరాడు.

'ప్రచండసేనా! పారిపోకురా! ప్రచండసేనా పారిపోకురా! పారిపోయి యెక్కడికి పోతావురా? నిన్ను హతం చెయ్యనిది నిద్రపోనురా! నీ పాపం పండిందిరా! వస్తున్నారా!' అని పెద్దగా కేకలేస్తూ, గదను కుడిబుజాన పెట్టుకుని ఎడంచేయి వూపుతూ, అడుగులో అడుగేసుకుంటూ కదలి ఆశ్రమం నుంచి కదలిపోయాడు. కనుచూపుమేర దాటాడు. వెళ్ళాడు వెళ్ళాడు; వెళ్ళి వెళ్ళి శూన్యంలో లీనం అయిపోయాడు.

బౌద్ధ పౌరాణిక గాథలు

కె. కమల

కథాశ్రవణ మనునది పిన్నలను పెద్దలను కూడా సమానముగా నాకర్షించును. ఒక మహత్వపూర్ణమగు సత్యమును కథగా అల్లి వీనులవిందుగా వినిపించి, ప్రజలమనస్సునకు హత్తుకొనునట్లు చేయుట ప్రతి వాఙ్మయములోనూ కలదు. ప్రాచీన గ్రీకు సాహిత్యమున వన్నెకెక్కిన కథలు, గాథలు ఎన్నియో కలవు. అట్లే, ఇంగ్లీషు వారికి ప్రత్యేకముగా సొంత సొత్తుగా భావింపబడు కథలు రాబిన్ హుడ్, రిప్ వాన్ వింకిల్, కింగ్ ఆర్థర్ వంటికథలు ఎన్నియో గలవు. జర్మనీ దేశములో గత శతాబ్దిలో ప్రముఖ భాషాశాస్త్ర వేత్తలుగా భావింపబడు గ్రిమ్‌సోదరులు ఆదేశములో ప్రచారములో నున్న జానపదగాథలనుకూర్చి ప్రకటించిరి. సింద్రెల్లాకథ అటువంటిదే. ప్రపంచములోని వాఙ్మయములలో అత్యంత ప్రాచీనమైన ఋగ్వేదమునందు విశేషముగా ఉపనిషత్తులయందు ఇట్టికథలు ఎన్నియో కలవు. అత్యంత గహనములగు విషయములు బ్రహ్మస్వరూపనిరూపణవంటివికథలుగా ఒకరడుగగా మరియొకరు సమాధానము చెప్పినట్లు ఇందు పొందుపరుపబడినవి. మానవజాతి ఎంత ప్రాచీనమైనదో ఈ కథాప్రక్రియ కూడా అంతప్రాచీనమైనదే. పురాణములలో ఇతిహాసములలో యథార్థముగా కన్నులకు కట్టినట్లుగా కథలు చెప్పగల పౌరాణికులు, సూతుడు, వైశంపాయనుడు మొదలగువారు ప్రసిద్ధిగాంచినవారు కలరు. రామాయణగాథను కుశలవులు వీథులలో గానము చేసి ప్రజలను ప్రభావితులను చేసిరి. మహాభారత, రామాయణముల రెండింటిలోనూ, వ్యాస వాల్మీకులు, కథతో సంబంధము కలిగినవారుగా తెలియుచున్నది.

ప్రాచీన కథావాఙ్మయమును వైదిక కథలు, పౌరాణిక కథలు, సాంఘికకథలు నీతిబోధకములై తిర్యక్ప్రపంచముతో కూడిన కథలు అని పలువిధములుగా విభజింపనగును. గుణాఢ్యవిరచితమగు బృహత్కథ కథా వాఙ్మయములో తలమానికము. పార్వతీదేవికి అపూర్వమగు కథను వినవలెనని కోరిక కలుగగా, పరమశివుడే కథకుడై ఈ బృహత్కథను చెప్పగా శాపవశమున గుణాఢ్యుడుగా జన్మించిన మాల్యవంతుడను ప్రమథుడే దానిని లోకమునందు వ్యాపింపజేసెను. ఈ బృహత్కథకు రామాయణ మహాభారతములతో సమాన ప్రతిపత్తి కలదు. ఇందలి కథలు ఆధారములుగా జేసికొని రచింపబడిన నాటకములు స్వప్నవాసవదత్తము, మాలతీమాధవము ప్రతిజ్ఞాయౌగంధరాయణము వంటి వెన్నియో సంస్కృత వాఙ్మయమున వెలసినవి. బృహత్కథలోని ఉదయనునికథ కాళిదాసు నాటికే ప్రసిద్ధి చెందినది. మేఘదూతములో "ప్రాప్యావంతీనుదయన కథాకోవిద గ్రామవృద్ధాన్" అని ప్రస్తావించెను. ఇక పంచతంత్రము, సుకుమార బుద్ధికలిగి గహనములగు విషయముల నవగాహనము చేసికొనజాలని రాజకుమారులకై వ్రాయబడినది. ఇందు కాకి, నక్క, జింక మొదలగు తిర్యక్ జంతువుల ముఖమున పెక్కునీతులు బోధింపబడును. ఈ పంచతంత్రము ప్రపంచములోని బాలవాఙ్మయములో నత్యంత ప్రాచీనమైనదిగా భావింపబడుచున్నది. చిన్నపిల్లల మనస్సును ఇట్టి జంతువు లాకర్షించినంతగా, మానవుల మనస్తత్వ పరీక్షలు వాగ్వాదములు ఆకర్షించవు. పంచతంత్రములోని జంతువుల సంవాదములలో పూర్వోత్తర పక్షములు రెండును, దేనికదే ఉత్తమమైనదిగా కన్పించును.

పాశ్చాత్య విమర్శకు డొకడు, భారతీయ సాహిత్యమును గూర్చి ప్రస్తావించుచు నొకచోట భారతీయుల దృష్టి, జీవితమును సంపూర్ణముగా తీసికొని అందలి కష్టనష్టములను విచారించి, చివరకు మనశ్శాంతితో సృష్టించిన సాహిత్యములో పరిపూర్ణత, తరంగసంచలనము తరువాత సముద్రములో ఏర్పడిన ప్రశాంతత వంటి దనియు అందుచేతనే మన కావ్యములోని నాయికానాయకులు సాధారణముగా గుణసంపన్నులే యనియు చెప్పెను. ఇట్టి పరిపూర్ణ దృక్పథము పాశ్చాత్య సాహిత్యమునందు లేదనియు, ఆ సాహిత్యము, మానవుడు ఒక చిన్నపరిధి తనను చుట్టుకొనున్న పరిస్థితులతో

పోరాడుచు పలుమార్లు ఓడిపోవుటనే చిత్రించును కావున అది వాస్తవికముగా కన్పించినను, చివరి దశకాదు కావున, భారతీయులకు గల పరిపూర్ణ దృక్పథమును సంపాదించుటకు పాశ్చాత్యులకింకను చాలా కాలము పట్టునని సాంఘిక నాటకములలో అత్యంత ప్రశస్తమైన మృచ్ఛకటికమును గురించి వ్రాయుచు ఈ విమర్శకుడు మృచ్ఛకటికమువంటి నాటకము వ్రాయుట కింకను చాలాకాలము పాశ్చాత్యులకు పట్టునని చెప్పెను. ఇట్టి పరిపూర్ణదృక్పథమే భారతీయ కథాసాహిత్యమునందు కలదుకావున, ఆధునికములైన, "స్కెచ్, మోనోలాగ్" వంటివి ప్రాచీన వాఙ్మయమునలేవు. ఆధునిక సాహిత్యమునందలి ప్రక్రియ లన్నియు పాశ్చాత్యులనుండి వచ్చినవే కావున వానియందలి పరిస్థితులతో ఒక చిన్న పరిధిలో మానవుని ఘర్షణయే చిత్రీకరింపబడును

ఇక లౌకిక సంస్కృత వాఙ్మయమునందు బాణుని కాదంబరీకథ ఎన్నదగినది. కథ అను పదమునకు అర్థము కవియొక్క ఊహాజనితమైనదని చెప్పబడినది. కాదంబరీ కథ మూడుజన్మలకు సంబంధించిన బాణభట్టుని ఊహాకుసుమము.

హైందవ ధర్మమునందు ప్రాముఖ్యమును వహించినది, జీవుడు నిత్యుడనియు, చినిగిన వస్త్రములను త్యజించి, నూతన వస్త్రములను ధరించినట్లే జీవించుటకు అయోగ్యమగు ఒక దేహమును వదలి మరల క్రొత్త దేహములో చేరి జన్మించుననియు తదనుగుణముగా ఈ జన్మలో అతని ప్రవర్తన ఉండుననియు నమ్మకము కలదు. పునర్జన్మ రాహిత్యమే మోక్షముగా భావింపబడుచున్నది. ఈ పునర్జన్మ సిద్ధాంతమే హిందూ మతమునకు మూల స్తంభము వంటిది. వైదికమగు హింసాకాండను నిరసించి సామాన్య జనులకు తారకమైన ఉపాయమును ఉపదేశించిన, జైన, బౌద్ధ మతములు రెండును హిందూ మతములో నుండి పుట్టినవే. ఈ రెండు మతములు ప్రజలకు నీతిమార్గమును బోధించి తరింపజేయుటకు యత్నించినవే కాని ఇందు హిందూమతమునందు లేనిది క్రొత్తదేదియు బోధింపబడలేదు. కావున బౌద్ధ జైన మతములు రెండును ఈ మూల స్తంభము వంటి పునర్జన్మ సిద్ధాంతము నంగీకరించెను. ఈ సిద్ధాంతము కొంతవరకు మానవునియందు ధర్మభీతిని కలిగింప చేయుటకు మిక్కిలి తోడ్పడినది. ఈ దేహము నశింపుయే జీవనమున కంతముగా భావింప బడినచో దేహ మున్నన్ని దినములు ధర్మాధర్మ విచక్షణ లేక దేహమును సుఖింప చేయుటకు మానవుడు ప్రయత్నించును అంతిమ కాలమునందు మాత్రము తన తప్పులను మన్నించుమని భగవంతుని ప్రార్థించుటతో అతనికి పాపపరిహార మగునని భావించును.

బౌద్ధవాఙ్మయమునందు బుద్ధుని వివిధ జన్మములను వివరించు జాతకకథలు చాలా అందముగా వ్రాయబడినవి. బుద్ధుడు పెక్కు జన్మల నెత్తి ప్రతిజన్మయందును పూర్వజన్మకన్న తనను తాను బాగుపరచుకొనుచు చివరకు బుద్ధుడుగా జన్మించి ముక్తి నొందెనని భావింపబడుచున్నాడు. కావున ముక్తి యనునది ఎట్టివానికైనను ఒక జన్మలో లభించునది కాదు. ఒక్కొక్క జన్మలో ఒక్కొక్క మెట్టు నెక్కుచు, క్రింద పడకుండా జాగ్రత్తగా వెళ్ళినపుడే జీవుడు ముక్తి నొందగలడు. పూర్వజన్మలో తనతో చెలిమికలిగినవారిని చూచిన ఈ జన్మయందు కూడా అట్టి భావమే కలుగును. మహాకవి యగు కాళిదాసుకూడా ఈ విషయమును "భావస్థిరాణి జననాంతర సౌహృదాని" అని శాకుంతలములో, దుర్వాసుని శాపము వలన దుష్యంతుడు శకుంతలను పూర్వ జన్మయందలి చెలిమినివలె మరచిపోయినను శకుంతలకు సంబంధించిన వాసన అతని మనస్సులో అంతరాంతరములలో కలదనియు అది మధురసంగీత శ్రవణమువలన రేగి దుష్యంతుని మనస్సును చికాకుపరచినదనియు పూర్వజన్మ సంస్కారమువంటిదే శకుంతలతోని స్నేహమనియు వర్ణించెను. కాదంబరీ కథకూడా దేహి పునర్జన్మసిద్ధాంతమునే చాటుచున్నది. అట్టి పూర్వజన్మ వృత్తాంతముతో సంబంధించిన బౌద్ధ పౌరాణిక వాఙ్మయములోని దివ్యావదానములో చండాలిక కథ నిచ్చట ప్రస్తావించెదను.

ఒకనాడు ప్రకృతి యను చండాలకన్యక బావి నుండి నీరు చేదుకొనుటకు వచ్చెను. అదే సమయమున అచ్చటికి బుద్ధుని శిష్యులలో అగ్రగణ్యుడగు ఆనందుడు పిపాసితుడై వచ్చెను. నగరమంతయు భిక్షాటనము చేసి తిరిగి వచ్చిన యతడు చండాలకన్యకను నీరిమ్మని అడిగెను. ఆ కన్య తాను చండాల జాతికి చెందినదానను అస్పృశ్యనని చెప్పగా ఆనందుడు తన కామె జాతితో సంబంధము లేదని నీరిమ్మనెను. ఆ చండాల కన్యకకు ఆనందునియం దనురాగము కలిగెను. చండాలిక తల్లి ఒక మంత్రగత్తె. ఆమె తన మంత్ర బలముచే కూతును సంతోషింప చేయుటకు ఆనందుని తన యింటికి రప్పింప చేసెను. కాని ఆనందునికి కనువిప్పు కలిగి బుద్ధుని స్తోత్రము చేసి అప్పటి విపత్తును తప్పించుకొని బయటపడెను. చండాల కన్యకకు దాసుడైనచో అతని సన్న్యాసాశ్రమ ధర్మము నశించి బుద్ధునిముందు తల ఎత్తుకొనలేడు. బుద్ధభగవానుడే తనకు శిష్యుడు, భక్తుడు నయిన ఆనందుని రక్షించెను. మంత్రగత్తె బుద్ధునిశక్తిముందు తన మంత్ర

శక్తి విరుపయోగమని చెప్పినను చండాల కన్యక ఆనందుని విడనాడజాలక అతడు భిక్షాటనము చేయునప్పు డతనిని వెంబడించెడిది. బుద్ధభగవాను డప్పుడు ఆ చండాల కన్యకకు ధర్మమార్గమును బోధించి సంఘారామములో భిక్షుకిగా చేర్చుకొనెను. అస్పృశ్య యగు ఆ చండాలికను భిక్షుకిగా చేర్చుకొనుటకు ప్రజానీకము సమ్మతించ లేదు. అప్పుడు బుద్ధుడు ఒక కథను చెప్పెను. త్రిశంకు డను చండాల ప్రభువు విజ్ఞానవంతుడైన శార్దూలకర్ణుడను తన కుమారుని వివాహమును ఒక బ్రాహ్మణ కన్యకతో జరుపదలచెను. కాని ఆ కన్యక తండ్రి ఆ వర్ణాంతర వివాహమునకు ఒప్పు కొనలేదు. కాని త్రిశంకుడు బౌద్ధమతము బోధించు సర్వమానవ సహనతను వివరించగా ఆ బ్రాహ్మణుడు బౌద్ధమత సూత్రములచే ప్రభావితుడై ఆ వివాహమునకు ఒప్పుకొనెను. ఈ కథను చెప్పిన తరువాత బుద్ధుడు తానే త్రిశంకుడై పుట్టియుండె ననియు త్రిశంకు పుత్రుడే ఆనందుడనియు ప్రకృతియే బ్రాహ్మణకన్యక యనియు చెప్పెను.

బౌద్ధ పౌరాణిక గాథలలో, జాతక కథల లోను హిందూపురాణముల యందలి త్రిశంకుడు, దశరధుడు వంటి పాత్రలే తారసిల్లు చుండును. బౌద్ధ జాతక కథలలో దశరథ జాతకముకూడా కలదు. కాని అందలి కథ రామాయణకథకు భిన్నముగా నున్నది. ఇట్లు బౌద్ధ జాతకకథలు భారతీయ కథా వాఙ్మయమునందు విశిష్టస్థానమును వహించినవి.

ఈ విధముగా భారతీయ కథావాఙ్మయము వేదకాలమునుండి, క్రమాభివృద్ధి నొందుచు, వివిధ ప్రాంతీయ భాషలలో తన ప్రాచీన కథా శిల్పమును ప్రతిబింబింపజేయుచు అతి విశాల స్వరూపమును దాల్చుచు, రెండు మూడు శతాబ్దములుగా భారతదేశ భాషాసాహిత్యములపై తన ప్రభావమును సంక్రమింప జేసినది. ప్రాశ్చాత్య భాషల ప్రభావముకూడ సంక్రమించినందువలన పాశ్చాత్య భాషల కథా శిల్పముగూడ మనకు అంకితమై అది వివిధ భాషలలో వివిధ కథానికల రూపమున వ్యాపించి అత్యంతముగా విస్తరిల్లినది. ఈ విధముగనే జైన వాఙ్మయమునందు కూడ కథా శిల్పము విశిష్టమై కనబడుచున్నది. వీటినన్నింటిని విమర్శించి మన భాషల కథా వస్తువును తీర్చి దిద్దవలసిన అవసరము ఎంతయో కలదు. దానిద్వారా వివిధ మతములలో వివిధ రూపముల వ్యాప్తి చెందియున్న మన సంస్కృతిని ఈ యుగమునందలి ఆధునికులకు అవగతము చేయవచ్చును. కనుక మన కథానికా రచయితలు ప్రాచీన వాఙ్మయ కథానికల వైపు దృష్టి మరలించి అందలి అమూల్యములైన మణులను ఈ యుగపువారలకు అందింతురుగాక.

హిమాలయములు

యోగాసన రత్న యశ్వంత్ సిన్హా.

కర్మభూమిగా ప్రసిద్ధి చెందిన భరతఖండానికి పెట్టని కోటలుగా విలసిల్లుచున్న హిమవత్పర్వతాలను గురించి కాళిదాసాది మహాకవులు తమ కావ్యాలలో పేర్కొన్న వర్ణనలు, విశేషాలు, వీటిని తిలకించినవారికి (యాత్రికులు) వాస్తవములేనని రుజూచేస్తాయి. హిమాలయాలు వాటి ఔన్నత్యాన్ని గురించి పరిశీలిస్తే స్థావరంగా వుండే హిమాలయాలు తానే నని శ్రీకృష్ణభగవానుడు విభూతులను వర్ణిస్తూ వివరించిన విషయం గుర్తుకొస్తుంది. కృష్ణద్వైపాయనుడు వేదములను ఇక్కడనే వర్గీకరించారు. ఆయన అష్టాదశపురాణాలను ఉపపురాణాలను కూడ ఈ ప్రదేశంలోనే రచించారు. జగద్గురు ఆది శంకారాచార్యులవారు బద్రీనాథ్‌లో బ్రహ్మసూత్రములు, ఉపనిషత్తులు, గీతమీద భాష్యములను వ్రాశారు. శైలికాది ధాతువులు, వివిధ రంగులతో సుగంధ పరిమళంతోకూడిన పుష్పజాతులు హిమాలయ పర్వతాలలో వున్నవి. ఋష్యాదుల తపోమహిమవల్ల ఆధ్యాత్మిక స్పందనములు ఆవిర్భవించినట్టు ఈ ప్రాంతాలలో కాలినడకన తిరుగాడిన అస్మదాదులకు అనుభవమైనది.

హిమాలయ పర్వత ప్రాంతాలలోని యాత్రాస్థలాలు, దేవాలయాలు వాటి ప్రాశస్త్యాన్ని గురించి తెలుపుతాను.

హిమాలయాలలోని ప్రముఖ యాత్రా స్థలాలివి:- కాశ్మీర్‌లోని అమర్‌నాథ్‌గుహ, శ్రీనగర్ పట్టణానికి 89 మైళ్ళ దూరాన 14,297 అడుగుల ఎత్తున వున్నది. ప్రతి శ్రావణ పౌర్ణమికి వేలాది యాత్రికులు ఈ స్థలాన్ని సందర్శిస్తారు. యమునోత్రి; 10,800 అడుగుల ఎత్తున వున్నది. గంగోత్రి; 10,300 అడుగుల ఎత్తున వున్నది. కేదారనాథ్; 11,750 అడుగుల ఎత్తున వున్నది. బద్రీనాథ్ 10,200 అడుగుల ఎత్తున వున్నది. పశుపతినాథ్ 6 వేల అడుగుల ఎత్తున వున్నది. ఈ ఐదు పవిత్ర స్థలాలు కేదార్ ఖండంలో వున్నవి. వైశాఖ మాసంలో సర్వసాధారణంగా పశుపతినాథ్ మినహా మిగిలిన నాలుగు స్థలాలకు వెళ్ళడానికి వీలున్నది. మొదటి రెండుయాత్రా స్థలాలకు చేరకోరు ప్రయాణీకుల కొరకు మార్గం మధ్యలో ప్రతి తొమ్మిది మైళ్ళకు చెట్టీలు ఏర్పాటైనవి. మిగిలిన రెండింటికి ప్రతి మూడుమైళ్ళ దూరంలోను చెట్టీలు వున్నవి. హరిద్వార్ నుండి జంబోత్రికి 140 మైళ్లు; అక్కడి నుండి గంగోత్రికి 99 మైళ్లు; గంగోత్రి నుండి కేదారనాథ్‌కు 121 మైళ్లు; కేదారనాథ్ నుండి బదరీనాథ్‌కు 101 మైళ్లు దూరం వున్నది. ఈ నాలుగు స్థలాలలోను దీపావళి అమావాస్యవరకు నిత్యం పూజాదికాలు జరుగుతవి. అంతవరకు యాత్రికులు వీటిని దర్శిస్తుంటారు. పశుపతినాథ్‌ను మహాశివరాత్రి తరుణంలో మాత్రం దర్శించడానికి వీలుంటుంది. ఇది నేపాల్‌లో వున్నది. ఇక్కడికి 96 మైళ్ళ దూరాన 18 వేల అడుగుల ఎత్తున దామోదరకుండులో సాలిగ్రామ్‌లు ఉద్భవిస్తవి. ఇవి ఆరు రూపాలలో బంగారంతో మిశితమైవుంటవి. నేపాల్‌లో రుద్రాక్షచెట్లు వున్నవి.

మానససరోవర్ 15 వేల అడుగుల ఎత్తున వున్నది. కైలాస శిఖరం 22 వేల అడుగుల ఎత్తునవున్నది. అల్మోరా నుండి ఇక్కడికి కాలినడకన రావడానికి 538 మైళ్లు నడువవలెను. ఈ రెండు ప్రదేశాలు పశ్చిమ టిబెట్‌లో వున్నవి. ఈ యాత్రా స్థలాలన్నిటిని నేను పలు పర్యాయములు సందర్శించాను. 1961 వ సంవత్సరం వరకు, పశ్చిమ టిబెట్‌లో వున్న మానస సరోవర్, కైలాస శిఖరం ప్రాంతాలను యాత్రికులు సందర్శించడానికి వీలుండేది.

జీవితహాస్యలేశములు :

కథకాని కథ

పి. సుశీల

ఒక పర్యాయం ఒక సేట్‌గారు తన మిత్రుడి జన్మదినోత్సవ సందర్భంలో ఏదైనా విలువైన కొత్తరకం వస్తువుల్ని కానుకగా యివ్వాలనుకున్నాడు. అతగాని స్నేహితుడు మంచి కళాప్రియుడు. స్నేహితుడి డ్రాయింగురూములో అనేక రకాలైన శిల్పాలు, చైనా మట్టి పాత్రలు, చెక్కతో గాజుతో చేసిన చిత్ర విచిత్రమైన వస్తువుల్ని చూశాడు. సేట్‌గారికి అటువంటిదే యేదైనా వస్తువును యివ్వాలనే కోరిక కలిగింది. ఆయన ఒక పాటరీస్ దుకాణానికి వెళ్ళాడు. అక్కడ చైనామట్టితో చేసిన అనేక రకాల ఖరీదయిన వస్తువుల్ని చూశాడు. ధరనుగురించి కనుక్కోగా ఆయనకు నచ్చిన యేవస్తువుగూడా 150 రూపాయలకు తక్కువగా లేదు. అలా వీక్షిస్తూ వుండగా, క్రింద ఖానాలో పెట్టిన ఒక అందమైన చైనా కూజా కనిపించింది.

వెంటనే దుకాణదారుణ్ణి "దీని వెల ఎంత" అని అడిగాడు.

"సేట్‌గారూ ! ఇదయితే చాల కిమ్మతు గల్గిన వస్తువే మరి; కాని వెధవనౌకరు దీన్ని విరగగొట్టాడండీ" అన్నాడు షావుకారు. సేట్‌గారికి మంచి ఆలోచన తట్టింది. తక్కువలో బేరంకు దిరించాలని, ప్యాకింగ్‌తో సహా మొత్తం 55 రూ. లకు కూజాను బేరమాడి పోస్టుద్వారా పంపమని దుకాణం యజమానికి మిత్రుని అడ్రసు ఇచ్చి వెళ్ళిపోయాడు. కూజా పోస్టులో పగిలిపోయిందనే సాకు తన మిత్రుడికి చెప్పవచ్చని అతని వుద్దేశం.

లాభసాటి బేరం కుదిరినందుకు సేట్‌గారు లోలోపలే పొంగిపోయాడు. ఒకవారం తదుపరి స్నేహితుని దగ్గరనుండి వుత్తరం వచ్చింది. దానిలో యిలా వుంది:

"మీ కానుకకు హృదయపూర్వక ధన్యవాదాలు. విడివిడిగా ప్యాకింగ్ చేసి పంపించిన కూజా ముక్కలు భద్రంగా చేరాయి."

ఆధునిక తెలుగు సాహిత్యం - నేటి అవసరాలు

—పోతుకూచి సాంబశివరావు.

ఆధునిక తెలుగు సాహిత్యం, యీ మధ్య ఆంధ్రదేశంలో సంభవించిన వరదల్లా ఉధృతంగా, క్లిష్ట వాతావరణం సృష్టించి, వివిధ విచిత్రపోకడలతో నడుస్తోంది. ఒక పద్ధతి, ఒక ధ్యేయం, లేకుండా నడిచే నేటి సాహిత్యం గమ్యం ఏమిటో అర్థంకాదు. దేశంలో నిర్మాణాత్మక సందేశ దృక్పథంతో క్రొత్తదనం సంతరించుకుని బ్రతకవలసిన సాహిత్యం అదోక విధమైన రాక్ అండ్ రోల్ నృత్యంలా గతులు మారుస్తూ గంతులు వేస్తోంది అనిపిస్తోంది.

గ్రాంధికవాదబలం తగ్గి గ్రామ్యవాద ప్రభావం పెరిగాక వచనంలో అనంతమైన సాహిత్యసృష్టి జరిగింది. ఈ సాహిత్యం ఎక్కువరకం పేలవంగా ఉండడం, ప్రతీ మనిషి సాధారణ గ్రామ్య ధోరణిలో ఏదో గిలికి సాహిత్యం అని ట్రేడ్ మార్కుతో చెలామణీ చేస్తూండడం, నిశితంగా సాహిత్యవిలువలు అర్థం చేసుకునే పండితులకు కొంత గర్హనీయంగానే వుంది. సాహిత్యానికి ఒక నిర్వచనం లేదా అనే సవాలు ఎదురుగా నిలుస్తోంది. ప్రతీ మనిషి రచన చేసి యిది సాహిత్యమే అంటే, అసలు రచయిత అంటే ఎవరు ? అని, నిష్ణాతులైన పండిత రచయితలు తమ పాండిత్య ప్రకర్ష అంతా వ్యర్థమైనట్టే భావిస్తున్నారు. ఆధునిక రచయితకు, ప్రాచీన దృక్పథం కల్గిన పండిత రచయితకు సమన్వయం ఉండే సాహిత్యం సృష్టింపబడుతోందా? ఈ విశృంఖల సాహిత్య స్వభావంకు ఒక నిర్దుష్ట స్వరూపం యివ్వాలా అక్కర్లేదా? విశృంఖలంగా వ్రాసేయడమే నేటి ఆధునిక సాహిత్య నూత్న పోకడగా భావింపబడుతోందా? అన్న ప్రశ్నలు విమర్శక దృక్పథంతో ఆలోచించే వ్యక్తికి కొంత అశాంతి కలుగచేస్తున్న మాట వాస్తవం.

కందుకూరి వీరేశలింగంతో ఆధునిక యుగం ప్రారంభమయి వచనం ప్రాముఖ్యత పొందింది. గతంలో కవిత కున్న ప్రాధాన్యతవల్ల సాహిత్యమంటే కవిత్వం అన్న భావం ఏర్పడింది. వచనంలో నూత్న ప్రక్రియలు, కథ, నవల, నాటిక నాటకం, విమర్శ, వివిధ పోకడలు సంతరించుకుని, వినూత్న శిల్పంతో ముందుకు రావడంవల్ల, కవిత్వ మంటే ఒక పద్యమే వ్రాయడం కాదనీ, వచనంలో కూడా కవిత్వం ఉండవచ్చనీ, మార్పు అంగీకరించబడింది. కవిత్వంలో, వచన కవిత నేడు ముఖ్యమైన స్థానం పొందింది. వచనం రాసే రచయిత సులువుగా వచనకవిత్వం ప్రారంభించాడు. వచనకవితకు పునాదులు వేసిన శ్రీ శ్రీ పద్యరచనలో దిట్ట. ఆ ప్రావీణ్యం సంపాదించాక ఒక ఉద్యమ స్ఫూర్తి కలిగే వచనకవిత క్రొత్తపోకడ సృష్టించారు ఆయన. అంత్యప్రాసల క్రీడయే కవిత్వంకాదు. సమాన భూయిష్ట పదజాలమే కవిత్వంకాదు. అర్థంకాని సంశ్లిష్టపద సమూహమే కవిత్వంకాదు. ఏ పదాల కూర్పులోనైన నిబిడీకృత భావం ప్రధానం. భావం, శిల్పం లేని పదాల అలంకరణ కవిత్వంకానేరదు. పద్యం ప్రాముఖ్యత తగ్గి కవిత్వంలో కూడా వచనం వచ్చాక, వచనరచయితలకంటె వచనకవుల సంఖ్య పెరిగింది. కాని కవిత్వ సంపత్తి అధికంకాలేదు. నాల్గుపదాలు అల్లడం, లేదా ఒక వరసలో పేర్చడం నేటి వచనకవిత ముఖ్య లక్షణమై పోయింది. తరతరాలనుంచి సాహిత్యరంగంలో కవికి ఉన్న స్థానం, వచన రచయితలకు లేకపోవడంవల్ల, వచన కవితద్వారానైనా, కవులుగా చెలామణి కావాలన్న ఆకాంక్ష పెంచుకున్న, పెంచుకుంటున్న రచయితలు నేడు అనేకం. ఈ వక్రగతి సాహిత్యరంగంలో సమసిపోవాలి, ఉత్తమ సాహిత్య సృష్టి జరగాలంటే.

కథ - నవల - నాటిక — నాటకం - సంగీతరూపకం - వివిధరూపాలు వచన సాహిత్యం నేడు ప్రముఖమైన స్థానం పొందాయి. సాంఘిక ప్రయోజనం దృష్ట్యా వీటికి ఉన్న విలువ కవితకు లేనే లేదు. కాని యివి ఎంతవరకు పురోగమించాయి. కథలో, నవలలో, తదితర ప్రక్రియలలో వివిధ పోకడలు, వివిధ

సిద్ధాంతాలు అంతర్లీనంగా కనిపిస్తున్నాయి. ఒక్కొక్క భావోన్మాదం ఒక్కొక్క ప్రక్రియ ఒక్కొక్కస్వరూపం సృష్టిస్తున్నాయి. పరిమాణం విషయంలో వచనం యీనాడు ఆంధ్రదేశం వరదల్లా కట్టలు తెగి ప్రవహిస్తోంది. ఏది నీతి, ఏది అవినీతి అనే భేదభావం కూడా విస్మరించి వ్యక్తిని మానసికంగా, శారీరకంగా ప్రకోపింపచేసే సాహిత్యం శతవిధాల వెలువడుతోంది. రచన విషయంలో రచయిత, ప్రత్యేక పరిశీలన, సిద్ధాంత ప్రవచనం, లక్ష్య స్పష్టం. మొదలైన వాటికి దూరంగా ఉంటున్నాడు. ఏదో సన్ని వేశం తీసుకుని ఏదోవిధంగా వచనం పాత్రలు, పెంచి చిన్నది రాస్తే కథ అని, పెద్దది రాస్తే నవల అనీ, చలామణీ చేసుకుంటున్నాడు. ముఖ్యంగా యీ వచన రూపాల్లో రసోత్పత్తి నశించి, పోకడలు, పై మెరుగులు ఎక్కువ పోతున్నాయి.

ఆధునిక తెలుగు సాహిత్యరంగంలో వెనుకబడిన జాతికి చెందిన సాహిత్య విభాగం విమర్శ. పురాతన సాహిత్యంలో కూడా పద్య కావ్యాలు పెరిగిన సంఖ్యలో విమర్శ గ్రంథాలు పెరగలేదు. అయితే కాలక్రమంలో 19, 20 శతాబ్దాలలో పురాతన కావ్యాలు మథించి, తత్ నిజ స్వరూపాలు అరటిపండు ఒలిచేరీతిని, శబ్దార్థ తాత్పర్య వాఖ్యానాల సహితంగా కొన్ని గ్రంథాలు ప్రచురింపబడ్డాయి. పురాతన కవులు, భావాలు, పరిస్థితుల ప్రభావం, వారి సాహిత్య విలువల కూలంకషంగా విమర్శ చేయబడిన గ్రంథాలు కూడా ప్రచురింపబడ్డాయి. ఆధునిక పరిశోధనా వ్యాసాంగం పెరిగాక, యీ పురాతన సాహిత్యంలోని వివిధ ముఖ్య సంఘటనలకూ, ఘట్టాలకూ విశ్వవిద్యాలయాలు ప్రోత్సాహ మిస్తున్నాయి. కాని కందుకూరి వీరేశలింగం తర్వాత అనబడే ఆధునిక యుగం గురించి, సాహిత్య విలువలు గురించి, ప్రత్యేక విశిష్టత పొందిన రచయితలగురించి విమర్శ గ్రంథాలు వెలువడటంలేదు. గత చరిత్ర గురించి నేను వ్రాయడం పూనితే, కొంత ఊహ, మరికొంత కల్పనా జోడించక తప్పదు. కాని నేటిసాహిత్యం గురించి శ్రద్ధతో — పరిశీలించి, విమర్శ వ్రాయడంలో చాలావరకు చారిత్రక సత్యం ప్రతిబింబింప చేయడానికి ఎక్కువ అవకాశం ఉంది. కథ, నవల, నాటిక, మొదలైనవి వ్రాయడానికి ఉత్సాహం చూపే రీతిలో, విమర్శ వ్రాయడానికి ఎవరూ పూనుకోడంలేదు. అలా పూనుకునే ఏ కొద్ది విమర్శకులైనా, సృజనాత్మక రచన చేయలేని బలహీనత ఆధారంగా కువిమర్శల కుపూనుకునే వారే.

అసలు ఆధునిక సాహిత్యంగురించి విమర్శనా రంగంలో చేయవలసిన కృషి ఏమిటి? అన్న ప్రశ్నకు అనంతమైన జవాబు ఉన్నా, లేనట్టు కనిపిస్తుంది. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఈ మధ్య, ఆధునిక సాహిత్యంగురించి కొంత ఆలోచించడం ముదావహంకాని ఆధునిక సాహిత్య గ్రంథాలకు బహుమతు లివ్వడం ద్వారానే ఆధునిక సాహిత్యానికి మేలు చేకూరుతుం దనడానికి వీలులేదు. నిష్పాక్షిక విమర్శ గ్రంథాలు ఆధునిక సాహిత్యంమీద వెలువడాలి. బ్రతికిఉన్న రచయితల సాహిత్య విలువలగురించి నిష్కర్షగా చెప్పగలిగే పవిత్ర విమర్శక శిరోమణులు ఉదయించనినాడు ఏ యుగంలోనైనా తన్నుతాను మోసంచేసుకునే జీవితానికి వ్యక్తి బలి పోతాడేకాని, సంఘం, సాహిత్య రంగం, అంతర్గత రోగాలు మాపుకుని, ఆరోగ్యంగా బ్రతకలేవు. ఆధునిక సాహిత్యంలో, కందుకూరి నాటినుంచి, నేటి వరకు వెలువడిన గ్రంథాలు ఏమిటి ? రచయితలు ఎవరు ? గ్రంథాల సారాంశం ఏమిటి ? అన్న ప్రశ్నలు దృష్టిలో పెట్టుకుని ఒక వివరణ గ్రంథం వెలువడవచ్చు. ప్రాచీన సాహిత్యానికి, నేటి సాహిత్యానికి ఉన్న ముఖ్యమైన తేడా, సాహిత్య సృష్టిలో వేగం. ఒక సంవత్సరంలో, లేదా ఐదు సంవత్సరాల్లో, కవిత, కథ, నవల, నాటకం (నాటిక, సంగీతరూపకం కూడ కలిపి) మొదలగు ప్రక్రియల్లో వెలువడే సాహిత్యం అనంతం. అయితే దీన్ని వెన్నంటి, పడబట్టి సారాంశం అందించే సాహిత్యనాథుడు అరుదు. ఒకవేళ అటువంటి ప్రయత్నానికి పూనుకుని, ఏకొద్ది మందో, కొన్నిగ్రంథాలు చదివీ చదవక, వినీవినక, ముద్రిత, అముద్రిత గ్రంథాల భేదంతెలియక, అనువాదాలు, అనుకరణ, కాపీలు, స్వయంప్రతిభ కలిగిన సాహిత్య గ్రంథాలుగా ఎంచి, ఇతర భాషలలోని పురాతన ఆధునిక సాహిత్య సృష్టితో పరిచయంలేక, అన్నీ తెలిసినట్లు వ్రాయడంవల్ల, తెలిసీ తెలియకుండా అనేక పొరపాట్లు కొల్లలుగా చేస్తూనే వున్నారు. ఆధునిక తెలుగుసాహిత్యంలో ప్రతీ సంవత్సరం వెలువడిన సాహిత్య వివరాలు, సాహిత్యం విలువలు, యివ్వగలిగిన నిష్పాక్షిక విమర్శకులు నేడు కావాలి. అదేవిధంగా, కొన్ని ముఖ్య కాలాలు, అయిదేసిసంవత్సరాలసమయం తీసుకుని, ఆమధ్య వెలువడిన సాహిత్య నిజస్వరూపం కళ్ళకు కట్టినట్లు చెప్పగల

విమర్శకులు కావాలి. ఆధునిక సాహిత్య సృష్టి ఆదినుంచి, నేటివరకు వెలువడు తున్న వందలాది రచయితల జాతకాలు నిర్దుష్టంగా చెప్పగల్గే సాహిత్య జ్యోతిష్కులు కావాలి. ఒక విశిష్ట దృక్పథం, శిల్పం, కల్పనాశక్తి, రసోత్పత్తి, ఉత్తమ భావనాశక్తి కల్గిన రచయితల సాహిత్యంలో దాగున్న కొత్తదనం, వివిధ కోణాలనుంచి చర్చించి, తర్జన భర్జనచేసి, వ్యాఖ్యానించి, అందలి వైచిత్ర్యం అందించగలిగే విమర్శకులు కావాలి. ఆధునిక సాహిత్యయుగం ప్రారంభంనుంచి నేటివరకు, వివిధ ప్రక్రియల్లో వెలువడిన సాహిత్యంలోని మైలురాళ్ళవంటి పోకడలు సంతరించు తున్న రచనలు సేకరించి, వాఖ్యానంతో అందివ్వకలిగే సంపాదక విమర్శకులు కావాలి. సృజనాత్మక సాహిత్యంలో చెత్త పరిపారేసి, మిగిలినది సుస్థిరం చేయాలంటే, ఆ విలువలు అర్థం చేసుకోడానికి జీవితాలు వెచ్చించే పరిశోధకులు నేడు కావాలి ఆధునికసాహిత్యరంగంలో యిది నేడు చాలా అవసరం. చుక్కాని లేని పడవ సముద్రంలో గల్లంతుగా కొట్టుకుపోతున్న ట్లుంది నేటి ఆధునిక సాహిత్య రచనా ప్రయాణం.

అయితే, యిది సాధించడానికి ఏం చేయాలి అన్న విషయంపై అనేకమంది అనేక అభిప్రాయాలు వెలిబుచ్చవచ్చు. Organisation అన్నపదం ఆంధ్రదేశంలో యింగ్లీషు తెలిసిన ప్రతీ ప్రజాస్వామ్య వాదికీ తెలుసు కాని, సాహిత్యరంగంలో మాత్రం దీన్ని నిజాయితీతో అమలుపరిచే కార్యశూరులు తక్కువ. వ్యక్తిగత ప్రయోజనాలకు, తాత్కాలిక కీర్తి కాంక్షకు Organisation అన్నది వాడు కున్నంతగా దూరదృష్టితో, కాలాన్ని కట్టి వ్యాఖ్యానం చేయడానికి సంఘటిత శక్తితో పురోగమించిన వ్యక్తులు సాహిత్యరంగంలో నేడు అరుదు. ఏ పని చేసినా కొంత దూరదృష్టితో, ప్రణాళికాబద్ధంగా నిర్వహించడం మంచిది. అయితే యిటువంటి దానికి పరిస్థితులు అనుకూలించాలి. నేటి రచయితల మానసిక వాతావరణం అల్లకల్లోలమైంది. గాలిలో ఎగిరే రంగుల గాలిపటాల్లా కనిపించి, ఎప్పుడు ఏ గాలితాకిడికైనా చిరిగిపోయే ప్రమాదంతో సంచరిస్తున్నాయి వారి మనస్సులు. రచయిత, నిరంకుశ భావాలను కానీ, లేదా ప్రజాస్వామ్య దృక్పథంతో సమన్వయ దృష్టి కానీ, పూర్తిగా నమ్మి అవలంభించే మనస్థయిర్యం పొందిఉన్నట్లు కనపడదు. ఆంధ్రదేశంలో ఆధునిక సాహిత్యరంగంలో, వివిధ దృక్కోణాల నుంచి సంఘటిత శక్తితో సాహిత్య కృషి జరపడానికి, జరగడానికి, చక్కటి పునాదులమీద నడిపింపబడే Organisation ముఖ్యం నేడు.

ఆధునిక సాహిత్యం ఎక్కువగా పత్రికలద్వారానే పోత్సాహం పొందుతోంది. పత్రికలు తమ పేజీలు నింపడానికి రచనలు అవసరం. పెరుగుతున్న రచయితలకు తమ రచనలు ప్రచురింపబడడానికి పత్రికలు అవసరం. ఈ విధంగా పత్రికలు, రచయితలు ఆధునికయుగంలో పరస్పరం ఆధారపడి వున్నారు కాని రానురాను, ఏవో ఒకటి రెండు పత్రికలు తప్ప, తక్కినవన్నీ, ఆర్థిక లాభం ఒక్కటే దృక్పథంలో పెట్టుకుని పురోగమిస్తున్నాయి. కాలక్షేపానికి, స్త్రీలకు, విద్యార్థులకు, పత్రికలు ఉపయోగిస్తున్నాయి కాని విద్యాభివృద్ధికి, విజ్ఞాన సంపాదనకు, సాహిత్య పిపాసా విజృంభణకు యివి ఉపకరించటంలేదు ఒక్కొక్క రంగానికి సంబంధించిన పత్రికలు ఆ రంగంలోనే కృషిచేస్తే కొంత హర్షనీయం. సాహిత్య పత్రిక పూర్తి హాస్యానికి కాని, స్త్రీలపత్రిక పురుషుల సమస్యలు గురించి కాని, సినిమా పత్రిక వ్యాపారం గురించి కాని ప్రబోదిస్తే హాస్యాస్పదంగా ఉంటుంది, పైగా కర్తవ్యము, లక్ష్యం సిద్ధించబోదు.

ఆధునిక సాహిత్యరంగంలో పుస్తక ప్రచురణ పుస్తక విక్రయం విచిత్రమైన పోకడలతో ఆంధ్రదేశంలో నడుస్తోంది. పుస్తకం తక్కువ వెలకు పాఠకుడికి అందివ్వాలనే అభిప్రాయం వ్యాపారం చేసే ప్రచురణకర్తలకు లేదు. ఖరీదు పెంచి. బజారులో కమీషన్ పెంచి, పాఠకుడికి గ్రంథం అందుబాటులో లేకుండా చేసి, విక్రయ యత్నంలో లంచాలు పెంచి, మిగిలిన దానితో విపరీత లాభాలు పొందాలని యత్నించే నేటి యాంధ్రదేశ ప్రచురణకర్తలు తమ విధానాలు మార్చుకోవాలి. సాహిత్యసహకారసంస్థ సాహిత్యరంగములో ఒకకలగానే వుండిపోయింది. రచయిత తనగ్రంథంయొక్క విలువ సరియైన న్యాయమైన రీతిలో పొందగలిగిన నాడే నేటి పుస్తక విక్రయ బజారులో న్యాయం వుందని చెప్పుకోవచ్చు. అదీ కాక, ఆంధ్రదేశంలోనే ఒక ప్రాంతంలో ముద్రణరేట్లు తక్కువగానూ మరొక ప్రాంతంలో ఎక్కువగానూ ఉంటున్నాయి. దీనిగురించి ప్రభుత్వం కొంత ఆలోచన చేసి ఆంధ్రలో అన్నిప్రాంతాల్లో సమానమైన ముద్రణరేట్లు వుండేలా చూడడం ముఖ్యం. అసలు సాహిత్య రంగం అభివృద్ధి చెందాలంటే నే ప్రభుత్వం కొంత ముందంజ వేయాలి. ఆంధ్రదేశ

ప్రభుత్వం ఈ విషయంలో కొంతచొరవ, పురోగమనం చూపించిందనడంలో అతిశయోక్తి లేదు. అకాడమీల స్థాపన, ప్రత్యేక సాంస్కృతిక వ్యవహారాలశాఖ నిర్వహణ, పరిశోధన గ్రంథాలకు విరాళాలు, మున్నగు ప్రభుత్వ విధానాలు అందరికీ హర్షనీయమైనాయి.

ప్రభుత్వ బాధ్యతకన్న రచయిత దృక్పథంలో ఆరోగ్యకరమైన విప్లవ పంథా జనించాలి. సాహిత్యసృష్టి ధనంకోసం కాక, సాహిత్యాభివృద్ధికే అని పాటుపడిననాడు, రచయితనుంచి యింకా ఉత్తమమైన రచనలు ఉద్భవించగలవు. అదీకాక, రచయిత తన జీవితంలో అనుభవ వైవిధ్యం కోసం కృషి చేయాలి. ఎంత రచనా పాటవం ఉన్నా, ఒక్క కల్పనే రచనకు వన్నెలు చేకూర్చలేదు. కల్పనతో అనుభవ వైవిధ్యం జోడించినపుడు శిల్పం గణనీయంగా వర్ధిల్లుతుంది.

సాహిత్యం సృష్టించడం వేరు. సాహిత్యం విలువలు సరిగా అర్థం చేసుకుని, దానికి సరైన స్థానం కలిగించటం వేరు. మొదటిది రచయిత స్వయంకృషి, ప్రతిభవల్ల సాధించవచ్చు. రెండవది సంయుక్తకృషి రచయితలందరూ జరపాలి. తనను తాను తూలనాడుకోడం. యితరులను అనవసరంగా తూలనాడడం కూడా గర్హనీయమే. ఎంత ఉన్నత సాహిత్యమైనా గుడిలోలింగంలా పదిలంగా కూర్చుంటే, దాని ప్రఖ్యాతి, విలువకూడా పరిమితమై యుంటుంది. రచనలో ఎంత ప్రతిభ, ఎంత విశ్వజనీనత ఉన్నా, భాషేతరులు అర్థం చేసుకునేలా దాన్ని అనువాదం చేయించే పద్ధతులు సమకూర్చుకోవాలి. అందరికీ తెలిసిన భాషలో, ఒక ప్రాంతీయ భాషలోని సాహిత్యం తర్జుమా అయినప్పుడు, ఆరచన విలువ వివిధ ప్రాంతాలలో ప్రాకి, సరైనస్థానం సంపాదించుకోగలదు. ఎదురుగాఉన్న రచనలోని ఉత్తమసాహిత్యం యితరదేశీయుల దృష్టికి పోయినపుడు ఒక్కొక్కసారి ప్రాంతీయ కువిమర్శల వల్ల సరైనస్థానం పొందలేని రచనలకు విశ్వవిఖ్యాతి రాగలదు. ఇది దృష్టిలో పెట్టుకుని, సృజనాత్మక రచనకు ఎంత ప్రాధాన్యము యిస్తామో అలాగే మన సాహిత్యం ఇతర భాషల్లోకి అనువాదమవడానికికూడా అందరూ, ప్రభుత్వమూ కృషి చేయాలి. అనువాదాలకు, అనువాద సంస్థలకు ప్రభుత్వం సరైన సహకారం, సహాయం అందివ్వాలి.

ఆంధ్ర దేశపు సాహిత్యరంగంలో ప్రతిభ, ఉత్సాహం అనంతం. అయితే దాన్ని సరైన పద్ధతిలో, సక్రమ మార్గంలో, నిర్వహించగల్గిననాడు, ఆధునిక తెలుగు సాహిత్యానికి ఉజ్జ్వల భవిష్యత్తు ఉంది.





సైరంధ్రి

నాయని కృష్ణకుమారి

పండిత శ్రీ కొత్త సత్యనారాయణ చౌధరిగారి గద్యకావ్యం సైరంధ్రి చక్కని శైలిలో నడిచింది. వారు చెప్పినట్లుగా సంస్కృత భారతం ఒకబంగారు ముద్దయితే ఆ ముద్దనుండి తయారుచేసిన సువర్ణకమలమే తెలుగు భారతం — అందులో ఆకర్షణీయమైన మెత్తని రేకులూ, మనస్సు మెచ్చే పరిమళమూ వంటిది విరాట పర్వాంతర్గతమైన కథ. కవి బ్రహ్మ స్వయంగా వ్యక్తం చేసినట్లు ఈ కథ హృదయాహ్లాది. నానా రసాభ్యుదయోల్లాసిన్ని ! నాయిక సైరంధ్రీ, నాయకుడు భీమసేనుఁడూ, ప్రతినాయకుఁడు కీచకుడూ అయిన ఈ కథా పర్యవసానం వీర రసాత్మకమై కీచక వధారూపమైనటువంటిది. మళ్ళీ, వధ అమంగళాన్నీ, విషాదాన్నీ సూచిస్తుంది కాబట్టి, గోగ్రహణ సందర్భంలోని పాండవ విజయ రూపంలోనూ, ఉత్తరాభిమన్యుల వివాహ రూపంలోనూ దీన్ని శుభప్రదంగానూ, మంగళాంతంగానూ మలిచి యివ్వడం జరిగింది. ఈ కథే తిక్కన పాత్రనిర్మాణ కౌశలానికీ, వ్యంగ్యవైభవానికీ, నాటకీయ రచనా పరిణతికీ చక్కని లక్ష్యం కాగలిగింది. ఇటువంటి కథను ఎందరో విద్యార్థులకు పాఠంగా చెప్పి చెప్పి, తనివితీరక యీ 'సైరంధ్రి' రూపంలో తీర్చిదిద్దా నని కవి గారు చెప్పుకున్నారు. వారి ఆస్థా అపేక్షా రెండూ గొప్పవి.

అర్థశతానికి పైగా గ్రంథరచన చేసిన చౌదరిగారి శైలి విషయం ఎవరూ కొత్తగా ఎవరికీ చెప్పనక్కరలేదు. అది చాలా మనోజ్ఞమైంది. తేట తెల్లమైన తెలుఁగు మాటలతో, క్లిష్టతా, అన్వయ కాఠిన్యమూవంటి దోషాలపాల పడకుండా సరళంగా సాగే శైలి వారిది. తెలుఁగు భాషమీద అమితమైన ప్రీతిని నెఱపుతూ "జాత్యముగామి సంస్కృతము నెందునూ జొనుపను'' అన్నంత వీరప్రతిజ్ఞ చేసిన, తిక్కన వంటివాని కవిత్వాన్నీ, ఆయన నడిచిన మార్గాన్నీ అటూ ఇటూ బెసక నీయకుండా, అనుసరించడం ఏమీ సామాన్యమైన విషయంకాదు—

తెలుఁగు నుడికారాలలోని ప్రాణాల్ని తిక్కనవలె పట్టుకుని, స్వంతం చేసుకున్న మరోకవి ఇంచుమించు లేడనే చెప్పాలి. ఉన్నా, అది తిక్కన భిక్షే. తెలుఁగు పదాలకే కొత్తఊపిరి పోసి, ఇదివరకు ఎవరికీ చిక్కని అందాలనన్నిటినీ చిక్కబట్టి లోకానికి అందించగలిగిన పనిమంతుడు తిక్కన ఒక్కడే. అటువంటి కవి వాడిన నుడికారాలనూ, జాతీయాలనూ, అచ్చమైన తెలుఁగు మాటలనూ స్వాధీనం చేసుకోవాలంటే, ఆ శైలితో చిరకాలోపార్జితమైన పరిచయముండాలి. ఆ శైలిమీద అనన్య సామాన్యమైన శ్రద్ధాభక్తులు ఉండితీరాలి — ఇవన్నీ శ్రీ చౌదరిగారికి ఉన్నాయని ఆయన 'సైరంధ్రి' కావ్యాన్ని చదువుతూంటే, మరొకరు చెప్పకుండా తెలుస్తుంది.

సైరంధ్రిని చదవడం వలన నాకు మరో విషయం కూడా స్ఫురించింది. బహుశః శ్రీ చౌదరిగారు, విరాట పర్వ కథను విమర్శనాత్మకంగా వ్రాద్దామనుకుని ఉంటారు మొదట. అందునా, భారతకథలో కౌరవపక్షాన్ని సమర్థించాలనే ఉద్దేశ్యంతో! అందుకే యీయన పుస్తకం తొలిపేజీల్లో, గౌరవరాజ్యంగా సాగిన కౌరవరాజ్యపు ఉదాత్తతను గురించి కొంత వివరించడం జరిగింది. అజ్ఞాతవాసం ముగించి తిరిగి వచ్చినా, కురుదేశంలోని ప్రజలు దుర్యోధనుని మంచితనం మరిచి పాండవుల్ని పలకరించడానికి ఇచ్చగిస్తారా అని ధర్మరాజు కూడా సందేహించినట్లుగా చౌదరిగారు స్పష్టం చేశారు — అంతేకాక, ఆయనే మొదట, ''కౌరవులలో రాజరాజు బిరుదమందినవాఁడు దుర్యోధనుఁ డొక్కఁడే. కురుదేశమును పాలించిన రాజులే కౌరవులు. కౌరవు లన్న వ్యవహారము కేవలము ధార్తరాష్ట్రులకే దక్కినది. పాండవుల కా పేరు రాకుండుటకు వారు ప్రభువులేకాదు. ప్రజలలో వారొకరు. కావుననే వారికి కౌరవరాజ్యమేలెడి భాగ్యముగాని యర్హతగాని

రారా అన్నంతదాక రానేరాదు'' అని తమ అభిప్రాయాన్ని వెల్లడించారు.

కాని కౌరవశబ్దం కురురాజ్య పరమైందిగా కాక కురువంశ పరమైందిగానే ఎన్నోచోట్ల భారతంలో కనిపిస్తుంది. అంతెందుకు, ఈ విరాట పర్వంలోనే, అర్జునుడు ఉత్తరకుమారుడికి ద్రోణుణ్ణి చూపించి చెప్తూ. "కురుకుల నృపతనయ శిక్షకుఁడు సుమ్మనఘా!'' అన్నదాన్ని చౌదరిగారే,

"కౌరవ కుమారుల కందఱి కీతఁడే యాచార్యుఁడు'' అని అనువదించారు.

అలాగే. భీష్మార్జునులు తలపడి పోరు సాగిస్తూన్నప్పుడు భారతంలో,

''మలసి అంకెలు వైచుచు మాఱు కొనిన వృషభములభంగి నక్కురువృషభు లిట్లు సమదగతి జేరునెడ జూచి రమరులు అని ఉంటే,

సైరంధ్రిలో, ''అంకెలు వైచుచు మాఱుకొన్న వృషభములం బోలియున్న యా కురువృషభములను దేవతలు గాంచి తమ యనిమిషత్వమున కానందించిరి"— అని యున్నది—

కౌరవ పక్షపాతం వల్లనే వారికి కురు వంశం కురు రాజ్యంగా మారింది. అంతే కాక సైరంధ్రిలో అక్కడక్కడా కౌరవ పక్షం వైపూ, కౌరాభిమానులైన పాత్రల వైపూ వీరు హార్దికమైన మొగ్గు చూపించడంకూడా జరిగింది .... ఇందు కొక ఉదాహరణ.... భారతంలో,

"మొనలు దెరలినఁ గర్ణుండు మునుచి తాఁక నమ్మహావీరుఁ డాతని తమ్ము జంపి హరుల నొప్పించి సూతు నోనాడ నేసి....'' అని ఉంటే, సైరంధ్రిలో,

''కర్ణుఁ డంతటివా డుగ్రసుందరుఁడై మీదికిఁ గవిసిన వాని తమ్ముని జంపి...." అని ఉన్నది.

బహుశా యీ కౌరవాభిమానపూరిత హృదయంతో వారు వ్రాయడం వల్లనే, తిక్కనసోమయాజి అభిప్రాయం ఇది కాదే, అని చదువరులు సందేహపడే విధంగా అక్కడక్కడా సైరంధ్రీ రచన సాగిందని చెప్పవచ్చు.

భారతం:- ''అను పలుకులను భీష్ముండును ద్రోణుఁడు ద్రోణసూనుడును గృపుడుఁను మేలని యియ్యకొనిరి, హృదయానురూపములైన తెఱవులాస్యములు బొందన్.

సైరంధ్రి:- ఆ పలుకులకు భీష్మ ద్రోణ కృపాశ్వత్థాములు విషపు నవ్వులు నవ్వి మేలు మేలని పైకి బలికిరి.

భారతం:- కర్ణుని మాట సరకు చేయక చనుచుండఁగ దీనవృత్తి జనపతి పలికెన్. లోకంబుతోడివారుగ మీకుం జకునయ్యె మగఁటిమికి గుఱిగాదే నా కెడరైన యెడం దగఁ జేకొని యిది మీరు చక్కఁజేయుట యరయన్.

సైరంధ్రి:- కర్ణుని మాటలు సరకు సేయక వారి త్రోవను వారు పోవుచుండిరి. రారాజు వారిని జూచి సామాన్యులు వోలె మీరు సైత మీరీతిగఁ బోవచ్చునా? నాకాపద వచ్చిన తరుణములో మీరుపేక్షించుట మీకు పౌరుషలోపము కాదా, యని యడిగెను.

అక్కడక్కడా యీ రచనాపద్ధతి వలననే చౌదరిగారికి గల కౌరవ పక్షపాతాన్ని ఎత్తిచూపడానికి వీలు కలుగుతున్నది.

కాని 'సైరంధ్రి' అంతటా తిక్కన నుడికారపు సొంపు చెడకుండా, ఆయన్ని అనుసరించడం చక్కగా జరిగింది— ఉదాహరణకు.

భారతం:- సైరంధ్రి యిట్టు లనుటకుఁ గారణము దలంప నేమిగా నోపునొ యం చారసి బహుప్రకార విచారములకుఁజొచ్చు టుడుగు సరసిజవదనా.

సైరంధ్రి:- అట్లని యీ సైరంధ్రి కేమి కారణమా యని పదింబదిగ వాలోచనములలో దిగవలదు.

భారతం:- (పాండవులు) వచ్చిన చోటఁ బూరియు నొమ్మలవదె యింతకు....

సైరంధ్రి:- ఇంతకు వారు వచ్చిన చోట గడ్డియు మొలచియుండును.

భారతం:- బలుగాలిఁ చేర్చు దావానల మొక్కరుఁ డార్పఁబోయినను డీబునె నీ చలముడుగు సాహసమునంగలదే మేలెట్లు నధిపుఁ గావఁగవలదే.

సైరంధ్రి:- పెనుగాలిలో, బేర్చిన దావానల మొక్కరుఁడే యార్పను బోయినట్లు నీకీ చల మేల? సాహస మేల? ముందు రాజును గాచుకోవలయును....

తిక్కన తన కాలాన పటువైన అర్థాన్నిచ్చే జాతీయాలను మనస్సులో పెట్టుకొని భారతంలో ప్రతిచోటా వాడుకున్నాడు. అవి యీనాడు మనకు వాడుకలో లేని కారణాన, అప్పుడు అవి నిర్దేశించిన అర్థగాఢత మన బుద్ధి కందక పోవచ్చును. ఈ సూక్ష్మాన్ని గుర్తించిన శ్రీ చౌదరిగారు అందుకు అనుగుణంగా తమ రచనలో ఆయా జాతీయాలను మార్చుకోగలిగారు. ఉదాహరణకు :

భారతం:- (ఉత్తరుఁడు) ఈతండచ్చు పలుపడయ్యె నీ క్రియకు నొండొకనిన్.

సైరంధ్రి:- ఇంత రవలకు సారధ్యమున వానికిఁ దగిరవాఁడే దొరుకఁడాయెను.

భారతం:- ఎఱిఁగిన పని సెప్పఁగా వలయు. క్రీడి మనంబున మెచ్చునట్టి నేర్పును భుజశక్తియుం గలిగి రూఢికెక్కిన సూతవృత్తిమై నని సడిసన్న యేడ్తెఱ బృహన్నలకుం గల దంబుజాననా.

సైరంధ్రి:- మనకుఁ దెలిసినది మనము చెప్పవలెఁ గదా; అర్జునుని మనస్సునకే వచ్చిన తీరులో మన బృహన్నల సాయమున నర్జునుఁడు విజయలక్ష్మిని జేపట్టెను.

భారతం:- అధిపతి నిన్నున్ జన్నియ విడిచె రణము తఱి మిన్నక కినువడక పొమ్ము మీ గృహమునకున్.

సైరంధ్రి:- యుద్ధములు వచ్చినప్పు డధిపతి నిన్ను నచ్చపొడిచి విడిచివైచును కావున కినుకవడక హాయిగా నీవు నీ యింటికి దయ చేయవచ్చున ——

కొన్నిచోట్ల తిక్కన సోమయాజి రచన వివరణ నపేక్షించేదిగా శ్రీ చౌదరిగారికి తోస్తే, అలా వివరణాత్మకంగా తను కలం నడపడానికి ఆయన వెనుదీయలేదు. ఉదాహరణకు —

భారతం:- అని కాంతా జనములలో దను నగ్గించుటయుఁ బొంగి దర్పోద్ధతి నిట్లను నుత్తరుండు దన మనమున సంగర కౌతుకంబు ముడివడుచుండన్.

సైరంధ్రి:- ఈ మాటలు కోటలో, గాంతాజనము వినుచుండగాఁ దానును వినుటవలన నుత్తరుని చిత్తము పొంగి పోయి నిజముగా, దా నంతవాఁడనని యే భావించెను. భావించి యేమీ కౌరవులే వచ్చినడిరా? రానీ. వారిని మార్కొని నిమేషకాలములో నాలముందను దెచ్చె దను...

భారతం:- క్రీడియనికి వచ్చినవాఁ డిదె పులిపతె మార్కొనరాదె. తలఁకు గల దేని శకునిం బిలిచి విచారింపఁబొమ్ము పృథివీపతి నీ తలనె కార్య ఖడ్గముల మోపెక్కించె రిత్తవోవునె నీకున్.

సైరంధ్రి:- విన్వచ్చుఁకు పులిపతె రానేవచ్చెను. డీకొన వేమి! ఒకవేళ బీతు వుట్టినా? శకుని బిలిచి విచారింప వేమయ్యా? రాజు నీ నెత్తినే కార్యఖడ్గ ముల మోపెక్కించెనుగదా!-

ఈ రకంగా ఈయన రచన భారతానకి విధేయంగానూ, మిక్కిలి స్ఫూర్తి మంతంగానూ నడిచింది. తిక్కనకవి హృదయాన్ని ఆకళింపుకు తెచ్చుకోవడానికి ప్రయత్నించే ప్రతి జిజ్ఞాసువూ ఈ సైరంధ్రిని చదవడంవల్ల లాభాన్నే పొందగలఁడు.

వనితాలోకం



పంచాయతీ రాజ్యంలో మహిళల ముందంజ:

మహిళలు పరిపాలిస్తున్న మహారాజ్ పేట

— సి. వి. నరసింహారెడ్డి

భారత మహిళలు అబలలు కారు.

అనాది కాలమునుండి వారికి సమాజంలో అత్యున్నతమైన గౌరవస్థానము వున్నది. శౌశీల్యం, సౌకుమార్యం, సహనం భారతీయ మహిళల సొత్తు. అంతే కాక భారతీయమహిళలు, ధైర్య సాహసాలకు, వీరకృత్యాలకు, త్యాగాలకు పేరుపొందినారు. యుద్ధనిర్వహణ, పరిపాలనా దక్షత కేవలము, పురుషుల సొత్తు కాదని, చారిత్రకంగా మన స్త్రీలు రుజువు చేసినారు. పాండిత్యంలో గణనీయమైన విజ్ఞానాన్ని ఆర్జించారు. ప్రాచీన కాలం నాటి సీత, అనసూయ, సావిత్రి, సత్యభామ మొదలగు మహిళామణుల చరిత్రలే కాక, ఓరుగల్లు సామ్రాజ్యాన్ని దిగ్విజయంగా పరిపాలించిన రాణి రుద్రమాంబ, రామాయణము రాసిన కవయిత్రి మొల్ల విశేష ఖ్యాతి నార్జించారు. యిటీవలి కాలంలో, దేశస్వాతంత్ర్యానికై, త్యాగంచేసిన ఝాన్సీ లక్ష్మీబాయి, చాంద్ బీబీ, సరోజినీదేవి మొదలగు భారత నారీమణుల ప్రశస్తి జగత్ప్రసిద్ధము.

స్వాతంత్ర్యం తరువాత

స్వాతంత్ర్యానికి పూర్వం స్త్రీలకు సమాన అవకాశాలు లభించనందున వారు అన్ని రంగాలలో ముందంజ వేయలేదనుటలో అతిశయోక్తి లేదు. స్వాతంత్ర్యానంతరం, భారత రాజ్యాంగము ననుసరించి స్త్రీలు, పురుషులతో సమానమైన హక్కులు సాధించుకున్నారు. అన్ని రంగాలలో అభివృద్ధి చెందడానికి యీ మార్పు మహిళా లోకాన్ని ఉత్తేజపరిచింది. ఈ నాడు శ్రీమతి సుచేతా కృపలాని ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, కుమారి పద్మజానాయుడు పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి గవర్నర్ గానూ వ్యవహరిస్తున్నారు. శ్రీమతి విజయలక్ష్మి పండిట్ ఐక్యరాజ్య సమితికి అధ్యక్షురాలిగా ఎన్నుకోబడడం మహిళల పురోభివృద్ధికి చక్కని చిహ్నం.

పంచాయతీ రాజ్యంలో

మన దేశంలో ఈనాడు స్త్రీలు పెక్కు ఉన్నత పదవులలో ఉన్నారు. అన్ని రంగాలలో ముందడుగు వేస్తున్నారు. దేశ సర్వతోముఖాభివృద్ధికై ప్రారంభించిన ప్రణాళిక కార్యక్రమాలలో, జనాభాలో 50 శాతంవరకు గల స్త్రీలు భాగస్వాములు కావడానికి వీలుగా వారికి తగిన అవకాశాలు కలిపించబడినవి. గ్రామాభివృద్ధికై నిర్వహించబడుతున్న పంచాయతీ రాజ్య సంస్థలలో స్త్రీలకు ప్రత్యేక స్థానాలు కేటాయించబడినవి. స్త్రీ సంక్షేమ కార్యక్రమాలకై స్థాయీసంఘాలు ఏర్పాటు చేయబడినవి. గ్రామ గ్రామాన మహిళా మండలులు స్థాపించబడినవి. తత్ఫలితంగా మహిళలు

పంచాయతీరాజ్య కార్యక్రమాలలో భాగస్వాములై వాటి ఆశయసిద్ధికై తీవ్ర కృషి చేస్తున్నారు. గ్రామ పరిపాలనలో స్త్రీలుకూడ పురుషులతోపాటు సమానంగా, సమర్ధనీయంగా నిర్వహించగలరని నిరూపిస్తున్నారు. కొన్ని పంచాయతీలకు అందరూ స్త్రీలే ఎన్నుకోబడినారు పంచాయతీసమితి అధ్యక్షులుగా మహిళలు పనిచేస్తున్నారు.

మహిళా పంచాయితీలు

రాష్ట్రంలో ఇదివరలో ఒకే ఒక గ్రామం నల్లగొండ జిల్లా, మఠంపల్లిలో పంచాయితీకి అందరూ మహిళలే ఎన్నుకోబడి, స్త్రీలుకూడ పురుషులవలే గ్రామ పరిపాలనను, సక్రమంగా, సమర్ధనీయంగా నిర్వహించగలరని వారి 5 సంవత్సరాల పరిపాలనలో నిరూపించారు. మఠంపల్లి మహిళా పంచాయతీ, నిరక్షరాస్యత నిర్మూలన, ఆహార ధాన్యాల అధికోత్పత్తి, హరిజన కుటుంబాల సంక్షేమానికై చేసిన కృషి శ్లాఘనీయం. అందుకే కాబోలు బ్లాకుస్థాయిలో యీ గ్రామం, ఉత్తమ పంచాయతీగా ఎన్నుకోబడి రాష్ట్రప్రభుత్వం నుండి రు. 1000 ల బహుమానం పొందినది. శ్రీమతి ఇందిరా గాంధీ 1961 నవంబరులో అమెరికాలోని మహిళల జాతీయ ప్రెస్ క్లబ్‌లో, భారతదేశ అభివృద్ధిలో మహిళలు వహిస్తున్న పాత్ర అనే అంశంపై ప్రసంగిస్తూ ఆంధ్ర ప్రదేశ్‌లోని మఠంపల్లి మహిళా పంచాయితీని పేర్కొని 'మనస్త్రీలు వివిధ రంగాలలో ప్రశంసనీయమైన కృషి చేస్తున్నారని అన్నారు మఠంపల్లి మనరాష్ట్రానికే కాదు యావత్ భారత దేశానికి ఆదర్శనీయమైంది' అన్నారు.

ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికలలో, రాష్ట్రంలోని 11 గ్రామపంచాయితీలకు అందరూ మహిళలే ఎన్నుకోబడుట మరొక విశిష్టత. వీరి ఎన్నిక ఏకగ్రీవంగా జరుగుట ఒక ప్రత్యేకత. ప్రజలకు మహిళలపైగల దృఢ విశ్వాసం, అభిమానానికి ఇది చిహ్నం. ఇదివరలో కేవలం నల్లగొండ జిల్లాలో మాత్రమే మహిళా పంచాయతీ వుండేది. నేడు రాష్ట్రంలో యితర జిల్లాలకంటె ఎక్కువగా మహిళా పంచాయతీలను ఎన్నుకొని యీ జిల్లా రాష్ట్రానికి ఆదర్శప్రాయమైనది. మొత్తం 11 పంచాయతీలలో 5 పంచాయతీలు, మిరియాలగూడ, నూతనకల్, బొందుగుల్, ఇటుకుల్‌పహాడ్, గణపారం నల్లగొండ జిల్లాలోనివి. మహబూబ్‌నగర్ జిల్లాలో పాలెం, తాడిపత్రి తూర్పుగోదావరి జిల్లాలో, వి. సర్పారం పశ్చిమగోదావరి జిల్లాలో పోశన, హైదరాబాద్ జిల్లాలో మహరాజ్ పేట గ్రామాలలో మహిళాపంచాయతీలు వెలసినవి. పంచాయతీ రాజ్యలో మహిళల ముందంజకు యివి చక్కని తార్కాణాలు. మన రాష్ట్రం, యావత్ భారతావనికి ఆదర్శప్రాయమైంది.

మహరాజ్ పేట

మహరాజ్ పేట, హైదరాబాద్ జిల్లా, చేవెళ్ళ పంచాయతీసమితిలో, హైదరాబాదుకు 20 మైళ్ళ దూరాన ఒక చిన్న గ్రామం. ఈ గ్రామ జనాభ 1500. నిజాం ప్రభువుఅప్పటి ప్రధానమంత్రి మహరాజ్ కిషన్‌ప్రసాద్ గారి పేరుమీద నిర్మించిన గ్రామం కాబట్టి యీ గ్రామానికి మహరాజ్ పేట అనే పేరు వచ్చిందని స్థానిక పెద్దలు అంటారు. గ్రామం విశాలమైన రోడ్లతో, పరిశుభ్రంగా, శోభాయమానంగా, కనిపిస్తుంది.

ఇదివరలో నున్న గ్రామ పంచాయతీ ఏర్పాటుచేసిన గ్రామసభలో యీ పంచాయతీకి మహిళలనే ఎన్నుకోవాలని నిర్ణయం చేశారు. గ్రామంలో కొందరు ఈ ఆడపెత్తనం ఎందుకన్నారు. ఒక వయోవృద్ధుడు, ఇల్లును చక్కబెట్టేశక్తి గల స్త్రీలకు గ్రామాన్ని తీర్చిదిద్దేశక్తి కూడ వుంటుందని సమాధానమిచ్చాడు. మహిళలను ఎన్నుకున్నంత మాత్రాన సంప్రదాయ సిద్ధంగా వస్తూన్న పెద్దల అధికారాలు తగ్గవని కొందరు మహిళా పంచాయతీని సమర్ధించారు.

ఈ గ్రామ పంచాయతీలో గల 9 స్థానాలకు మహిళలు ఏకగ్రీవంగ ఎన్నుకోబడినారు. ఎన్నుకోబడిన సభ్యురాండ్రు శ్రీమతులు డి. రాములమ్మ, సి. బసవరాజమ్మ, ఎన్. రమణమ్మ, ఎం. ఈశ్వరమ్మ, ఎల్ రాజమ్మ, రాములమ్మ, ఎ. చంద్రెమ్మ, టి. రత్నమ్మ. సి. సాయమ్మ. శ్రీమతి డి. రాములమ్మ అధ్యక్షులుగా, శ్రీమతి రమణమ్మ ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడినారు, శ్రీమతి డి. రాములమ్మ ఆదర్శ గృహిణిగా, సాంఘిక సంక్షేమ, మహిళా సంక్షేమ కార్యక్రమాలలో మంచి ఆసక్తిగల స్త్రీ. స్థానిక మహిళామండలి అధ్యక్షురాలు కూడ. వయస్సులో అందరికంటె పెద్దది. అందరిలో చిన్న వయస్సుగల సభ్యురాలు శ్రీమతి సి. సాయమ్మ, హరిజన సభ్యురాలు, కష్టే ఫలి అని అంటాది. వ్యవసాయంలో మంచి అనుభవంకల స్త్రీ ఆమె వయస్సు 30 సంవత్సరాలు,

ఈ గ్రామం నిజాం ప్రభువు సర్ఫెఖాస్ ప్రాంతంలోనిది కావటం మూలాన, ఆర్థికంగా ఏమాత్రం అభివృద్ధి జెందలేదు.

గ్రామానికి ముఖ్య అవసరాలైన పాఠశాల, మంచినీటి వసతి, వ్యవసాయానికి నీటి పారుదల సౌకర్యాలు యిక్కడి ప్రజలకు అందుబాటులో వుండేవి కావు. గ్రామంలో మాగాణిపంట చాల తక్కువ.

1959 సంవత్సరంలో గ్రామ పంచాయతీ ఏర్పడిన తరువాత, యీ గ్రామంలో ప్రాథమిక పాఠశాల, 7 మంచినీటి బావులు, ఆరోగ్య ఉపకేంద్రం, పశువుల దవాఖానా, గ్రామానికి రోడ్డు, సహకార పరపతి సంఘం, పాలసరఫరా సహకార సంఘం, విద్యుచ్ఛక్తి మొదలగు సౌకర్యాలు లభించినవి. పురాతన పద్ధతుల ననుసరించి వ్యవసాయం చేసే రోజుల్లో ఎకరానికి 5 క్వింటాళ్ళు పండిస్తే. నేను నవీన పద్ధతుల ననుసరించి ఎకరాకు 15 క్వింటాళ్ళు పండిస్తున్నానని ఒక బీద రైతు శ్రీ పోచయ్య తన అనుభవాన్ని సగర్వంగా వివరించాడు. ఆహారధాన్యం ఉత్పత్తి 3 రెట్లు పెరిగింది.

లోగడ గ్రామపంచాయతీ సాధించిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించి, నూతనంగ ఏర్పడిన మహిళా పంచాయతీ గ్రామ సర్వతోముఖాభివృద్ధికై ఒక సమగ్ర అభివృద్ధి ప్రణాళికను రూపొందించింది. వ్యవసాయోత్పత్తికీ, విద్యా కార్యక్రమాలకూ అధిక ప్రాధాన్యం యివ్వబడుతుందని అధ్యక్షురాలు శ్రీమతి రాములమ్మ వివరించింది. దేశాభివృద్ధి కి విద్యావ్యాప్తి చాలా అవసరం. పురుషుడు విద్యావంతు డయితే ఒకే ఒక వ్యక్తి, విద్యావంతు డవుతాడు, స్త్రీ విద్యావంతురా లయితే, కుటుంబంలోనివా రందరూ విద్యావంతు లగుటకు అవకాశాలు కలవు. అందు చేత పురుషుల విద్యతోపాటు స్త్రీలలో విద్యావ్యాప్తికి గ్రామపంచాయతీ తీవ్రకృషి చేయగలదని ఆమె అభిప్రాయం ప్రకటించింది. స్త్రీలకు రాత్రి పాఠశాల ఏర్పాటు చేయనున్నారు. పాఠశాలకు వెళ్ళే వయస్సు గల బాలబాలికలను పాఠశాలకు పంపించే ఏర్పాటు చేస్తున్నారు. కొళ్ళాయిల ద్వార మంచినీటి పథకానికి, సర్వే పూర్తి అయ్యింది.

మహిళా పంచాయతీ నాలుగునెలల పాప. పెరిగి పెద్దదైతే భవిష్యత్తులో చాల కార్యక్రమాలు నిర్వహించవలసి వుంది. స్థానిక ప్రజలకు మహిళలు దిగ్విజయంగా కార్యక్రమాలు నిర్వహించ గలరనే దృఢ విశ్వాసం వుంది. మహిళలకు ప్రజా సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేయ గలమనే నమ్మకం వున్నది.

ఈ గ్రామ పంచాయతీ ఏకగ్రీవంగా ఎన్నుకో బడినందులకు రాష్ట్ర ప్రభుత్వం రు.2500/- బహుమానంగా యిస్తుంది. ఈ బహుమానాన్ని ఏ విధంగా ఉపయోగిస్తారన్న ప్రశ్నకు సమాధానమిస్తూ "గ్రామానికి ముఖ్యంగా మంచినీటి సరఫరా పథకం చాలా అవసరం. బహుమానంగా లభించిన ధనాన్ని కొళ్ళాయిల ద్వారా నీటి సరఫరా పథకానికి వినియోగిస్తామని" పంచాయతీ అధ్యక్షురాలు శ్రీమతి డి. రాములమ్మ చెప్పారు.

దేశ జనాభాలో సగానికి సగం మహిళలు. వీరందరూ పూర్వంవలెనే ఏదీ పట్టించుకోకుండా వెనుకబడివుంటే దేశాభివృద్ధి సాధ్యంకాదు. ఆయేటికాయేడు అధికంగా దేశాభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతూన్న యీ తరుణంలో స్త్రీలు వాటిలో పాల్గొనడం ఎంతో అవసరం. దేశరక్షణవంటి కార్యక్రమాలకు కూడ స్త్రీలు చేయవలసింది ఎంతోవుంది. ఏ దేశంలోనైనా స్త్రీలను చీకట్లో బంధించి పురుషులు మాత్రమే వెలుగు చూడాలని చేసే ప్రయత్నం వమ్ముకాక తప్పదు.

ఆదర్శవంతమైన యీ మహిళా పంచాయతీ ఆధునిక భారతదేశంలో ప్రతి గ్రామానికి ప్రోత్సాహకారిగావుంటుంది. మహారాజ్ పేటవంటి మహిళా పంచాయతీలు మనకు యింకా ఎన్నో కావాలి. స్త్రీలు ముందుకు రావాలి. దేశం బాగుపడాలి.



'రణభేరి'

విఖ్యాతాంధ్రకవులు
జాతీయైక్యత, రక్షణోద్యమ సందేశాలతో రచించిన ఉత్తేజకరాలైన
గేయముల రెండవ సంపుటి:

వెల 00-25 పై.

ఇతర ప్రచురణలు:

శంఖారావం: (గేయాలు)	0-25	పై.
కనువిప్పు : (బుర్రకథ)	0-25	,,
చైనాద్రోహం: వీరభారత్ (బుర్రకథలు)	0-25	,,
పాంచజన్యం: (బుర్రకథ)	0-25	,,
అల్లూరి సీతారామరాజు చరిత్ర	రూ. 2-75	,,
వందేమాతరం: (నాటిక)	రూ. 1-00	
అగ్గిగుండెలు-మరి రెండు నాటికలు	రూ. 1-00	

ప్రతులకు:
సమాచార ప్రజాసంబంధాల శాఖ
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
హైదరాబాద్

సహకార చక్కెర ఫ్యాక్టరీలు

ప్రపంచ మార్కెటులో చక్కెర ఎగుమతి చేసే ప్రధానదేశంగా ఇండియా రూపొందడంతో ఇటీవలి సంవత్సరాలలో చక్కెర ఆర్థిక వ్యవస్థలో హర్షనీయమైన పరిణామం ఏర్పడింది. దేశంలో చక్కెర సరఫరా, చక్కెర అవసరాలను సమన్వయ పరచడానికి మాత్రమే చక్కెర ఎగుమతులు జరుగవు. విదేశ మారకాన్ని ఆర్జించే మన ఎగుమతులలో ఇప్పుడు చక్కెర ప్రముఖస్థానం ఆక్రమిస్తున్నది. 1963 వ సంవత్సరంలో సుమారు 5 లక్షల టన్నుల చక్కెరను ఎగుమతిచేసి రూ. 32 కోట్లకుపైగా విదేశ మారకాన్ని ఆర్జించాము. ప్రపంచ మార్కెటులో, ముడి చక్కెరను, తెల్ల చక్కెరను ఎగుమతి చేసే ప్రధానదేశంగా ఇప్పుడు భారతదేశం పరిగణించబడుతున్నది.

దేశం మొత్తంమీద జరుగుతున్న చక్కెర ఉత్పత్తిలో ఇప్పుడు దాదాపు 22 శాతం ఉత్పత్తి సహకారరంగంలో సాగుతున్నది. మొదటి పంచవర్ష ప్రణాళికను ప్రారంభించడానికి పూర్వం సహకార రంగంలో చక్కెర ఉత్పత్తి శాతం 1.7 వుండేది. 1963 మార్చి 31 వ తేదీనాటికి దేశంలోని 57 సహకార చక్కెర ఫ్యాక్టరీల మొత్తం సభ్యత్వం 2.05 లక్షలు వుంది (9 వ పట్టిక చూడండి) వీరిలో చెరకు పండించేవారు 90 శాతం మంది వున్నారు. పై తేదీ నాటికి పూర్తి వాటా ధనం మొత్తం రూ. 21.17 కోట్లువుంది. దీనిలో రూ. 8.77 కోట్ల మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చాయి. రాష్ట్రప్రభుత్వాలు ఇందు నిమిత్తం కేంద్ర ప్రభుత్వంనుంచి దీర్ఘకాలిక ఋణాలు పొందాయి. జాతీయ చక్కెర పరిశ్రమ ఉత్పత్తి రంగంలో సహకార రంగానికిగల పాత్రనుగురించి చివర ఇచ్చిన 10 వ పట్టిక తెలియజేస్తుంది.

సహకార చక్కెర ఫ్యాక్టరీలకు అవసరమైన ధనంలో హెచ్చుభాగాన్ని భారత పారిశ్రామిక ఆర్థిక సహాయసంస్థ ఇచ్చే దీర్ఘకాలిక ఋణాలద్వారా పొందడం జరుగుతున్నది. ఈ సంస్థ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల హామీలపై ఋణాలు లభింప జేస్తున్నది. 1963 డిశంబరు 31 వ తేదీ వరకు ఈ సంస్థ సహకార చక్కెర ఫ్యాక్టరీలకు రూ.. 4.55 కోట్లమేరకు అదనపు ఋణాలను ఆమోదించింది. ఈ విధంగా 51 ఫ్యాక్టరీలకు రూ. 36.83 కోట్లవరకు ఋణాలు మంజూరు చేయబడినవి.

దేశంలో చెరకుపండించే ప్రధాన రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి. చెరకుపంట విస్తీర్ణాన్ని పెంచడానికి, అధికసంఖ్యలో సహకార చక్కెర ఫ్యాకరీలను నెలకొల్పడానికి మన రాష్ట్రంలో విస్తృతమైన అవకాశాలున్నాయి. చెరకును నిలువ వుంచడానికి సాధ్యపడదు కాబట్టి, ఇతోధికంగా చెక్కర ఫ్యాక్టరీలను నెలకొల్పడం ద్వారానే చెరకు ఉత్పత్తిదార్ల ఆర్థిక పరిస్థితిని క్రమంగా మెరుగుపరచడానికి వీలవుతుంది.

ఆంధ్ర ప్రదేశ్‌లో రెండవ పంచవర్ష ప్రణాళికలో లైసెన్సు పొందిన అయిదు సహకార చక్కెర ఫ్యాక్టరీలు ప్రస్తుతచెరకు ఆదే కాలంలో వినియోగంలోకి వచ్చాయి. ఈ అయిదు సహకార చక్కెర ఫ్యాక్టరీలు చిత్తూరు, చోడవరం, పాలకొల్లు, ఆముదాల వలస, నిజామాబాదులో పనిచేస్తున్నాయి. ప్రతి ఫ్యాక్టరీలోనూ 1963 డిశంబరు వరకు ఎంత చెరకు ఆడబడినదీ దిగువ పట్టీలో తెలియజేయబడింది. నిజామాబాదులోని సహకార చక్కెర ఫ్యాక్టరీ నిర్మాణం అభివృద్ధిదశలో వుంది:—

సహకార చక్కెర ఫ్యాక్టరీ పేరు	చెరకు ఆడుట ప్రారంభమైన తేది	31–12–63 తేది వరకు ఆడబడిన చెరకు పరిమాణం (మెట్రిక్ టన్నులు)	10–1–64 తేదినాటి దినవారీ సగటు పరిమాణం (టన్నులు)
ఆముదాల వలస	21–11–63	28 000	1,000
చోడవరం	5–12–63	17,744	1 000
చిత్తూరు	12–12–'63	13 070	950
పాలకొల్లు	3–12–'63	10 610	400

ఏటికొప్పాక, అనకాపల్లి, తునిలో మరో మూడు ఫ్యాక్టరీ లున్నాయి. వాటా ధనానికి పెట్టుబడి పెట్టడం ద్వారా నేరుగా కానీ లేక పెట్టుబడికి హామీగా వుండటం ద్వారా పరోక్షంగా గానీ ప్రభుత్వం వీటి నిర్వహణలో పాల్గొనలేదు. అయితే తునిలోని ఫ్యాక్టరీ పక్షాన నిర్వహణ ధనం ఋణం విషయంలో ప్రభుత్వం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు హామి ఇచ్చింది. 1963–64 వ సంవత్సరంలో ఈ మూడు ఫ్యాక్టరీల కార్యనిర్వహణ ఫలితాలు దిగువ విధంగా వున్నాయి.*

వ్యక్తిగత సహకార చక్కెర ఫ్యాక్టరీలు, రాష్ట్ర ఫెడరేషన్లను సమీకరించి కార్య నిర్వహణ సౌకర్యాలను కల్గించడానికి వీలుగా 1960_61 వ సంవత్సరంలో సహకార చక్కెర ఫ్యాక్టరీల జాతీయ ఫెడరేషన్ను నెలకొల్పారు. ఇది పురోభివృద్ధిలో ఉంది. సహకార చక్కెర ఫ్యాక్టరీలకు సాంకేతిక సలహాను అందించడంతో పాటు ఫ్యాక్టరీలకు ప్రభుత్వశాఖలు, ఇతర సంస్థలకు మధ్య పటిష్ఠమైన సంధాన కర్తగా కూడా వ్యవహరిస్తున్నది. యీ విధంగా ఫ్యాక్టరీలకు అవసరమైన సర్టిఫికెట్లు, దిగుమతి లైసెన్సులు పొందటం, ఉక్కు ఇనుము, బొగ్గు మొదలైన పదార్థాల సరఫరా విషయంలో కూడా జాతీయ ఫెడరేషన్ సహాయ పడుతున్నది.

ఎఫ్. ఎ. ఒ. (ఆహార, వ్యవసాయ, సంస్థ) ఇటీవలి నివేదిక అనుసరించి వచ్చే సంవత్సరాలలో భారతదేశం, ఆస్ట్రేలియా, మెక్సికో, దక్షిణ ఆఫ్రికా, దక్షిణ రోడీషియా మొదలైన అనేక దేశాలలో చెరకుగడ అధిక ఉత్పత్తి జరుగుతుందని అంచనా వేశారు. ప్రణాళిక అమలు 11 సంవత్సరాల కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో చెరకుగడ ఉత్పత్తితో పాటు ఆహార పదార్థాల ఉత్పత్తి గమనార్హమైన రీతిలో పెరిగింది. అన్నిరకాల ఆహారోత్పత్తుల ఉత్పత్తి 88.8 శాతం పెరిగింది. బియ్యం 98.7 శాతం, చెరకుగడ 65 శాతం పెరిగింది. గత యీ అభివృద్ధి, చక్కెర పరిశ్రమలో 5 లక్షల టన్నుల అదనపు ఉత్పత్తి శక్తికి లైసెన్సు ఇవ్వాలని ఇటీవల చేసిన నిర్ణయం దృష్ట్యానూ, క్రొత్తయూనిట్లను నెలకొల్పడానికి లైసెన్సులు ఇచ్చే విషయంలో సహకార సంఘాలకు ప్రాధాన్యం ఇవ్వాలనే విధానం కొనసాగింపు దృష్ట్యానూ సహకార చక్కెర ఫ్యాక్టరీల భవిష్యత్తు వాస్తవంగానే ఉజ్వలంగా ఉంది.**

*ఫ్యాక్టరీ పేరు	చెరకు ఆడు శక్తి	చెరుకు ఆడుట ప్రారంభమైన తేదీ	పరిమాణం	1963_64 వ సంవత్సరంలో 1963 డిశంబరు 31 వరకు	
				చక్కెర ఉత్పత్తి	రికవరీ శాతం
ఏటికొప్పాక	1.000	5_1'_63	17 870	1 362	7.93
అనకాపల్లి	500	1_12_63	12,904	1,176	9.1
తుని	350	5_12_63	7,946	545	7.80

**పట్టిక నెం 9.

1962_63 వ సం॥లో భారతదేశంలోని రాష్ట్రాలలో ఉన్న సహకార చక్కెర ఫ్యాక్టరీల సంఖ్యా వివరాలు

రాష్ట్రం		సహకార చక్కెర ఫ్యాక్టరీలు. పరిశ్రమల చట్టం (డి. ఆర్) క్రింద నమోదు అయిన లేక లైసెన్సు పొందిన వాటి సంఖ్య		ఉత్పత్తిలో ఉన్నవాటి సంఖ్య
ఆంధ్రప్రదేశ్	...	9	...	7
అస్సాం	...	1	...	1
బీహారు	...	1	...	-
గుజరాత్	...	3	...	3
జమ్మూ - కాశ్మీరు	...	-	...	-
కేరళ	...	2	...	-
మధ్యప్రదేశ్	...	-	...	-
మద్రాసు	...	6	...	3
మహారాష్ట్ర	...	20	...	17
మైసూరు	...	4	...	3_4
ఒరిస్సా	...	1	...	-
పంజాబు	...	6	...	4
రాజస్థాన్	...	-	...	-
ఉత్తరప్రదేశ్	...	4	...	3
పశ్చిమ బెంగాలు	...	-	...	-
యూనియన్ ప్రాంతాలు	...	-	...	-
మొత్తం (1962_63) ...		57	...	41
మొత్తం (1961_62) ...		57	...	34
మొత్తం (1960_61) ...		56	...	30

ఆధారం :_ న్యూఢిల్లీలోని కేంద్ర సమాజాభివృద్ధి, సహకార మంత్రిత్వ శాఖకు చెందిన 1963_64 వ సం॥ నివేదిక...

పట్టిక నెం — 10

భారతదేశంలోని సహకార చక్కెర ఫ్యాక్టరీల అభివృద్ధి వివరాలు.

కాలం	ఉత్పత్తిలో ఉన్న సహకార చక్కెర ఫ్యాక్టరీల సంఖ్య	చక్కెర ఉత్పత్తి (లక్షమెట్రిక్ టన్నులు.)	జాతీయ ఉత్పత్తిలో సహకార రంగం భాగం (శాతంలో)
1955_56	... 3	... 0.3	... 1.4
1956_57	... 8	... 0.6	... 2.9
1957_58	... 14	... 1.5	... 7.5
1958_59	... 21	... 1.8	... 9 3
1959_60	... 25	... 2.9	... 11.8
1960_61	... 30	... 4.5	... 14.8
1961_62	... 34	... 4.7	... 17.5
1962_63	... 41	... 4.7	... 21.4

ఆధారం : న్యూఢిల్లీలోని సమాజాభివృద్ధి సహకార మంత్రిత్వ శాఖకు చెందిన 1963_64 వ సం॥ నివేదిక.

'ఆంధ్రప్రదేశ్'

తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు మాసపత్రిక ప్రకటనరేట్లు

దిగువ రేట్ల ననుసరించి 'ఆంధ్ర ప్రదేశ్' మాస పత్రికలో ప్రకటనలు స్వీకరించబడగలవు.

వివరాలు	నాలుగు సంచికలలో			ఒక సంచికలో మాత్రమే		
	పూర్తిపేజీ	సగంపేజీ	పావుపేజీ	పూర్తిపేజీ	సగంపేజీ	పావుపేజీ
	రూ.	రూ.	రూ.	రూ.	రూ.	రూ.
లోపలి పేజీ	300	150	100	100	55	30
వెనుక అట్టపేజీ (4)	400	—	—	150	—	—
అట్ట 2, 3 పేజీలు	350	—	—	125	—	—

ఒక సంవత్సరం కాంట్రాక్టు ప్రకటనలకు 20 శాతం రిబేటు ఇవ్వబడును.

నిబంధనలు

1. మెకానికల్ వివరాలు : $10\frac{3}{4}'' \times 8\frac{1}{2}''$ డెమ్మీ
2. ముందుఅట్ట టైటిల్ పేజీపై ప్రకటనలు స్వీకరించబడవు.
3. పావు పేజీకి తక్కువగా ఉన్న ప్రకటనలు స్వీకరించబడవు.
4. వచ్చే సంచికలో ప్రచురించడానికి వీలుగా స్థలం వివరాలు, డబ్బుతోసహా ప్రకటన సమాచారాన్ని ప్రతినెల 8 వ తేదీలోపుగా యీ కార్యాలయానికి పంపాలి. క్రాస్ చేయని డిమాండ్ డ్రాఫ్ట్‌ద్వారా గానీ, మనియార్డరు ద్వారా గానీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌర సంబంధముల శాఖ డైరెక్టరు, హైదరాబాదు పేర డబ్బును పంపాలి.
5. బ్లాకుల విషయంలో అన్నివిధాలా శ్రద్ధ తీసుకోబడుతుంది. అయితే మిషనుపై బ్లాకు పగిలిన యెడల యీ శాఖ బాధ్యత వహించదు.
6. ప్రకటన విధం, స్థలం వివరాలను ఒక సంచికలో ప్రకటించాలో (భాషను తెల్పాలి) లేక 4 సంచికలలో ప్రకటించాలో స్పష్టంగా పేర్కొనాలి.
7. డబ్బు చెల్లింపు, యితర ప్రత్యుత్తరాలను దిగువవారితో జరుపాలి :—

డైరెక్టర్,
సమాచార పౌరసంబంధాల శాఖ,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,
హైదరాబాద్-1.

బాలసంక్షేమం

— చోడగం చంద్రమణి

కర్మాగారాల, యంత్రాలరూపంలో జాతీయాభ్యుదయానికి సంబంధించిన ప్రణాళికలను గురించి మనం యోచించేటప్పుడు అన్నిటికంటె ముఖ్యమైనవిషయం మానవుడు అనేసంగతి మనం మరచిపోతూ ఉంటాం. కర్మాగారాలూ, యంత్రాలూ ముఖ్యమే. అవన్నీ మనకు కావలసినవే కాని అన్నిటికంటె ఎక్కువ ప్రాముఖ్యం మానవునికే ఇవ్వాలి. అందులో ఆ ప్రాముఖ్యం పెద్దవాళ్ళ కంటె బాలలకే ఎక్కువ ఇవ్వాలి, అని హెచ్చరించారు శ్రీ జవాహర్‌లాల్ నెహ్రూ.

ప్రపంచం మొత్తంమీద, ఇటీవలివరకూ బాలసంక్షేమం ఒక అంశంగా గుర్తించి దానియెడల శ్రద్ధ వహించినట్టు కనబడదు. ఐక్యరాజ్యసమితి బాలల హక్కులను గురించిన ఒకప్రకటన చేసింది. అది జెనీవా ప్రకటన అని ప్రసిద్ధి పొందింది.

ఆ హక్కులు ఇవి :—

(1) జాతి వర్ణ, మత భేదాలతో నిమిత్తం లేకుండా బాలలకు రక్షణ కల్పించాలి.

(2) బాలను ఒకవ్యక్తిగా గుర్తించి జాగ్రత్త తీసుకోవాలి.

(3) భౌతికంగా, నైతికంగా, ఆధ్యాత్మికంగా బాలలు వృద్ధిపొందడానికి తగిన అవకాశాలు కల్పించాలి.

(4) ఆకలిగా ఉన్న బాలలకు ఆహారమూ, జబ్బుగాఉన్న బాలలకు చికిత్స ఇవ్వాలి. శారీరకంగాగాని, మానసికంగాగాని లోపాలు ఉన్నవారికి సహాయం చెయ్యాలి. సంఘంలో ఇమడనివాళ్ళకు తగిన శిక్షణ ఇవ్వాలి. దిక్కులేనివారికి ఆశ్రయమూ సహాయమూ కల్పించాలి.

(5) ఆపత్సమయంలో మొదట బాలలకు సహాయం చెయ్యాలి.

(6) సాంఘిక సంక్షేమ కార్యక్రమాల వల్ల బాలలకు సంపూర్ణమైన ప్రయోజనం కలగాలి. తగినవయస్సు వచ్చినప్పుడు జీవనోపాధి సంపాదించుకోగలిగేటట్టు బాలలకు శిక్షణ ఇవ్వాలి.

(7) తోడిమానవుల సేవకు తగినశక్తిని ఉపయోగించాలనే మనస్తత్వం కలిగేటట్టు బాలలను పెంచాలి.

మన రాజ్యాంగం కూడా స్త్రీలకోసమూ, బాలలకోసమూ ప్రత్యేకమైన సదుపాయాలు చేయాలని ఆదేశించింది. పద్నాలుగేళ్ళకంటె చిన్న వయసుగలవారిని కర్మాగారాలలో, గనులలో అపాయకరమైన వృత్తులలో నియమించకూడదనే నిబంధనకూడా ఉంది. రాజ్యాంగం అమలులోనికి వచ్చిన పదేళ్ళ లోపుగా, బాలలకు పద్నాలుగేళ్ళ వయస్సు వచ్చేవరకూ 'ఉచిత నిర్బంధవిద్యా సౌకర్యం కలిగించడానికి ప్రభుత్వం కృషిచేయాలని కూడా రాజ్యాంగంలో పేర్కొనబడింది.

పూర్వకాలంలో జీవితం చాలా సామాన్యంగా ఉండేది. జీవితావసరాలు బహు కొద్దిగా ఉండేవి. ఎక్కువ సమస్యలు ఉండేవికావు. రానురాను జీవితం క్లిష్టమైపోయింది. పారిశ్రామికాభివృద్ధితో, పట్టణాలు ఎక్కువ కావడంతో, సమష్టి కుటుంబాలు చితికిపోవడంతో కొత్త సమస్యలు బయలుదేరాయి. దిక్కులేనివారి సంఖ్య హెచ్చింది. భిక్షుకులసంఖ్య పెరిగింది. అపరాధులకు అవకాశం ఎక్కువయింది. నేరాలు పెరిగాయి.

మనకు స్వాతంత్ర్యం లభించి ప్రజాస్వామిక ప్రభుత్వం ఏర్పడడంతో దేశంలో విద్యకు ప్రాముఖ్యం వచ్చింది. పద్నాలుగేళ్ళ వయస్సుగల బాలలందరికీ ఉచిత నిర్బంధవిద్య లభించే సుదినం ఇంకా రాలేదు. ఈ పథకం పూర్తిగా అమలు జరుపబడేనాటికి అనాథబాలలు, అంగవైకల్యంగల బాలల సమస్యలను ఎదుర్కోవలసివస్తుంది.

ఆరోగ్యసమస్య ఒకటి ఉంది. మాతలకూ, బాలెంతలకూ తగిన సౌకర్యంకూడా తగినంతగా సమకూర్చలేక పోతున్నాం. బాల్యమరణాలసంఖ్య ఇంకా ఎక్కువగానే ఉంది.

కుంటి, గుడ్డి, చెవిటి, మూగ బాలలకు అవసరమయిన సంస్థలుకూడా ఇంకా ఎన్నో స్థాపించవలసి ఉంది. బడిపిల్లల ఆరోగ్యం కాపాడాలంటే వారికి తరుచు వైద్యులచేత పరీక్షచేయించడం అవసరం. ఇది ఇంకా సవ్యంగా జరగడంలేదు. సరిగా పరీక్ష జరిగితే బాలల లోపాలు అనేకం బయటపడి వాటికి తగిన చికిత్స చేయవలసిఉంటుంది.

ఉచిత నిర్బంధ సార్వజనీన ప్రాథమిక విద్య ఇంకా అమలులోనికి రాలేదు. పద్నాలుగేళ్ళకంటే తక్కువ వయస్సుగల బాలలు పని చేయవలసివస్తూంది. అనారోగ్య కరమైన పరిస్థితులలో పనిచేయవలసివస్తూంది. చాలా కుటుంబాలలో పిల్లలు పనిచేస్తేనేకాని వీలులేని పరిస్థితులు ఉన్నాయి. ఈ సమస్యలను పరిష్కరించితీరాలి.

అనాధ బాలలసంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. అట్టివారిని పెంచుకొనే పద్ధతి మన దేశంలో ఇంకా వృద్ధికి రాలేదు. బంధువులలో ఎవరైనా చేరదీయవలసి ఉంటుంది. లేదా బాలలకోసం సదనాలు స్థాపించి అందులో వారిని పోషించవలసి ఉంటుంది.

దిక్కులేని బాలలు భిక్షాటనకు బయలు దేరతారు. డబ్బు దొరకకపోతే నేరాలు చేయటం నేర్చుకుంటారు. ఇలాంటి సమస్యలన్నీ ఒకదానికి ఒకటి పెనవేసుకొని ఉన్నాయి.

సంఘంలో వచ్చిన మార్పుల ఫలితంగా పెళ్ళికాని తల్లుల సంఖ్యకూడా పెరుగుతోంది. అలాంటి తల్లులకూ, వారి పిల్లలకూ తగిన రక్షణ కల్పించవలసిఉంది.

బడికి వెళ్ళడం, రావడం, బడి పాఠాలే చదవడం, ఇంటి దగ్గరకూడా బడి పాఠాలకే సంబంధించిన పని చేయడం—ఇది బాలలకు ఆరోగ్యకరమైన విధానంకాదు. వారికి కొంత విశ్రాంతి, ఆహ్లాదకరమైన వ్యాపకం, వారిలో ఉన్న సృజనాత్మక శక్తిని సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా వృద్ధిచేయడం చాలా అవసరం. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, బాల్కన్‌జీ బారీ, రెడ్‌క్రాస్ మొదలైన సంస్థలూ ఈ విషయంలో కొంత కృషి చేస్తున్నాయి. సెలవులలో కాంపులు, వనభోజనాలు, వినోదయాత్రలూ, వైజ్ఞానిక యాత్రలూ, సంగీతనాటక కార్యక్రమాలూ, ఫిల్ముల ప్రదర్శనలూ, లైబ్రరీలూ, ఆటస్థలాలూ, మేలాలూ, ప్రదర్శనలూ మొదలైనవి స్వచ్ఛందసంస్థలు ఏర్పాటుచేస్తున్నాయి.

బాలల వయస్సుకూ, మనస్తత్వానికీ, గ్రహణశక్తికీ తగిన సాహిత్యం చాలా తక్కువగా ఉంది. ఇటీవలనే కొంత కృషి జరిగింది. బాలలకు మనోరంజనం కలిగిస్తూ జ్ఞానాభివృద్ధిని కలిగించే సాహిత్యం ఇంకా ఎంతగానో వెలువడవలసిఉంది.

ఇప్పుడు వివిధ సంస్థల మధ్య సమన్వయం ఎంతో అవసరం. బాలల సంక్షేమం కోసం ఏర్పడిన అంతర్జాతీయ సంస్థ (ది ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ ఛైల్డ్ వెల్ఫేర్) చాలా కృషిచేసింది. ప్రజలలో ప్రబోధం కలగడానికి అవసరమైన శాసనాలు చేయించడానికీ, ఉన్న సంస్థలను వృద్ధిచేయడానికీ ఈ యూనియన్ చాలాదేశాలలో పని చేసింది.

ఈ యూనియన్ అనుబంధ సంస్థగా ఉన్న బాల సంక్షేమ భారత సమితి (ది ఇండియన్ కౌన్సిల్ ఫర్ ఛైల్డ్ వెల్ఫేర్) సమన్వయం, సహకారం, పరిశోధన మొదలయిన విషయాల గురించి శ్రద్ధ వహించి కృషి చేస్తూ ఉంది.

సాంఘిక కార్యనిర్వాహక భారతమండలి (ది ఇండియన్ కాన్‌ఫరెన్స్ ఆఫ్ సోషల్ వర్క్స్) కూడా బాలల సంక్షేమం విషయములో శ్రద్ధ వహిస్తోంది.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలద్వారా ప్రపంచ ఆరోగ్య సంస్థ అంతర్జాతీయ బాల నిధి మొదలయిన సంస్థలు చేస్తున్నకృషి ప్రశంసనీయమైనవి.

కేంద్ర సాంఘిక సంక్షేమ మండలి బాల సంక్షేమంకోసం పాటుపడే సంస్థలకు విరివిగా సహాయం చేస్తోంది.

ప్రాణం ఉంటేనే కదా మానవుడు ఏపని చేసినా. ప్రాణం నిలబడడానికి ఆహారం ముఖ్యం. ఏదో ఇంత కడుపు నింపుకుంటే సరిపోదు. తిన్న ఆహారం పుష్టికలిగించాలి. సారంలేని భోజనంవల్ల ప్రయోజనంఉండదు. ప్రాణం నిలబడినా ఆరోగ్యం ఉండదు. ఆరోగ్యం లేకపోతే మరీయాతన. చావే మేలు. సారమైన తిండి అనేది ఈనాడు ప్రపంచంలో పెద్ద సమస్య అయికూర్చుంది. పసిపాపలకూ, బాలలకూ తగిన పుష్టికరమైన ఆహారం దొరకడంలేదు. దీనివల్ల వాళ్ళు బ్రతికి బయటపడినా బలహీనులై తమ విధులుసవ్యంగానిర్వహించలేకపోతున్నారు.

మనదేశంలో ఆహారంలో ముఖ్యంగా మాంసకృత్తులు లోపంగా ఉంటున్నాయి. మైసూరులో బహుళ ప్రయోజనకారియైన ఆహారం తయారుచేస్తున్నారు. అది అమ్మకానికికూడా సిద్ధంగా ఉంది. హైదరాబాదులో ప్రాంతీయ పరిశోధక సంస్థలో పత్తిగింజల పొడి తయారు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇలాంటి ఆహార పదార్థాల వల్ల బాలలకు పుష్టి కలుగుతుంది. ఇలాంటి పదార్థాలు బాలలకు లభ్యమయ్యేటట్టుచూడాలి. బడిపిల్లలకు మధ్యాహ్న భోజన సదుపాయం చేసే ఉద్యమంకూడా ఇప్పుడు నడుస్తున్నది.

రాష్ట్ర సాంఘిక సంక్షేమ సలహాబోర్డుల ఛైర్మనుల తొమ్మిదవ వార్షిక సమావేశం

(తరువాయి 56 పేజీలో)

ముగ్గురు మూఢులు

అక్కల బాబురావు

"కథ చెప్పు తాతయ్యా" అంటూ చుట్టూ మూగారు మనుమలు రామం, చంద్రం, రాజులు. "ఇప్పుడేం కథరా! నిద్రొస్తోంది" అంటూ తాతయ్య మారాం చేశాడు. "నిద్రా లేదు, గిద్రా లేదు. మాకు కథ చెప్పి తీరాల్సిందే" నని మనుమలు గట్టిపట్టు పట్టేసరికి తాతయ్య పొడుం కాయ తీసి చిటికెడు పొడుం పీల్చి కథ చెప్పటం ప్రారంభించాడు.

పూర్వం అనాలోచితపురంలో ముగ్గురు మూఢులున్నారు. వీళ్ళు తెలివి తక్కువతనంలో ఒకర్ని మించినవారు మరొకరు. ఆదేశం రాజుగార్కి తెలివి తక్కువవారిని చూస్తే చాలు; కాలక్షేపానికి కొదవలేదు అనుకుంటూ వుంటాడు. ఆదేశపు మంత్రిగారిని పిలిచి, మన రాజ్యంలో వున్న తెలివితక్కువ వారిలో ఘనుల్ని ముగ్గుర్ని తీసికొనిరమ్మని ఆజ్ఞాపించాడు. మంత్రిగారు మూఢుల్ని ఎన్నిక చేయటంకోసం సంచారానికి బయలుదేరారు. తిరగ్గా, తిరగ్గా మంత్రిగారికి ఒకవూరిలో వేరుశనగగింజలు వేయించి మరీ నాటుతున్న ఒక రైతు కనిపించాడు. "ఏమిటయ్యా! వేరుశనగ గింజలు వేయించి, మరీ నాటుతున్నావు? వేయించిన గింజలు మొలకలెత్తుతాయా?" అని మారువేషంలో వున్న మన మంత్రిగారు రైతుని ప్రశ్నించారు. "నీకేం తెల్సు పోవయ్యా! పచ్చిగింజలు నాటుతే పచ్చికాయలు వచ్చినప్పుడు, వేయించిన గింజలు నాటుతే వేయించిన కాయలు ఎందుకురావు?" అని మారు ప్రశ్న వేసిన రైతును చూచి, మంత్రిగారు వీడు తమ రాజుగారికి పనికివచ్చే మూఢుడులాగ వున్నాడనుకొని, వాని చిరునామా సేకరించి, మరొకచోటికి ప్రయాణమయి వెళ్ళాడు.

"తాతయ్యా! వేయించిన గింజలు మొలవ్వుగా మరి!" అని ప్రశ్నించాడు చిన్నిమనుమడు రాజు.

"అందుకనేగదా, వాడ్ని తెలివి తక్కువవాడి క్రింద జమకట్టింది" అని తాతయ్య సమాధానం చెప్పి, చిటికెడు పొడుం పీల్చి మళ్ళీ కథ చెప్పటం ప్రారంభించాడు.

అట్లా వెళ్ళగా, వెళ్ళగా మంత్రిగార్కి ఒక పెద్ద నీళ్ళగంగాళంలో నిప్పు లేస్తున్నమనిషి కనిపించాడు. "ఏమిటి నాయనా! నీళ్ళలో నిప్పు లేస్తున్నావు" అని మన మంత్రిగారు పరామర్శించారు. "నేను పొలంపనులు చూసుకొని వచ్చేసరికి, నీళ్ళు బాగా త్వరగా కాగాలని నీళ్ళలో నిప్పు లేస్తున్నాను" అని రైతు తెలివితక్కువ తనాన్ని బయటపెట్టుకొన్నాడు. వీడుకూడా, రాజుగార్కి పనికివచ్చే మూఢుడులాగున్నాడనుకొని, మంత్రిగారువీడి చిరునామాకూడా సేకరించి, మరొకచోటికి మకాం మార్చారు.

తాతయ్యా! నీళ్ళలో నిప్పు లేస్తే, నిప్పు లారిపోవూ!" అని రాజు అడ్డుపుల్ల వేశాడు.

"ఆరిపోవురా మరి! అందుకేగా మంత్రిగారు వాడి చిరునామా కూడా రాసికుంది మరి." అని తాతయ్య పొడుం పట్టుపట్టి, ఇట్లా చెప్పటం ప్రారంభించాడు.

మంత్రిగారు వచ్చిన పని సగానికిపైగా పూర్తయింది. యింకా ఒకడ్ని సేకరించాలి. మంత్రిగారు, తిరగ్గా తిరగ్గా, ఒకచోట మురికిదూదిని కాలుస్తున్న రైతు కనిపించాడు. "దూది కాలుస్తున్నావెందుకయ్యా?" అని మారువేషంతో వున్న మన మంత్రిగారు ప్రశ్నించారు. "దూదిలోని మురికి పోవటానికి కాల్చి శుద్ధిచేస్తున్నాను" అని రైతు తన తెలివి తక్కువ తనాన్ని ప్రదర్శించాడు. తనకు కావలసిన మూడో మూఢుడు దొరికినందుకు, తన వచ్చిన పని పూర్తయినందుకు, మంత్రిగారు సంతోషించి, వాడి చిరునామా సేకరించి, తిర్గు ప్రయాణం పుచ్చుకొన్నారు.

రాజ్యానికి తిరిగివచ్చిన మంత్రిగార్ని రాజుగారు వెళ్ళినపని ఏమయిందని ప్రశ్నించారు. తను చూచిన రైతుల్ని, వాళ్ళు చేసినపనుల్ని వివరించి, వాళ్ళను పిలిపించాడు మంత్రిగారు.

రాజుగారు మొదటి రైతుని, "సి పొలంలో వేయించి వేసిన వేరుశనగ గింజలు మొలకెత్తినయ్యా?" అని ప్రశ్నించారు.

"లేదు మహారాజా! వేయించిన గింజలు నాటితే వేయించిన కాయలే పండుతాయని, ఆపని చేశాను. గింజలు మొలకెత్తలేదు సరిగదా, ఐదుబస్తాల వేరుశనగకాయలు కూడా నాశనమయినయి" అని రైతు సమాధానం చెప్పాడు.

రాజు రెండోరైతుకి "ఏమయ్యా! నీళ్ళలో నిప్పువేశావుగదా; నీళ్ళు కాగినాయా?" అని ప్రశ్నించారు.

"నీళ్ళు కాగకపోగా, గంగాళం నీళ్ళు, కుండెడు నిప్పులు వృధాఅయినయి మహారాజా" అని రెండోరైతు సమాధానం చెప్పాడు.

"నీ దూడి శుద్ధిఅయిందా" అని రాజుగారు మూడోరైతుని ప్రశ్నించాడు.

"దూది శుద్ధి కాలేదు కాని బుద్ధి వచ్చింది" అని మూడోరైతు సమాధానం చెప్పాడు.

రాజుగారు, సభాసదులు వాళ్ళ తెలివితక్కువ పనులు విని కాలక్షేపం చేశారు. రాజుగారు ఆముగ్గురి మూఢుల్ని తగిన పారితోషికం యిచ్చి పంపించారు.

"అదేంటి తాతయ్యా! తెలివితక్కువ పనులు చేసినందుకు, దండించటానికి బదులు, పైగా పారితోషికం యివ్వటం ఏమిటి" అని రాము ప్రశ్నించాడు.

"అంతే రాముడి! రాజుగార్కి అటువంటి వాళ్ళను కలిసికోవటం, వాళ్ళు చేసిన తెలివితక్కువ పనుల్ని విని ఆనందించటం ఒక సరదా. అందుకనే ఆ రాజుగార్ని 'తెలివితక్కువ మారాజు' అనుకుంటూ వుంటారు ప్రజలు." అని తాతయ్య మరొక పట్టుపొడుం పీల్చి నడుం వాల్చాడు. ★

(64 ఎ పేజీ తరువాయి)

కొత్త ఢిల్లీలో జరిగింది బోర్డుయా, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ శాఖలూ నడుపుతూ ఉన్న కార్యక్రమాలను సమన్వయపరచే ఒకే విధమయిన పథకాన్ని రూపొందించడానికి ఒక సంఘాన్ని నియమించాలనే సూచన ఆ సమావేశంలో బలపరుచబడింది.

సమన్వయం, సమగ్రత అనే పదాలు మనకీనాడు బాగా వినబడుతున్నాయి. బాలసంక్షేమం విషయంలోకూడా ఒక సమగ్ర పథకాన్ని రూపొందించటం అవసరం. స్వచ్ఛంద సంస్థలు ఏవో వాటికితోచిన కార్యక్రమాలను నడుపుతున్నాయి. మంచిదే. ఇక్కడ ఒక బాల్వాడీ. అక్కడ ఒక శిశు ఆరోగ్య కేంద్రం, ఇక్కడ ఒక లైబ్రరీ, అక్కడ ఒక ఆటస్థలం, ఏర్పాటు చేస్తూ ఉంటే అలాంటి కార్యకలాపాలలో సమగ్రత లోపిస్తుంది. సమన్వయం సంస్థలమధ్యనా, లేక కార్యక్రమాలలోనా, లేక బాలల సంపూర్ణ వ్యక్తిత్వంలోనా సాధించవలసింది? అంటే కార్యక్రమాలలోనే సమన్వయమూ సమగ్రతా ఉండాలి. పుష్టికరమైన ఆహారం, ఆరోగ్యం, విద్య, వినోదం, విజ్ఞానం— వీటన్నిటికీ సంబంధించిన సమగ్రత సాధించాలి. అలాంటి పథకాన్ని సమగ్ర బాలల సంక్షేమపథకం అని చెప్పవచ్చును.

ఇటువంటి సమగ్ర బాలసంక్షేమపథకం రూపొందించాలి అంటే జాతీయస్థాయిలోనే అది రూపురేఖలు దిద్దుకోవలసి ఉంటుంది. దేశంలో కొంతకాలంగా కొన్ని విధాలయిన బాలసంక్షేమ కార్యక్రమాలు అమలు జరుగుతూ ఉన్నాయి. వీటన్నిటినీ జాతీయ పథకంలో ఇమిడ్చే యేర్పాటు చేయాలి. ఇదివరలో అమలులోలేని కార్యక్రమాలను అవసరమయినవాటిని చేర్చుకోవాలి.

ప్రాథమికంగా అవసరమయిన కార్యక్రమాలను ప్రభుత్వమూ, ప్రత్యేక కార్యక్రమాలను, స్వచ్ఛంద సంస్థలూ నడిపితే బాగా ఉంటుంది. దీనివల్ల ఒకరు చేసిన పనే ఇంకొకరు చేయకుండా డబ్బూ శక్తీ వృధాకాకుండా ఉంటుంది.

కేంద్ర సాంఘిక సంక్షేమ మండలి ఏర్పాటు చేసిన బాల సంక్షేమ సంఘం కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ క్రింద బాల సంక్షేమ జాతీయ విభాగం ఒక దానిని నెలకొల్పాలని సిఫారసు చేసింది. ఒక సమన్వయ సంఘం కూడా ఏర్పడింది. దేశం మొత్తంమీద బాల సంక్షేమ కార్యక్రమాలను అభివృద్ధి చేయడానికి తగిన సలహానూ, సహాయాన్నీ ఈసంఘం అందించవలసుంది.


సమగ్ర పథకాన్ని అమలుజరపే ఉద్దేశంతో ప్రాయోజకంగా డెమాన్‌స్ట్రేషన్ ప్రాజెక్ట్స్ నెలకొల్పబడ్డాయి. ఒక బ్లాక్ ప్రాంతంలో పదహారు సంవత్సరాలలోపు వయస్సుగల పిల్లలందరికీ కావలసిన కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. ఈ పథకం క్రింద ఇందులోని అంశాలు కుటుంబ నియంత్రణ, ఆరోగ్యం, పుష్టిగల ఆహారం, బడిలో భోజనం పెట్టే యేర్పాటు గృహవసతి, పరిసరాల పరిశుభ్రత, శిశు ప్రాథమిక ఉన్నత విద్య, వృత్తి శిక్షణ, శారీరక మానసిక లోపాలున్న బాలల సంక్షేమం, వ్యాయామం, ఆటలూ, మానసోల్లాసం కలిగించే కార్యక్రమాలు.

ఇటువంటి ప్రాజెక్టులు మూడవ ప్రణాళిక ముగిసేసరికి రాష్ట్రానికి ఒకటి చొప్పున ఏర్పాటు కాగలవని విశ్వసించబడుతోంది. ఒక పైలట్ ప్రాజెక్టు మన రాష్ట్రంలో మెదక్ జిల్లాలోకి పట్టంచెరువులో ఏర్పాటు అయింది. ఈ ప్రాజెక్టు విజయాన్ని పురస్కరించుకొని నాల్గవ ప్రణాళికలో ఇంకా ఎక్కువగా అమలు జరుగుతాయి.

బాలల సమగ్ర వికాసానికి ఉద్దేశింపబడిన ఈ పథకం భావి భారత ప్రగతికి ఆశాజ్యోతిగా ఉంది. ★




బాలల దినోత్సవాన్ని ప్రారంభించడానికి విచ్చేసిన గవర్నరుకు స్వాగత మిస్తున్నదృశ్యం.




నవంబరు 14 వ తేదీన అధ్యక్షోపన్యాసం కావిస్తోన్న గవర్నరు.



బాలల దినోత్సవంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి.




బాలల దినోత్సవంలో ప్రసంగిస్తున్న ప్రధానకార్యదర్శి.




బాలల దినోత్సవంలో రబ్బరు బెలూన్లను ఎగరవేస్తోన్న గవర్నరు.




నవంబరు 14 వ తేదీన ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఆటలందు నిమగ్నులైన బాలలు.




బాలల దినోత్సవానికి హాజరయిన పిల్లలు.



కీస్ హైస్కూలు విద్యార్థినికి ఉత్తమ పద్యరచయిత్రి బంగారుపతకం బహుమతిని యిస్తున్న శ్రీమతి పట్టం ఎ. థానుపిళ్ళై.



రాష్ట్ర సమాచారకేంద్రంలో నవంబరు 1 వ తేదీన నిర్వహించిన పిల్లల చిత్రలేఖన పోటీ.




ఎన్. సి. సి. దినోత్సవంనాడు వందనస్వీకారం అందుకుంటున్న గవర్నరు.




నవంబరు 15 వ తేదీన జరిగిన ఎన్. సి. సి. దినోత్సవంలో ఉత్తమ కేడెట్‌కు శ్రీమతి పట్టం ఎ. థానుపిళ్ళై బహుమతి అందజేస్తున్న దృశ్యం.



ఎన్. సి. సి. దినోత్సవంనాడు డ్రిల్లుచేస్తున్న పిల్లలు.




ప్రభుత్వ ముద్రణాలయం కొత్తభవనానికి నవంబరు 14 వ తేదీన ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసినదృశ్యం.



షామీర్ పేటలో నవంబరు 14 వ తేదీన హోంమంత్రి పిల్లలపార్కుకు ప్రారంభోత్సవం చేస్తోన్న దృశ్యం.



గోల్కొండకోటలో సంయుక్త అరబ్ రిపబ్లిక్‌నుండి వచ్చిన రేడా సాంస్కృతిక బృందంలో కొంతమంది సభ్యులు.



స్వర్గీయ నెహ్రూ స్మృత్యర్థం విడుదలచేసిన ఒక రూపాయిబిళ్ళ ముందు, వెనుకలు,

మిత్రలాభం

కల్యాణసింగ్

"అయ్యా. అయ్యా. నమస్కార మండి శాస్త్రులుగారు. ఆడబోయినతీర్థం ఎదురైనట్టు మీరే దయచేశారు. అం. మీదగ్గరికి రావా లనుకుంటున్నాను." అన్నాడు రామయ్య. "ఏమిటి విశేషం రామయ్యా" అంటూ వచ్చి వెంకటశాస్త్రిగారు అలికి ముగ్గులు పెట్టిన అరుగుమీద పరిచిన రంగు రంగుల తుంగచాపమీద పద్మాసనం వేసుకొని కూర్చున్నారు ఠీవిగా. శాస్త్రిగా రంటే అందరికీ గౌరవం. ఆయన మాట్లాడడం మొదలు పెడితే ధారాళంగా శ్లోకాలూ, పద్యాలూ చదువుతూ, ఒక విషయంలో నుంచి ఇంకొక విషయంలోకి దిగుతూ, విసుగు లేకుండా, వినేవాళ్ళకు విసుగు కలగకుండా గంటలకొద్దీ మాట్లాడతారు. పాండిత్యంతో పాటు లోకజ్ఞానం కూడా పుష్కలంగా ఉన్నవ్యక్తి. ఆయనలో రాజసం కూడా తగిన పాలులో ఉంది. ఆయన దేశవాళీ చెప్పులూ, పొన్నుకర్రా, శాలువా ఆయన రూపానికి ఒక వింతసోయగం కలిగిస్తూ ఉంటాయి.

"ఏముంది శాస్త్రులుగారూ. మీ దయవల్ల మనకి పాడిపంటలకు లోటు లేదు కదా. అబ్బాయి పెద్దవా డవుతున్నాడు. అవుతున్నా డేమిటి అయిపోయా డనుకోండి. వాడికి బొత్తిగా వివేకం లేదండి. వాడికి శాస్త్ర జ్ఞానం కలిగించ మని మిమ్మల్ని అడుగుదా మనుకుంటున్నాను." — ఇదీ రామయ్యగారు ఆడబోయిన తీర్థం కథ.

శాస్త్రిగారు మొదలుపెట్టారు. "రామయ్య బాబూ. నీ మాటలు వింటోంటే ఒక కథ జ్ఞాపకం వస్తోందయ్యా. వెనకటికి పాటలీపుత్రంలో సుదర్శను డనే రాజుగారు ఉండేవారు. ఆయన ఆస్థానంలో ఒకనాడు ఒక పండితుడు ప్రసంగవశాత్తూ,

పరువంబు కలిమి దొరతన
మరయమి యనునట్టివీనియం దొకటొకటే
పొరయించు ననర్థము నా
లరిగినచో నాల్గు చెప్పవలయునె చెపుమా.

అని చదివాడు. దానితో రాజుకి తన కొడుకుల సంగతి మనస్సులో మెదిలింది. యౌవనం, ఐశ్వర్యం, దొరతనం, అవివేకం — ఈ నాలుగూ వాళ్ళకి ఉన్నాయి. తన కుమారులచేత నీతిశాస్త్రం చదివించి వాళ్ళని మంచి మార్గంలో పెట్టేవా రెవరైనా ఉన్నారా అని రాజు సభలో అడిగాడు. విష్ణుశర్మ అనే ఆయన ఒప్పుకొని వాళ్ళకి మంచి బుద్ధులు చెప్పాడు. అందులో అయిదు భాగాలు ఉన్నాయి — మిత్రభేదమూ, మిత్రలాభమూ, సంధివిగ్రహమూ, లబ్ధనాశమూ, అసంప్రేక్ష్య కారిత్వమూ అని.

రామయ్య అందుకున్నాడు. "బాగుందండి శాస్త్రులుగారు. ఆ మిత్రలాభమే మావాడికి పాఠం ఉందండి. ఒరే ప్రకాశం నీ తెలుగు పుస్తకం తీసుకురారా. శాస్త్రులుగారు వచ్చారు." ప్రకాశం ప్రత్యక్షమయాడు.

"ఏదీ ప్రకాశం. మొదటి పద్యం చదువు వింటాం." అన్నారు శాస్త్రిగారు.

"అయ్యా మీరే చదువుదురూ, ఇంపుగా వింటాను" అని అడ్డువచ్చాడు రామయ్య.

పొడుంకాయ తీసి ఒక్కపిసరు అరచేతిలో వేసుకొని ఒక్కపట్టు బిగించారు శాస్త్రిగారు. అం.

సాధనంబులు నర్థసంచయము లేక
బుద్ధిమంతులు తమలోన పొందు చేసి
వలయు కార్యంబు లొనరింతు రలతు రెందు
కాక కచ్ఛ మృగ మూషికముల రీతి.

డబ్బూ దస్కమూ లేకపోయినా బుద్ధిమంతులు అన్యోన్యం స్నేహంగా ఉండి తమ పనులు నెరవేర్చుకుంటారట. కాకి తాబేలు లేడి ఎలుక లాగ.

స్నేహం లేకపోతే ప్రపంచమే జరగదు. స్నేహం అంటే సహకారం. ఒకరి కొకరు సహాయంగా ఉండడం. పంగ్వంధన్యాయం అని ఉంది. కుంటివాడూ, గుడ్డివాడూ ఉన్నారనుకో. కుంటివాడు నడవలేడు. గుడ్డివాడు చూడలేడు. గుడ్డివాడి భుజంమీద కుంటివాడు ఎక్కితే...అదే స్నేహం, అదే సహకారం.

భార్యాభర్తలది కూడా స్నేహమేనయ్యా.

సఖా సప్తపదా భవ
సఖా యౌ సప్తపదా బభూవ

అని సప్తపదిలో సఖ్యం కలుపుకుంటాడు పురుషుడు స్త్రీతో.

ఆఢ్యో వాపి దరిద్రో వా
దుఃఖిత స్సుఖితోపి వా
నిర్దోషో వా సదోషో వా
వయస్యః పరమాగతిః

కలవాడైనా, లేనివాడైనా, దుఃఖిస్తున్నా, సుఖిస్తున్నా, దోషి అయినా, నిర్దోషిఅయినా మిత్రుడు ముఖ్యమైన దిక్కు—అన్నాడు వాల్మీకిమహర్షి.

కాకీ, తాబేలూ, లేడీ, ఎలకా మాట అలా ఉంచు. మనలాటి సామాన్య మాన వులమాట కూడా అలా ఉంచు. శ్రీ రామ చంద్రమూర్తి అంతటివాడు సుగ్రీవుడితో స్నేహం చేయవలసివచ్చింది కదయ్యా.

తతోగ్నిం దీప్యమానం తౌ
చక్రతు శ్చ ప్రదక్షిణం
సుగ్రీవో రాఘవ శ్చైవ
వయస్యత్వ ముపాగతౌ.

వాళ్ళిద్దరూ గనగన మండుతున్న అగ్నికి ప్రదక్షిణం చేశారు. సుగ్రీవుడూ, రాముడూ మిత్రభావం పొందారు. వాలిచేత అపహ రింపబడ్డ సుగ్రీవుడి భార్యను సుగ్రీవుడికి లభింపజేశాడు రాముడు. రావణుని చేత అపహరింపబడ్డ రామునిభార్య సీతను వెతికించి సహాయపడ్డాడుసుగ్రీవుడు.

ఇంతకీ చెప్పవచ్చే దేమిటంటే ఈ స్నేహబంధాలు అనాదినుంచీ వస్తున్నవే. అయితే పూర్వంలాగ స్నేహితులు ఇప్పుడు అగ్ని ప్రదక్షిణం చేయడం లేదనుకో. ఈ కాలానికి తగినట్టు ఏవో ఒడంబడికల లాంటివి చేసుకొని ఒకరి కొకరు సహాయ పడుతున్నారు.

ఇతర దేశాలు మనకి సహాయం చేస్తు న్నాయి. మనమూ మన శక్తి కొద్దీ ఇతర దేశాలకు సహాయం చేస్తున్నాం. ఐక్యరాజ్య సమితి — అదే మిత్రరాజ్య సమితి — దానికి సంబంధించిన సంస్థలు మనకు ఎంతో సహాయం చేస్తున్నాయి. మన పరిశ్రమ లకూ, ప్రాజెక్టులకూ ధనసహాయం లభి స్తోంది. ఆరోగ్యానికీ, బాల సంక్షేమానికీ సదుపాయాలు లభిస్తున్నాయి. మనకు ఆహారపుకొరత ఏర్పడినప్పుడు అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా దేశాలు గోధుమలూ, పిండీ పంపించాయి. గౌహాటీలోని నూనె కర్మాగారం నెలకొల్పడానికి రుమేనియా అప్పు నిచ్చింది. కేరళలో చేపల పరిశ్రమ అభివృద్ధికి నార్వే సహకారం ఇచ్చింది. ఎన్నో పరిశ్రమలు నెలకొల్పడానికి రష్యా తోడ్పడుతోంది. నైవేలీలోని లిగ్నైట్ ప్రాజెక్టుకూ, భిలాయ్‌లోని ఉక్కు ప్రాజె క్టుకూ సహాయం అందించింది. మన రాజ ధాని హైదరాబాద్‌లో స్థాపిస్తున్న ఔషధాల ఫ్యాక్టరీకి కూడా రష్యాసహాయం లభిస్తోంది. మన రాజధాని నగరంలోనే నిర్మిస్తున్న భారీ విద్యుత్పరికరాల ఫ్యాక్టరీకి చెకొస్లొవాకియా సహాయం చేస్తోంది. దుర్గాపూర్‌లో ఉక్కు కర్మాగారం స్థాపించటానికి ఇంగ్లండు సహాయపడింది. ట్రాంబేలో అణువిచ్ఛేదక యంత్రాన్ని నెలకొల్పడానికి కెనడా సహా యం చేసింది. విదేశాలనుంచి లభిస్తున్న సహాయం స్థాలీపులాకంగా చెప్పాను. అంటే అన్నం కుండలోనుంచి ఒక్క మెతుకు పట్టి చూపినట్టు చెప్పాను. కొన్ని ఉదాహరణలు మాత్రమే ఇచ్చాను. ఇక మనమో బర్మాకూ, ఇండోనేషియాకూ డబ్బు అప్పు ఇచ్చాం. నేపాలుదేశానికి బియ్యం అప్పుఇచ్చాము. కొంత డబ్బు అప్పు గానూ, కొంత డబ్బు ఉచితంగానూకూడా ఇచ్చాం. ఆ దేశపు అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకోసం. సిక్కింకు కూడా ధన సహాయం చేశాం. ఇదంతామిత్రలాభమేకదా.

మనం అసలు కథకి వద్దాం. మహిళా పుర ప్రాంతపు అడవిలో ఒక బూరుగు చెట్టుమీద లఘుపతనకం అనే కాకి నివ సిస్తూ ఉండేది. అది ఒకనాడు పొద్దున్నే లేవగానే ఒక కిరాతుడు కంటబడ్డాడు వాడు ఒక వల పన్ని నూకలు చల్లి దూరంగా నిలబడ్డాడు. అంతలో చిత్రగ్రీవుడనే పావు రాల రాజు పరివారంతో వచ్చి వాని వలలో చిక్కుకున్నాడు. ఆపదలో ధైర్యంవహించి ఒక ఉపాయం పన్నాడు కపోతరాజు. ఆ పక్షులన్నీ ఒక్కుమ్మడిగా వల ఎత్తుకొని ఆకాశంలోకి ఎగిరిపోయాయి.

చూచారా సంఘీభావానికి ఎంత బలం ఉందో. మన గ్రామంలో ఏదైనా అసౌకర్యం ఉందనుకోండి. ఏదైనా కష్టం ఉందనుకోండి. మన కర్మం అని చేతులు ముడుచుకొని కూర్చుంటే ఏం లాభం? ఉపాయం ఆలోచించాలి. నలుగురూ కలిసి పని చెయ్యాలి. కష్టం తొలగించుకోవాలి.

అమధ్య నందికొట్కూరుతాలూకా వానాల గ్రామంలో ఒక విశేషం జరిగిందయ్యా. గ్రామ జనాభా వెయ్యిమంది. అందులో వందమంది హరిజనులు. వారు పాపం సవర్ణుల బావిదగ్గర పడిగాపులు పడి వాళ్ళు నీళ్ళు చేది పోసేవరకూ కూర్చోవలసి వచ్చేది. ఇలా కొన్ని దశాబ్దాలు గడిచాయి. అప్పటి హరిజన సంక్షేమశాఖ 30, 40 అడుగుల లోతు బావి తవ్వించింది కాని నీళ్ళు పడలేదు. ఒకనాడు నారయమ్మ అనే హరిజన మహిళ అరుగుమీద కూర్చొని ఆలోచించింది. తన అరవై యేళ్ళజీవితంలో కనీసం రెండేళ్ళ కాలమైనా నీళ్ళకోసం పడిగాపులు పడిఉంటుం దని లెక్క వేసు కుంది. కొద్దిరోజులు ఉచితంగా కూలిచేస్తే ప్రాజెక్టువాళ్ళు బావితవ్వించరా అనుకుంది. స్త్రీలేకాదు, పురుషులుకూడా కలిశారు. 30, 40 అడుగులు తవ్వగానే గంగాభవాని పొంగింది. గ్రామస్థుల హృదయాలు ఆనం దంతో పొంగిపోయాయి.

ఇక రోడ్లు వెయ్యడంలోకూడా గ్రామాలలో చాలా ఉత్సాహం కనిపిస్తోంది. శ్రమదానంతో ఎన్నో గ్రామాలలో ప్రజలు రోడ్లు నిర్మించుకుంటున్నారు. ప్రభుత్వ సహాయం అపేక్షించకుండానే కేవలం శ్రమదానంవల్ల ఎన్నోచోట్ల రోడ్లు నిర్మింపబడ్డాయి. ఇది సంఘీభావ మహిమ.

ఇక మన పాత్రలు ఎంతకాలం ఆకాశంలో ఎగురుతూ ఉండగలవు కనక, చిత్రగ్రీవునికి హిరణ్యకుడనే ఎలకరాజు స్నేహితుడు. ఆ పక్షులు వలను ఎత్తుకొనిపోయి హిరణ్యకుని కలుగు దగ్గర వాలాయి. కాకిరాజు లఘుపతనకుడుకూడా చిత్రం చూస్తూ పావురాల వెంట ఆకాశంలో ఎగిరి వెళ్ళాడు. హిరణ్యకుడు వల కొరికి చిత్రగ్రీవుణ్ణీ, అతని పరివారాన్నీ విడిపించాడు.

లఘుపతనకుడు ఆశ్చర్యపోయాడు వారి స్నేహభావానికి. హిరణ్యకుణ్ణి వేడుకున్నాడు తనను స్నేహితునిగా గ్రహించి అనుగ్రహించమని. అదిరే ఎలకకీ, కాకికీ పొత్తు ఎలా కుదురుతుంది అన్నాడు మూషికరాజు. తనను మిత్రునిగా స్వీకరించకపోతే నిరసనవ్రతం చేస్తానన్నాడు లఘుపతనకుడు. హిరణ్యకునికి ఒప్పుకోక తప్పలేదు. ఇద్దరూ సన్నిహితులై మిత్రత్వంతో కాలం గడిపారు.

పరస్పరవిరోధంగల ఎలకా, కాకీ ఇలాగ గాఢంగా ప్రేమించుకొని స్నేహితులయ్యారే, ఒకే మానవజాతికి చెందినవాళ్ళం మనలో మనం తగువులాడుకొంటున్నాం. లఘుపతనక హిరణ్యకులనుంచి మనం నీతి నేర్చుకోవాలి. ఎవడు సమస్త భూతాల్నీ ఆత్మలోనూ, సర్వభూతాలలోనూ ఆత్మనూ చూస్తాడో అతనికి ఎట్టి ఏహ్యభావమూ ఉండదు అని ఉపనిషత్తులు చెబుతున్నాయి మనలోని కొందరిని మనం అస్పృశ్యులనుగా పరిగణించేవాళ్ళం. ఒకడు పవిత్రుడూ ఇంకొకడు అపవిత్రుడూనా? సరే అలా ఒకడు పవిత్రుడే అనుకుందాం.

కాలుష్య దూరీకరణం ఫలం హి
పవిత్రతాయా నతు మా స్పృశేతి.

మీరు పవిత్రులూ, ఇతరులు అపవిత్రులూ అని అనుకుంటే, మీ పవిత్రతకు ఫలం ఇతరుల కలుషాన్ని పోగొట్టడమే కాని 'నన్ను ముట్టుకోకు' అనడం కాదు.

సరే తరవాత కొంతకాలానికి లఘుపతనకుడు, తన స్నేహితుడు కూర్మరాజు మందరుని దగ్గిరికి వెళ్ళిపోతానని చెప్పి సెలవిమ్మని హిరణ్యకుణ్ణి అడిగాడు. దుఃఖంలో ఉన్నాననీ లఘుపతకుని విడిచి ఉండలేననీ చెప్పి హిరణ్యకుడుకూడా బయలుదేరాడు. మందరుని కలుసుకున్నప్పుడు హిరణ్యకుడు తనకథ వినిపించాడు. తాను ఒకమఠంలో ఉండేవాడు. తన ధనం అంతా ఆ మఠంలోని సన్యాసి కాజేశాడు. దానితో హిరణ్యకుడు బలహీనుడయిపోయాడు.

భూరిదరిద్రుడున్ మిగుల
బుద్ధి విహీనుడు నైన మానవున్
జేరవు మంచికార్యములు
చెప్పగ నేటికి వాని దైవసం
సారముచెప్ప చూపగన
సార మగున్ తలపోసి చూడని
స్సారపు మందువేసవిని
సన్నపువాహినులింకు కైవడిన్.

దారిద్ర్యం మహాచెడ్డది. పర పరిపాలనలో మనం దరిద్రులం అయిపోయాం. దారిద్ర్యం, అవిద్య, అనారోగ్యం ఇవన్నీ అవినాభావసంబంధం కలిగి ఉంటాయి. మందరు డేమన్నాడో తెలుసా?

ఉద్యోగరహితు నలసుని
ఉద్యత్సాహనవిహీను నొల్లదు సిరి వం
పద్యోగు గొల్వ జేరదు
చోద్యముగావ్యద్భుత రుణిచూడనిభంగిన్.

మహా చక్కగా చెప్పాడు. కృషి చేయని వాణ్ణి సంపద చేరదన్నాడు ముసలివాణ్ణి పడుచుపిల్ల చూడనిరీతిగా.

మనం వేసుకొనే పథకాలూ, అమలు జరుపుకొనే ప్రణాళికలూ మందరుడు చెప్పిన ప్రయత్నమే కదా. వివిధ ఆర్థిక కార్యక్రమాలద్వారా ప్రణాళిక దేశానికి మిత్రలాభాన్ని చేకూరుస్తోంది. ఐకమత్యాన్ని స్థిరపరుస్తోంది. ఇంకొకమాట చెప్పాడు మందరుడు. 'దానముకంటె వేరొక నిధానములేదు' అని. దాని ప్రకారమే మనం ఇప్పుడు అనేక విధాలైన దానాలు చేస్తున్నాం. శ్రమదానం, సమయదానం, సంపత్తిదానం బుద్ధిదానం మొదలయిన వెన్నో.

హిరణ్యకుడూ, మందరుడూ మాట్లాడుకుంటూ ఉంటే ఒక లేడి పరుగెత్తుకుంటా వచ్చింది. ఎలకా తాబేలూ భయపడి పారిపోయాయి. కాకి చెట్టెక్కి చూచింది. అపాయం ఏమీ లేదని కనిపెట్టింది. మిత్రులందరూ మళ్ళీచేరారు. వాళ్ళందరూ లేడిని ఆదరించారు. ఆ లేడిపేరు చిత్రాంగుడు. ఇప్పుడు నలుగురు మిత్రులయ్యారు.

ఒకనాడు చిత్రాంగుడు అడవిలో వలలో చిక్కుకున్నాడు. లఘుపతనకుడు పోయి చూచాడు. మందర హిరణ్యకులతో ఆ వృత్తాంతం చెప్పాడు. వల కొరకడానికి హిరణ్యకుణ్ణి తీసుకువెళ్ళాడు. ఎలా పడ్డావు వలలో అని అడిగితే చిత్రాంగుడు తన పూర్వగాథ అంతా చెప్పడం మొదలు పెట్టాడు. ఆలస్యం అయిపోయింది. ఎంతకీ రాలేదని కలతపడి తాబేలురాజు పాకుకుంటూ వచ్చాడు. అంతలో వేటకాడు యముడులాగ

వస్తున్నాడు. హిరణ్యకుడు గబగబా వల కొరికిపోయి కన్నంలో దూరాడు చిత్రాంగుడు పరుగెత్తాడు. లఘుపతనకుడు ఎగిరిపోయాడు మందరుడుమాత్రం మందంగా నడుస్తూ ఉంటే వేటకాడు పట్టుకొని తాటికి కట్టి వింటిబద్దకు వేలాడవేసి తీసుకుపోతున్నాడు. పోయినలేడిపోతేపోయింది, ఇదైన దొరికింది కూటికు అనుకున్నాడు తక్కిన ముగ్గురు మిత్రులూ విచారించడం మొదలు పెట్టారు. హిరణ్యకుడు ఒక ఉపాయం చెప్పాడు. చిత్రాంగ లఘుపతనకులు వేటకణ్ణి దాటి ముందరికి సాగిపోయారు. ఒక మడుగు దగ్గర లోతులేని నీటిలో చిత్రాంగుడు కాళ్ళు చాచి చచ్చిపోయినట్లు పండుకున్నాడు లఘుపతనకుడు లేడిని పొడుచుకొని తింటున్నట్లు నటించాడు. వేటకాడు మందరుణ్ణి కిందికి దించి లేడికోసం పరిగెత్తాడు. ఇంతలో హిరణ్యకుడు వచ్చి తాటిని కొరికి మందరుణ్ణి విడిపించాడు. మందరుడు నీటిలో ప్రవేశించాడు హిరణ్యకుడు కలుగులో దూరాడు. లఘుపతనకుడు ఎగిరిపోయాడు - చిత్రాంగుడు పారిపోయాడు. వేటకాడు వెంగళప్ప అయి ఇంటికి వెళ్ళిపోయాడు.

ధన సాధనసంపత్తి లేని పక్షి మృగాదులు కూడా స్నేహంవల్ల ఎలా లాభం పొందాయో చూచారా. మనకు భూమి ఉంది, అడవులు ఉన్నాయి, నదులు ఉన్నాయి, సముద్రంలో సంపద ఉంది. భూగర్భంలో సంపదఉంది. నలభై కోట్లమంది మనుష్యులం ఉన్నాం. సంపదను వృద్ధి చేసుకోడానికి ప్రయత్నం కావాలి. ప్రజలలో మైత్రి కావలి మైత్రిఅంటే సహకారం. చిత్రగ్రీవుడూ, చిత్రాంగుడూ మిత్రలాభంవల్లప్రాణం కాపాడుకున్నారు. జాతీయ ఆదాయాన్ని పెపొందించడమూ, ఆహారోత్పత్తిని పెంచడమూ, పరిశ్రమలను అభివృద్ధి చేయడమూ, వ్యక్తికీ వ్యక్తికీ మధ్య ఉన్న ఆదాయపు వ్యత్యాసాన్నీ, సంపత్తి వ్యత్యాసాన్నీ తగ్గించడమూ మనం చేయవలసిన పనులు. ఇవన్నీ మనం మిత్రలాభం ద్వారానే సాధించాలీ, సాధిస్తాం కూడా.

"పూర్వం రాజకుమారులకు విష్ణుశర్మ ఎలాగో ఇప్పుడు మీరు మన గ్రామానికి అలాగ శాస్త్రిలుగారూ. పాతకాలపు పంచతంత్రానికీ ప్రస్తుత కాలపు పరిస్థితులకు తగినట్టు వ్యాఖ్యానం చెబుతున్నారు," అన్నాడు రామయ్య. గుది పట్టిన కాళ్ళు విదుల్చుకుని 'నారాయణా' అంటూ లేచారు వెంకటశాస్త్రిగారు.

"గురువుగారూ, మెళ్ళో రుద్రాక్షలూ, నుదుట విభూతీ పెట్టుకున్నారు, నారాయణా అంటున్నారే." అన్నాడు ప్రకాశం.

"ఆరి పిడుగా. చూచావటయ్యా రామయ్యా. మీ వాడికి తెలిసి లేదన్నావు. ఒరే అబ్బాయి పనికి వస్తావురా, నాయనా. కాక కూర్మ మృగ మూషికాలకే మైత్రి ఉంటే శివకేశవులకు మైత్రి అక్కరలేదట్రా మరి. వెళ్ళివస్తాను మరి మహాదేవ, నారాయణ, నారాయణ. మహాదేవ" అంటూ నిష్క్రమించారు వెంకటశాస్త్రిగారు.

ప్రభుత్వ నిర్ణయాలు

- ✲ ఏలూరు, మచిలీపట్నం, రాజమండ్రిలలోని సహకార బ్యాంకులకు యిచ్చే రూ. 2.92,00,000/- ల ప్రత్యేక రుణాల పరిమితులకు హామీ ఇవ్వటానికి ప్రభుత్వం నిశ్చయించింది.
- ✲ తెలంగాణా ప్రాంతంలోని సహకార బ్యాంకులన్నిటికీ రూ. 5 కోట్ల రుణాలకు ప్రభుత్వం హామీ ఇచ్చింది. వ్యవసాయ ప్రయోజనాల నిమిత్తం రూ. 2 25,00,000/- ల మధ్యకాలిక రుణాలు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియానుంచి లభ్యమౌతాయి.
- ✲ రాష్ట్రంలోని ప్రైవేటు పాలిటెక్నిక్కులన్నిటికీ అవి స్థాపించబడిన 5 సంవత్సరాలతర్వాత భారత ప్రభుత్వం ఇచ్చే 50 శాతం గ్రాంటు కాలపరిమితి ముగిసినప్పుడు మొత్తంఖర్చులో 65 శాతం ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకరించింది.
- ✲ ప్రభుత్వ కార్యాలయాలు, క్వాసీ ప్రభుత్వ సంస్థలన్నిటిలో చర్య తీసుకోకుండా వారంరోజులుగా ఆలస్యమయిన కాగితాలపై అధికారులు ఎర్రసిరాతో సంతకంచేసే విధానాన్ని ప్రవేశపెట్టాలని ఒక సూచన చేయబడింది. భారతప్రభుత్వ ఆర్గనైజేషన్, మెథడ్స్‌విభాగం, కొన్ని రాష్ట్రప్రభుత్వాలు యీ పద్ధతిని అమలులో పెట్టాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యీ సూచనను ఆమోదించి, 1964 డిశంబరు నుంచి ఒకసంవత్సరంపాటు ప్రయోగాత్మకంగా సెక్రెటేరియెటు యీ పద్ధతిని అమలుచేయాలని ఆతర్వాత సెక్రెటరీ స్థాయికి దీనిని వర్తింపజేయాలని ఆదేశించింది.

జాతీయ రక్షణ కృషికి మీ పొదుపు ధనం అవసరం

మీరు ఎంత పొదుపు చేయగలిగితే అంత చేయండి. ఆ విధంగా పొదుపుచేసిన మొత్తాలను

దిగువ సెక్యూరిటీలలో దేనికైనా పెట్టుబడి పెట్టండి.

12 సంవత్సరాల జాతీయ రక్షణ సర్టిఫికెట్లు :

సంవత్సరానికి 6¼ శాతం సాధారణ వడ్డీ లేక 4¾ శాతం చక్రవడ్డీ. రూ. 5 మొదలు 25 000 ల వరకు వివిధ డినామినేషన్లలో లభ్యమవుతాయి. విడిగా ఒకవ్యక్తి అయితే రూ. 35.000 ల వరకూ. ఇద్దరు వ్యక్తులు కలిసి అయితే రూ. 70,000 ల వరకు పెట్టుబడి పెట్టవచ్చు (పోస్టల్ సేవింగ్స్ సర్టిఫికెట్లకు లోగడ ఏమైనా పెట్టుబడి పెట్టివుంటే దానితో కలుపుకొని).

10 సంవత్సరాల రక్షణ డిపాజిటు సర్టిఫికెటు :

ఏటా 4½ శాతం వడ్డీ చెల్లించబడుతుంది. రూ. 50 ల గుణిజములలో లభ్యమవుతాయి. విడిగా ఒకవ్యక్తి అయితే రూ. 35,000 ల వరకూ, ఇద్దరు వక్తులు కలిసి అయితే రూ. 70 000 ల వరకూ ఎక్కువలో ఎక్కువ పెట్టుబడి పెట్టవచ్చు. (3½ శాతం. 4 శాతం ట్రెజరీ సేవింగ్స డిపాజిటు సర్టిఫికెట్లకు లోగడ ఏమైనా పెట్టుబడి పెట్టివుంటే దానితో కలుపుకొని).

కుమ్యులేటివ్ టైమ్ డిపాజిటు పథకం :

5. 10 లేక 15 సంవత్సరాలవరకు ప్రతినెలా రూ 5, 10, 20, 50, 100, 200 లేక 300 చొప్పున డిపాజిటు చేసినట్లయితే తరువాత చక్రవడ్డీతో సహా పెట్టుబడి అధిక మొత్తంగా తిరిగి చెల్లించబడుతుంది.

పోస్టాఫీసులో సేవింగ్సు బ్యాంకు అక్కౌంట్లు :

రూ25 లు మొదలు రూ. 20 000 ల వరకు నిలువవుంచే మొత్తాలకు 3 శాతం చొప్పునా. రూ 20,000 లకు మించి నిలవవుంచే మొత్తాలకు 2½ శాతం చొప్పునా వడ్డీ చెల్లించబడుతుంది. ఒక వ్యక్తి రూ 15,000 ల వరకూ నిలవచేయవచ్చు.

15 సంవత్సరాల అన్యూటీ సర్టిఫికెటు

జారీచేసే ధర :. 1,330 రూ. 3 325, రూ. 6 650, రూ. 13,300. రూ. 26 600. సంవత్సరానికి 4.25 శాతం చక్రవడ్డీ చొప్పున, 13 సంవత్సరాలలో నెలవారీ చెల్లింపుల రూపంలో డబ్బు తిరిగి ఇవ్వబడుతుంది. ఒకవ్యక్తి రూ 26 600 ల వరకు పెట్టుబడి పెట్టవచ్చు.

చిన్న మొత్తాల పొదుపు పత్రాలకు పెట్టిన పెట్టుబడులపై లభించే వడ్డీకి

ఆదాయపు పన్ను, సూపర్ టాక్సులు వుండవు.

"మీరు చేసే పొదుపుమీదనే మీ భద్రత, మీ పిల్లల శ్రేయస్సు ఆధారపడి వుంది."

ఇతర వివరాలకొరకు, హైద్రాబాదు 10–2–2, ఏ, సి. గార్డ్స రోడ్డులోని ఆంధ్రప్రదేశ్ నేషనల్ సేవింగ్స ప్రాంతీయ డైరెక్టరు (భారత ప్రభుత్వం)ను కాని లేక మీ కలెక్టరేటులోని జిల్లా ఆర్గనైజరును కానీ లేదా మీ సమీపంలోని తపాలా కార్యాలయాన్ని కానీ దయచేసి సంప్రదించండి.

మణిముత్యాలు

శ్లో॥ వహన్తీ సిందూరం ప్రబలకబరీభారతిమిర
త్విషాం బృన్దైః బందీకృతమివ నవీనార్కకిరణం
విధత్తాం సిద్ధిం నః తవ జనని! సౌందర్యలహరీ
పరీవాహస్రోతస్సరణిరివ సీమన్తసరణిః॥

—ఓ తల్లీ! పార్వతీ! నీ పాపట రేఖలోని సిందూరము ఎట్లున్నదనగా, నల్లని నీ కేశ భారమనెడు చీకట్ల సమూహము, అప్పుడే ఉదయించుచున్న ఎఱ్ఱనైన సూర్యకిరణమును (అది చీకట్లను తఱిమివేయునను పగచేత) చెరబెట్టుచున్నదా అనునట్లు తోచుచున్నది. మరియు నీ శరీర సౌందర్య ప్రవాహము ఉప్పొంగి వెల్లివిరిసి అలుగుపారినదా అన్నట్లు పాపటరేఖ సుందరముగా నున్నది. మంగళకరమైన అట్టి నీ సిందూరాంచిత సీమంతము మా కందరికి శుభములను గూర్చుగాక.

—శంకరాచార్యులు

శ్లో॥ చీయతే బాలిశస్యాపి సత్ క్షేత్రపతితా కృషిః
న శాలేః స్తంబకరితా వప్తుః గుణమపేక్షతే॥

—మూర్ఖుడు, నీచుడు చేసిన కృషియైనను, అది మంచి క్షేత్రమునందు ప్రయోగించినచో సత్ఫలమును ఇచ్చును. అది సత్యమే. ఎందుకనగా, నాటబడిన వరి వెన్నుపెరిగి సారవంతమగుటకు, దానిని నాటినవాని యోగ్యతా యోగ్యతలను అపేక్షించదు.

—విశాఖదత్తుడు

చ॥ తరుణి ననన్యకాంత నతిదారుణపుష్పశిలీముఖవ్యథా
భరవివశాంగి నంగభవుబారికి లగ్గముఁ జేసి క్రూరుఁడై
యరిగె మహీసురాధముఁ డహంకృతితో నని రోషభీషణ
స్ఫురణ వహించెనో యన నభోమణి దాల్చెఁ గషాయదీధితుల్.

—అల్లసానిపెద్దన

మ॥ పరిరంభం బొనరించెఁ గుంభభవునిం బాతాళగంగాంబు ని
ర్ఝరకల్లోలఘటాపృషద్వ్యతికరప్రాలేయముల్ హాటకే
శ్వరజూటీకృతమాలకేసరరజస్సౌరభ్యసంపన్నముల్
కరివక్త్రాభరణాహిపీతపరిముక్తంబుల్ వనీవాయువుల్

—శ్రీనాథుఁడు

చ ॥ నుతజలపూరితంబు లగునూతులు నూఱిటికంటె సూనృత
వ్రత ! యొకబావి మేలు; మఱి బావులు నూఱిటికంటె నొక్కస
త్క్రతు వది మేలు; తత్క్రతుశతంబునకంటె సుతుండు మేలు; త
త్సుతశతకంబుకంటె నొకసూనృతవాక్యము మేలు భూవరా !

—నన్నయ


చ ॥ కొలఁది వితస్తమంచులను గ్రొంచుఁ బయోష్ణిఁ గలంచి చంద్రభా
గలహరులందుఁ దేలి శుచిఁ గాంచి యహస్కజోర్మిమైత్రి ని
స్తుల మగుసింధుతీరములఁ దూగుసురద్రుమముల్ పెకల్చుచున్
బొలిచె హిమాద్రివాయువులు భూపతికిం బ్రణయప్రదంబులై.


— ఆంధ్రవిష్ణు

సీ ॥ ప్రత్యూషజృంభితప్రాలేయదుర్లక్ష్య
మాణపద్మభవాండమండలంబు,
సంకులద్వాపరసమయమందిరభవ
ద్ద్యోతఖద్యోతభానూత్కరంబు
వితతనిశీధినీవేళాసహాస్ఫీత
శీతరుగ్బింబవిజృంభణంబు,
శీతాంశుదుర్దినవ్రాతసంచితకరీ
షాగ్నిధూమావృతాశాంతరంబు

తే ॥ గీ ॥ నగుచు నంతంత కెగసె నీహారధరణి
ధరసముద్ధూతనిబిడశీతలసమీర
ణాభిసంపాతజాతమాయాతిభీత
జంతుసంతాన మగుచు హేమంత మంత.

—భైరవకవి.





ప్రగతి పథంలో

అనంతపురం జిల్లా

ఉత్పత్తి కార్యక్రమం:

రాయదుర్గ పంచాయతీ సమితిలో సెప్టెంబరునెలలో 4,650 కిలోల మేలుజాతి విత్తనాలను, 72,102 కిలోల ఎరువులను పంపిణీ చేశారు.

గ్రామసహాయకుల శిక్షణ శిబిరం: గుత్తి పంచాయతీసమితితాలూకా ఊబిచెర్ల గ్రామంలో నవంబరు 6 నుండి మూడు రోజులపాటు గ్రామసహాయకుల శిక్షణ శిబిరం నిర్వహింపబడింది.

హైదరాబాదు జిల్లా

బాలల పార్కు:

షాహీరుపేటలో జవహర్లాల్ సరస్సు దగ్గర పిల్లలపార్కుకు నవంబరు 14 వ తేదీన హోంశాఖామంత్రి ప్రారంభోత్సవం చేశారు. పిల్లలు ఎక్కువగా పాఠశాలలకు వెళ్ళేందుకు ప్రోత్సహించే ఉద్దేశ్యంతో యీ సందర్భంలోనే సుమారు 2,500 పాఠశాలల యూనిఫారం బట్టలనుకూడా పంపిణీ చేయడం జరిగింది.

ఉత్తమ గ్రామస్థుల రేడియోగోష్ఠి:

తెలంగాణా ప్రాంతీయసంఘం అధ్యక్షుడు నవంబరు 19 వ తేదీన మేడ్చల్ పంచాయతీ సమితిలోని గొల్లపోచంపల్లి గ్రామస్థుల రేడియోగోష్ఠికి ఉత్తమ గ్రామస్థుల రేడియోగోష్ఠి బహుమతిగా రు. 500 విలువగల వ్యవసాయపరికరాలనుయిచ్చారు.

కరీంనగర్ జిల్లా

గ్రామస్థుల రేడియోగోష్ఠి:

కరీంనగర్ పంచాయతీసమితి తాలూకా నంగనూరు గ్రామంలో అక్టోబరు 23 వ తేదీన గ్రామస్థుల రేడియోగోష్ఠికి ప్రారంభోత్సవం జరిగింది.

9 వ తరగతి ప్రారంభం:

కరీంనగర్ పంచాయతీసమితి కొండపలకల గ్రామంలో అక్టోబరు 26 వ తేదీన 9 వ తరగతికి ప్రారంభోత్సవం జరిగింది.

పశుప్రదర్శన:

సుల్తానాబాదు పంచాయతీ సమితిలో నవంబరు 5 వ తేదీన జిల్లా స్థాయిలో పశుప్రదర్శన ఏర్పాటుచేయబడింది.

నల్గొండ జిల్లా

సహకార మార్కెటింగ్ సంఘం:

నల్గొండజిల్లా కలెక్టరు అక్టోబరు 30 వ తేదీన జిల్లా సహకార మార్కెటింగ్ సంఘానికి ప్రారంభోత్సవం చేశారు.



"గుర్తుంచుకో, నేను ముందు పోయినట్లయితే కొన్ని వందలు మాత్రమే తీసుకొంటా; లేకపోతే ఆఖరున మొత్తం నా వశం చేయాల్సి ఉంటుంది."

దేశ విదేశ వార్తలు

అమెరికాలో ఎన్నికలు

శ్రీ లిండన్ బేన్స్ జాన్సన్ అత్యధిక మెజార్టీతో ఎన్నిక అయ్యి అమెరికా 36 వ ప్రెసిడెంటు అయ్యారు. సెనేటర్ హ్యూబర్ట్ హంఫ్రీ క్రొత్త వైస్ ప్రెసిడెంటుగా ఉంటారు. శ్రీ జాన్సన్ ఎన్నిక అనేకవిధాల ప్రత్యేకత ఆపాదించుకుంది. 46 రాష్ట్రాలు, 538 ఎలక్టోరల్ ఓటర్లలో 446 ఓటర్లు యీయనను సమర్ధించారు. పోలైనఓట్లలో 61.30 శాతం వచ్చాయి.

రాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణన్ తన అభినందన సందేశంలో ఇలా అన్నారు: "భారతదేశంలో మేము మన ఉభయదేశాల మధ్య సన్నిహిత స్నేహపూర్వక సంబంధాలకొరకు ఎదురు చూస్తున్నాము. వివిధ దేశాలమధ్య అవగాహన, సహకారాల కొరకు కృషిచేస్తూ, మనమంతా అమూల్యంగా భావించే విశ్వశాంతి సౌభాగ్యాల ఆశయాలు పెంపొందించడాన్ని ఆకాంక్షిస్తున్నాము."

ప్రధానమంత్రి తన సందేశంలో "నేడు ప్రపంచానికి శాంతి పరస్పర అవగాహన అవసరం. వీటిపైననే మానవజాతి మనుగడ ఆధారపడిఉంది. యీ మహదాశయాల సాధనకై తమ నాయకత్వంలో అమెరికా దోహదం చేస్తుందనడంలో సందేహంలేదు" అన్నారు.

భారత - సిలోను ఒప్పందం

భారత, సిలోన్‌దేశాల ప్రధానమంత్రుల మధ్య జరిగిన సంభాషణల తర్వాత వెలువడిన సంయుక్త ప్రకటనను అనుసరించి 3 00,000 మందికి సిలోన్ పౌరసత్వం ఇవ్వడం, భారతదేశానికి 5,25 000 ల మందిని తరలించడం 15 సంవత్సరాల కాలంలో జరుగుతుంది. పౌరసత్వాన్ని ఇవ్వడం, భారతదేశానికి తరలించడం యీ రెండూ సమానసంఖ్యలో ఉంటాయి.

తుంబా ప్రాజెక్టు

అంతరిక్ష ప్రయోగాలను శాంతియుత ప్రయోజనాలకు ఉపయోగించడానికి సంబంధించిన ఐక్యరాజ్యసంఘం, కేరళలోని తుంబాప్రాజెక్టు అంతరిక్ష ప్రయోగాలకు ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యం వహించడానికి అంగీకరించింది.

రాకెట్ల ప్రయోగాలకు అంతర్జాతీయ సహకారానికి తుంబాస్టేషన్ ఉపయోగించాలని ఆ సంఘం సిఫారసు చేసింది. ప్రత్యేకంగా పరిమిత వనరులు గల దేశాలలోని శాస్త్రజ్ఞులకు, సాంకేతిక జ్ఞులకు తుంబాలో శిక్షణ ఇవ్వడానికి ఆర్థికసహాయం చేయాలని సూచించింది.

నాలుగవ ప్రణాళికలో గృహనిర్మాణం

పట్టణ, గ్రామీణ గృహనిర్మాణ ప్రణాళికా కార్యనిర్వహణ సంఘం నియమించిన గృహనిర్మాణ ఆర్థిక ఉపసంఘం, నాలుగవ ప్రణాళికలో గృహనిర్మాణాలకై రు. 2 890 కోట్ల ఖర్చుకు సిఫారసుచేసింది. ప్రైవేటు రంగంలో 1790 కోట్లు పెట్టుబడి కేటాయించాలని యీ ఉపసంఘం ప్రభుత్వానికి సమర్పించిన తమ నివేదికలో సిఫారసు చేసింది.

రైల్వేలకు పెట్టుబడి

రైల్వేల అభివృద్ధి కార్యక్రమాల అమలుకై ఉక్కు, యితర పరికరాల దిగుమతికై అంతర్జాతీయ అభివృద్ధిసంఘం భారతదేశానికి 62 మిలియనుల డాలర్లు రుణంగా ఇస్తుంది. యీ రుణాన్ని 50 సంవత్సరాలలో చెల్లించాల్సి ఉంటుంది. 1974 సెప్టెంబరు 15 వ తేదీనుంచి ప్రథమ చెల్లింపు ప్రారంభ మవుతుంది. ఆ తర్వాత 10 సంవత్సరాలవరకు వార్షికంగా రుణంలో ఒకశాతం. మరుసటి 30 సంవత్సరాలలో వార్షికంగా రుణంలో 3 శాతం చెల్లించాల్సి ఉంటుంది. యీ రుణంపై వడ్డీ ఉండదు. అంతర్జాతీయ అభివృద్ధిసంస్థ పరిపాలనా ఖర్చులనిమిత్తం. చెల్లించని బాకీ ఉన్న రుణమొత్తాలపై 0 75 శాతం సర్వీసుచార్జీని ఇవ్వాల్సి ఉంటుంది. అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ నిధినుంచి రైల్వేలకు 1963 మార్చిలో ఇచ్చిన 67.5 మిలియన్‌డాలర్లు రుణంతో కలుపుకుని మొత్తం 129.5 మిలియన్ డాలర్ల రుణం లభించింది.

మంత్రులకు ప్రవర్తనా నిబంధనావళి

- కేంద్ర, రాష్ట్రమంత్రులు, ప్రతి సంవత్సరం 31 మార్చివరకు తమ ఆదాయ వ్యయాల పట్టికలను వరుసగా ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులకు సమర్పించడమనే అంశం కేంద్రప్రభుత్వం ఆమోదించిన మంత్రుల

ప్రవర్తనా నిబంధనావళిలోని ప్రధానమైన అంశాలలో ఒకటి. మంత్రులు, వారికి తన కుటుంబసభ్యులకు పరిశ్రమలలో వాటాలు మొదలైనవాటి వివరాలనుకూడా తెల్పాలి. వారికి గల స్థిరాస్తి, నగలునాణాలు, కంపెనీలలోగల వాటాలు, డిబెంచర్లవిలువలనుకూడా తెల్పాలి. తమ కుటుంబసభ్యులు ప్రభుత్వంతో వ్యాపార లావాదేవీగల వ్యాపారాలలో పాల్గొనకుండానూ, ప్రారంభించకుండానూ చూడాలి.

మంత్రులు, తమ సన్నిహిత బంధువుల నుంచి మినహా ఇతరులనుంచి విలువగల బహుమతులను స్వీకరించడాన్ని, వారి అధికారాలపై వత్తిడి తెచ్చి ప్రభుత్వాన్ని యిరకాటంలో పెట్టే తత్వం గలిగిన రుణాలను మంత్రుల కుటుంబ సభ్యులు తీసుకోరాదని యీ నిబంధనావళి నిషేధిస్తుంది. మంత్రులు పర్యటించే సందర్భాలలో సాధ్యమైనంత వరకు ప్రభుత్వ వసతి గృహాలలో నివసిస్తూ తమ గౌరవార్థం యిచ్చే విందులు ఆడంబరం లేకుండా చూడాలి.

అవినీతి నిరోధక విచారణ సంఘం చేసిన సిఫారసుల ఆధారంగా కేంద్ర దేశీయ వ్యవహారాలమంత్రి అధ్యక్షతన ఏర్పడిన మంత్రివర్గ సంఘం యీ నిబంధనావళిని తయారుచేసింది.

అంతర్జాతీయ గ్రామం

భారతీయ, విదేశీయస్కాలరు కలిసిమెలిసి నివసించడానికి వీలుగా ఢిల్లీలో "అంతర్జాతీయ గ్రామాన్ని నెలకొల్పాలని ప్రతిపాదించారు. ప్రతిపాదిత నెహ్రూవిశ్వవిద్యాలయం స్థలం సమీపంలో 15 ఎకరాల విస్తీర్ణంలో ఈగ్రామాన్ని నెలకొల్పుతారు. ఇందులో 20 కుటీరాలు ఉంటాయి. మహాత్మాగాంధీ, శ్రీ జవాహర్‌లాల్ నెహ్రూ, శ్రీ కెనెడీలతో సహా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వ్యక్తుల పేర్లను పెడ్తారు. యీ గ్రామంలో 500లకు పైగా భారతీయ, విదేశీయ స్కాలర్లు నివసించవచ్చు విద్యార్థి సమాచార కేంద్రం దీనిని ప్రతిపాదించింది. వారి మనసుకు వచ్చిన ఆహారాన్ని వారు తీసుకోవచ్చు.

భారతజట్టు రాతోంగ్ పర్వతారోహణ

కెప్టెన్ అహ్లూవాలియా మరి ముగ్గురు, అక్టోబరు 29వ తేదీ సిక్కిం హిమాలయాలలోని రాతోంగ్ పర్వత శిఖరాన్ని (21,911 అడుగులు) అధిరోహించారు. కెప్టెన్ అహ్లూవాలియాతో పాటు ఎవరెస్టు హీరో నవాంగ్ గంబు, లాహుటూదోర్జీ, షెర్పా అంగ్కామీలు ఉన్నారు. వారు శిఖరంపై దాదాపు 35 నిముషాలు ఉన్నారు. భారత నేపాల్, సిక్కిందేశాల పతాకాలను, హిమాలయ పర్వతారోహణ పతాకాన్ని ఆశిఖరంపై ఎగురవేశారు.


సింగరేణి బొగ్గుగనులు

దేశంలో ప్రప్రథమంగా రు. 3 కోట్ల ఖర్చుతో లోటెంపరేచర్ కార్బొనైజేషన్ ప్లాంటును కొత్తగూడెంలో నెలకొల్పుతున్నారు. దీనికి రోజుకు 900 టన్నుల బొగ్గు ఉత్పత్తి శక్తి ఉంటుంది. సింగరేణి కాలరీస్ దీనిని నెలకొల్పుతుంది. నాలుగవ ప్రణాళికా కాలం మొదటి సంవత్సరంలో యిది ఉత్పత్తిని ప్రారంభిస్తుంది. ప్రధానమైన ప్లాంటులో మూడు విభాగాలు ఉంటాయి - ప్రీడ్రయ్యర్, కార్బొనైజర్, కాక్ కూలర్, ఒకదాని తర్వాత ఒకదానిని అమర్చుతారు.

కార్మిక విద్యా తరగతులు

కార్మిక శాఖ, రాష్ట్రంలో కార్మికుల విద్యా పథకాన్ని ప్రారంభించింది. ఫ్యాక్టరీలలో పనిచేసే నిరక్షరాస్యులైన పనివారలకు విద్య గరపడానికి ఈ పథకం ప్రధానంగా ఉద్దేశించబడింది. ఈ పథకం క్రింద కార్మికులకు చదవటం, వ్రాయటం, లెక్కలు చేయడం నేర్పడానికి ఫ్యాక్టరీ ఆవరణలలో తరగతులను నిర్వహిస్తారు. వీటిని పూర్తి సమయం పనిచేసే ఉపాధ్యాయులు నడుపుతారు. తరగతి వేళలను ఫ్యాక్టరీ నిర్వాహకులు, కార్మికులతో సంప్రదించి నిర్ణయిస్తారు. ఉపాధ్యాయులు రోజుకు 6 మొదలు 7 గంటలు పనిచేసి షిఫ్ట్ ప్రారంభం కావడానికి పూర్వం కాని ఆ తరవాత కానీ తరగతులు తీసుకుంటారు. ఫ్యాక్టరీ నిర్వాహకులు ఫర్నీచర్ తదితర సాధన సామగ్రిని సమకూరుస్తారు. పుస్తకాలు, నోటుబుక్కులు మొదలైన వాటిని ప్రభుత్వం ఇస్తుంది.

ఈ పథకాన్ని ప్రథమంగా తెలంగాణా ప్రాంతంలో రెండవ ప్రణాళికా కాలంలో 14 తరగతులను తెరవడం ద్వారా ప్రవేశపెట్టారు. తృతీయ ప్రణాళికా కాలంలో ఆంధ్ర ప్రాంతంలో 8 తరగతులను ప్రారంభించడానికి ప్రతిపాదించారు. వీటిలో 4 తరగతులను ఈ ప్రణాళిక మొదటి సంవత్సరంలో తెరవడం జరిగింది. వీటిపట్ల కార్మికులు ఎంతో ఆసక్తి చూపుతున్నారు. రోజూ ప్రతి తరగతికి సగటున 28 మంది కార్మికులు హాజరవుతున్నారు. 1964-65వ సంవత్సరంలో మరో 4 తరగతులను ప్రారంభించడానికి ప్రభుత్వం మంజూరీ ఇచ్చింది.


డన్‌లప్
ఎ. డి. వి. పరికరాలతో
ఎడ్ల బండ్లు
25%
వేగంగా
నడువగలవు
DUNLOP
ADV
డన్‌లప్
ఎ. డి. వి. పరికరాలు
ఇరుసుకు బిగించిన చక్రాలు
ఈ ఇరుసుకు రోలర్ బేరింగ్ హబ్‌లు,
చక్రాలకు న్యూమాటిక్ టైర్ల జత.
ప్రత్యేకమైన రోలర్ బేరింగ్ హబ్‌లు వున్నందున చక్రం వేగం
హెచ్చుతుంది. అంటే బండి ఎక్కువ వేగంగా నడుస్తుందన్నమాట. న్యూమాటిక్
టైర్లు వున్నందున రోడ్డుమీద గతుకులువున్న నునుపుపైనలె మెత్తగా
బండి పోతుంది. కాగా, బండివి లాగే ఎడ్లకు ఏమాత్రం కష్టం వుండదు.
అవన్నీగాక ఇనుప పట్టాలుగల బండ్లకంటె రెట్టింపు బరువును
మోయగలదు. అంతేగాక న్యూమాటిక్ టైర్లు కలిగివున్న బండి
రోడ్లను చెడగొట్టదు. కాగా, రోడ్ల మరమ్మత్తు ఖర్చు తగ్గిపోగలదు. న్యూఢిల్లీలోని భారతీయ వ్యవసాయ
పరిశోధనా కేంద్రం డన్‌లప్ ఎ. డి. వి. పరికరాలను పరీక్షించి ఆమోదించింది
డన్‌లప్
ADVC-16 79

సంగ్రహ ప్రకటనలు

ఆయిలు ఇంజన్లు, ఎలక్ట్రిక్ మోటారు పంపుసెట్లు

వ్యవసాయదారులు తక్కావీ పద్ధతిలో ఆయిలు ఇంజన్లు, ఎలక్ట్రిక్ మోటారు పంపుసెట్లు కొనుగోలు చేసేందుకై ఋణాలను మంజూరుచేసే పథకంక్రింద రూ 30 లక్షల వ్యయానికి యీ దిగువ సూచించిన విధంగా ప్రభుత్వం అనుమతించింది.

శ్రీకాకుళం — 1,27,500, విశాఖపట్టణం — 1,12 500, తూర్పుగోదావరి — రూ 52,500, పశ్చిమ గోదావరి — రూ 67,500, కృష్ణా — రూ 1,05,000, గుంటూరు — రూ 1,11 000, నెల్లూరు — రూ 3,15 000, కర్నూలు—రూ 1,71 000, అనంతపురం — రూ 2,85,000, కడప — రూ 2,77,500, చిత్తూరు — రూ 2,77,500, హైదరాబాదు — రూ 1,12,500 నిజామాబాదు — రూ 60 000, మెదక్ — రూ 1,12,500, మహబూబ్‌నగర్ — రూ 1 87, 500, నల్గొండ — రూ 2,16 000, వరంగల్లు — రూ 1,11,000 కరీంనగర్ — రూ 1,71 000, ఖమ్మం — రూ 82 500, ఆదిలాబాదు — రూ 45,000.

వరద బాధితులకు ప్రభుత్వ సహాయం

1964 సెప్టెంబరులో సంభవించిన వరదలకు గురి అయిన బాధితులకు సహాయం అందజేయడానికి వీలుగా అత్యవసరఖర్చుల నిమిత్తం ప్రభుత్వం కొంత మొత్తాన్ని పశ్చిమ గోదావరి, గుంటూరు, కృష్ణా, మహబూబునగరం జిల్లాకలెక్టర్ల అధీనంలో ఉంచిన విషయం తెలిసిందే. పై తెల్పిన ప్రాంతాలలో జరిగిన ప్రాణనష్టం, ఆస్తినష్టం వివరాలతో గూడిన వివిధ కలెక్టర్ల నివేదికలను ప్రభుత్వం పరిశీలించి బాధితులకు ఆర్థిక తదితర సహాయాలు ఇవ్వడానికి వీలుగా దిగువ తెల్పిన మరికొన్ని మొత్తాలను ప్రభుత్వం మంజూరు చేసింది. కృష్ణా— రూ 3 00,000, గుంటూరు — రూ 1,50,000 పశ్చిమ గోదావరి — 1,75,000, మహబూబునగర్ — రు 3,25,000.

ఇటీవల వరదలలో మృత్యువాతపడిన కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించడానికి వీలుగా దిగువ మొత్తాలను కలెక్టర్ల అధీనం చేశారు. కృష్ణా — రూ 1,000, పశ్చిమ గోదావరి — రూ 600, గుంటూరు — రూ 15,000, మహబూబునగర్ రూ 4,500.

వరదలు సంభవించిన రోజులలో బాధితులకు ఆహార పదార్థాలు ఉచితంగా సరఫరా చేయడానికి యిదివరకే ఖర్చుచేసిన దిగువ మొత్తాలనూ, వరదబాధితులైన నిర్వాసులకు ఇచ్చిన రొక్కం గ్రాంట్లను కూడా ప్రభుత్వం దిగువవిధంగా మంజూరు చేసింది. కృష్ణా — రూ 85 000, గుంటూరు రూ 50,000, మహబూబునగర్ — రూ 25,000 పశ్చిమ గోదావరి రూ 5,000.

తరచుగా వరదలు సంభవించే పల్లపు ప్రాంతాలలో నివసించే వ్యక్తులకు ఎగువ ప్రాంతాలలో అవసరమైతే తగిన స్థలాలను సేకరించి, పునరావాసం కల్పించాలని ప్రభుత్వం నిశ్చయించింది. ఇందు నిమిత్తం ప్రభుత్వం జిల్లాకలెక్టర్లకు దిగువ విధంగా మొత్తాలు మంజూరు చేసింది. పశ్చిమ గోదావరి రూ 5 00 000, గుంటూరు రూ 5 00,000, కృష్ణా రూ 5,00,000, మహబూబ్‌నగర్ రూ 20 000.

ఇటీవల సంభవించిన భారీ వర్షాలు వరదలవల్ల దెబ్బతిన్న గ్రామ చావుడీలకు మరమ్మతులు జరిపే నిమిత్తం ప్రభుత్వం, పశ్చిమగోదావరి, గుంటూరు జిల్లా కలెక్టర్లకు దిగువ విధంగా మొత్తాలు మంజూరు చేసింది. పశ్చిమ గోదావరి — రూ 5,000, గుంటూరు— రూ 50,000.

ఇటీవలి వరదలలో పశువులను కోల్పోయిన వారికి దిగువ విధంగా సబ్సిడీ, తక్కావీ ఋణాలు మంజూరు చేయడానికి కూడా ప్రభుత్వం నిశ్చయించింది. (అ) 5 ఎకరాల తరీ, 10 ఎకరాల ఖుష్కీ భూముల కంటే తక్కువ భూవసతి గలవారికి (ఇటీవలి వరదలలో పశువులు కోల్పోయినవారు) ఎక్కువలో ఎక్కువ రూ 500—ల వరకు మంజూరు చేయబడుతుంది. దీనిలోసగం మొత్తం సబ్సిడీగా, మిగతాసగం మొత్తం ఋణంగా పరిగణింప బడుతుంది (ఆ) 5 ఎకరాల తరీ, 10 ఎకరాల ఖుష్కీ భూముల కంటే ఎక్కువ భూవసతి గలవారికి (ఇటీవల వరదలలో పశువులు కోల్పోయినవారు)

ఎక్కువలో ఎక్కువ రూ 500 ల మొత్తం ఋణంగా మాత్రమే మంజూరు చేయబడుతుంది. ఈ మొత్తంలో సబ్సిడీ వుండదు.

ఈ నిర్ణయం మేరకు ప్రభుత్వం ఇటీవల వచ్చిన వరదలలో పశువులు కోల్పోయిన వ్యక్తులకు పైన పేర్కొన్న విధంగా ఋణాలు మంజూరు చేయడానికి గుంటూరు, కృష్ణా జిల్లా కలెక్టర్లకు దిగువ విధంగా మొత్తాలు ఇచ్చింది.

గుంటూరు – రూ 1,00,000, కృష్ణా – రూ 15,000.

పర్మిట్ల మంజూరీకి అధికార్లకు అధికారాలు

1964 సం. పు దక్షిణ రాష్ట్రాల (క్రమబద్ధమైన బియ్యం ఎగుమతి) ఉత్తరువులోని 3 వ క్లాజు క్రింద పర్మిట్లను మంజూరు చేయడానికి ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాలశాఖ డైరెక్టరుకు ఆంధ్రప్రభుత్వం అధికారాలను యిచ్చింది. పై ఉత్తరువులోని 4 వ క్లాజులోని IV వ సబ్‌క్లాజు క్రింద పర్మిట్లను తమ తమ అధికార పరిధుల్లో మంజూరు చేయడానికిగాను జిల్లా సరఫరా అధికార్లను, తాలూకా సరఫరా అధికార్లను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. అయితే తాలూకా సరఫరా అధికారి మంజూరు చేసే పర్మిటుక్రింద బియ్యం అయిదు క్వింటాలులకు మించి వుండదు. రెవెన్యూ ఇనస్పెక్టర్ల హోదాకు తక్కువగాని రెవెన్యూశాఖ అధికార్లకు, ఫుడ్ ఇనస్పెక్టరు హోదాకు తక్కువకాని పౌర సరఫరాల శాఖ అధికార్లకు, వాణిజ్య పన్నుల ఇనస్పెక్టరు హోదాకు తక్కువ కాని వాణిజ్య పన్నులశాఖ అధికార్లకు, మోటారు వాహనాల ఇనస్పెక్టరు హోదాకు తక్కువ కాని రవాణాశాఖ అధికార్లకు కూడా రాష్ట్రంలోని తమతమ అధికార పరిధుల్లో పై ఉత్తరువులోని 6వ క్లాజుక్రింద తమ అధికారాలను వినియోగించడానికిగాను ప్రభుత్వం అధికారాలను యిచ్చింది.

1964 సం.పు దక్షిణ రాష్ట్రాల (క్రమబద్ధమైన బియ్యం ఎగుమతి) ఉత్తరువులోని 3వ క్లాజుక్రింద పర్మిట్లను మంజూరు చేసే అధికారాన్ని హైదరాబాదు, నిజామాబాదు జిల్లా సరఫరా అధికార్లకు, కలెక్టర్లకు ప్రభుత్వం యిచ్చింది.

ఆంధ్ర ప్రదేశ్ ఆహార ధాన్యాల వర్తకుల లైసెన్సింగు ఉత్తరువు క్రింద అధికారాలను వినియోగించడానికి యిక్కడ పేర్కొన్న అధికార్లకు కూడా ప్రభుత్వం అధికారాలను అప్పగించింది. వారు: (1) డిప్యూటీ తహశీల్దారు హోదాకు తక్కువ కాని రెవెన్యూశాఖ తాలూకా పరిపాలనాధికారులందరూ (2) సహాయ వాణిజ్య పన్నుల అధికారి హోదాకు తక్కువకాని వాణిజ్య పన్నుల శాఖ తాలూకా పరిపాలనాధికారులందరూ (3) పోలీసుశాఖలో సబ్ ఇనస్పెక్టరు హోదాకు తక్కువకాని ఉద్యోగులందరూ.

పారిశ్రామిక అభివృద్ధి మండలి

ప్రభుత్వం యీ దిగువ వారిని ఆంధ్ర ప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి మండలి డైరెక్టర్లుగా ఏర్పాటు చేసింది.

శ్రీ వి. కె. రావు, ఐ. సి. ఎస్, పరిశ్రమలశాఖ ప్రత్యేక కార్యదర్శి (డిప్యూటీ ఛైర్మన్); శ్రీ ఎమ్. ఎ. అబ్బాసి, ఐ. ఎ. ఎస్. ఆర్థిక శాఖా కార్యదర్శి; శ్రీ బి. ప్రతాపరెడ్డి, ఐ. ఎ. ఎస్. వాణిజ్య, పరిశ్రమల శాఖా డైరెక్టరు; శ్రీ మద్ది సుదర్శనం; శ్రీ ఎస్. రామాచార్ శ్రీ రాజా రామేశ్వరరావు ఎం. పి. శ్రీ డి.సి. కితారి; శ్రీ భానుప్రసాద్; డా. జి. ఎస్ సిద్ధు, ప్రాంతీయ పరిశోధనశాల డైరెక్టరు (డైరెక్టర్లు).

మైకా ఇన్సులేషన్ ఇటికలు

మైకా ఇన్సులేషన్ ఇటికలు తయారుచేసే ఒక యంత్రాగారాన్ని గూడూరులో నెలకొల్పడానికి అనుమతి లభించింది.

హైద్రాబాదు వార్తావాహిని

స్వతంత్ర భారతంలో తొలిసారిగా భాషా రాష్ట్రాల ప్రాతిపదికపై ఆంధ్రప్రదేశ్ ఒక ప్రత్యేక రాష్ట్రంగా వెలువడడానికి పదేళ్ళకిందట ఎవరి ఆత్మార్పణ కారణమైనదో ఆ పొట్టి శ్రీరాములు జ్ఞాపక చిహ్నంగా ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవం జరిగిన నాడే అది మరింత సమంజసంగా, సమయోచితంగా అనిపించగలదు.

ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డి అధ్యక్షుడుగా వున్న పొట్టి శ్రీరాములు స్మారక నిధి సంఘం యీ ఏడాది నవంబరు ఒకటవ తేదీన ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఆ సందర్భంలో శ్రీ రాములు గారి త్యాగాన్ని ప్రశంసిస్తూ ముఖ్యమంత్రి, సమాచారశాఖా మంత్రి శ్రీ బి. వి. గురుమూర్తి, యితర ముఖ్య నాయకులూ జోహారులు అర్పించారు.

నాటకోత్సవాల్లో ఒక భాగంగా ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవాన్ని యీ ఏడాది ఆంధ్రప్రదేశ్ నాట్యసంఘం చక్కటి సాంస్కృతిక కార్యక్రమాలతో జరిపింది. ఈ ఉత్సవాలకు భారతీయ నాట్య సంఘం అధ్యక్షురాలు శ్రీమతి కమలాదేవి ప్రారంభోత్సవం చేసింది. ఈ సందర్భంలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ యీ ఏడాది ఉత్సవ కార్యక్రమాల్లో వసూలయిన మొత్తం వరదబాధితుల సహాయ నిధికి అందజేయబడటం పట్ల తమ ఆనందం వ్యక్తంచేశారు. వసూలయిన మొత్తం మొదటిదఫా చెల్లింపుకింద అక్కడికక్కడే రూ. 1750 ల చెక్కునొకదానిని శ్రీమతి రాఘవమ్మ బ్రహ్మానందరెడ్డికి అందజేయడం జరిగింది. ఔత్సాహిక సమాజాలవారూ, పెద్ద పెద్ద బృందాలవారూ ప్రదర్శించే పూర్తినిడివి నాటకాలుకూడా ఈ నాలుగురోజులపాటు జరిగే యీ ఉత్సవాల్లో వున్నాయి.

ఈ విధమైన ఉత్సవాల్లో ప్రదర్శనకు నాటకాల్ని ఎన్నికచేసేటప్పుడు ఎంతో జాగ్రత్త తీసుకోవడం అవసరమని శ్రీమతి కమలాదేవి తమ అధ్యక్షోపన్యాసంలో తెలియజేశారు. కలకత్తా నాటకోత్సవాలను గురించి ఉదహరిస్తూ, యీ నాటకోత్సవాలు ప్రారంభం కావడానికి నెలలకొద్దీ ముందుగానే సీట్లు రిజర్వు అయిపోతాయని, ఆ ఉత్సవాలలో ప్రదర్శింపబడే నాటకాల ఉన్నతస్థాయిపై ప్రజలకు వుండే నమ్మకమే యిందుకు కారణమని ఆమె వ్యక్తంచేశారు. ముందుముందు ఆంధ్రప్రదేశ్ నాటక సంఘం కూడా యీ మాదిరి ఉత్సవ కార్యక్రమాల్లో యింతటి పేరుప్రతిష్టల్ని సంతరించుకోగలదని తాను ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. ఈ సంఘం యీ ఏడాదే యిందుకు పూనుకుందనవచ్చు.

సాంస్కృతికరంగంలో చెప్పుకోదగ్గ మరొకటి రేడాబృందంవారి జానపద నృత్యప్రదర్శనలు. సంయుక్త అరబ్ రిపబ్లిక్‌నుండి వచ్చిన యీ బృందం నగరంలోని రవీంద్రభారతిలో నృత్య ప్రదర్శనలు యిచ్చింది. 1959 సం. లో మాత్రమే యిది స్థాపించబడినప్పటికీ యీ బృంద నాయకుడు శ్రీ రేడా శిక్షణలో దక్షతలో వందమంది కళాకారులుగల యీ బృందం గ్రామీణ ఈజిప్టును చక్కగా, హృద్యంగమంగా ప్రతిఫలింప జేయగల శక్తి సామర్థ్యాలనూ, తనప్రజల హృదయాన్ని, వారి ఆశయాలనూ వ్యక్తంచేయగల సమర్థతనూ సంతరించుకున్నది. నిజానికి ఈజిప్టులో పునరుద్ధరింప బడుతున్న జానపద నృత్యాలనూ, జానపద గేయాలనూ ప్రదర్శించాయి.

నెహ్రూ జన్మదినోత్సవంనాడు యేటా జరుపుకొంటుండే బాలలదినోత్సవం యీ ఏడాది విషాదవాతావరణంలో గడిచిపోయింది, పిల్లలంతా ఎగబడి, చుట్టూ చేరి, ఆడుకునే ఆ మూర్తి యీనాడు కరువయ్యింది. ఈ ఏడాది నెహ్రూ జన్మదినోత్సవ సందర్భంలో ఏర్పాటయిన ఉరేగింపులో బహుళ సంఖ్యలో పిల్లలు పాల్గొన్నారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్సులో యీ ఉత్సవానికి అధిక సంఖ్యలో విచ్చేశారు. ఈ సందర్భంలో గవర్నరు, శ్రీమతి పట్టంథానుపిళ్ళై బాలలను చాచా నెహ్రూ అంతటి ఆదర్శవాదులుగా రూపొందాలని ఆశీర్వదించారు.

నగరంలోని అనేక విద్యార్థి సంస్థలు,

సాంస్కృతిక సంస్థలు, సంఘాలు యీ ఉత్సవాన్ని జరుపుకొని నెహ్రూజీవితాన్ని, వారి కృషిని జ్ఞప్తికి తెచ్చుకుని స్మృతిపథంలో నిలుపుకున్నాయి. సికిందరాబాదులోని అంతర్జాతీయ యువకమండలి యీ సందర్భంలో దేహదార్ఢ్య పోటీలను ఏర్పాటు చేయగా అనేకమంది యువతీ యువకులు యీ పోటీల్లో పాల్గొన్నారు. నిజాం కాలేజిలోని సాలార్‌జంగ్ హాలులో యూత్ కాంగ్రెస్ అధ్వర్యం క్రింద ఏర్పాటైన సభలో మాజీ అర్థికమంత్రి మొరార్జీ దేశాయ్ నెహ్రూను గూర్చి ప్రసంగించారు. తమ ప్రసంగంలో నెహ్రూ ధైర్యసాహసాలే ఆయన ఆలోచనల్నీ, క్రియలనూ రూపుదిద్దాయని, స్వతంత్ర భారతావనికి ప్రజాస్వామ్యమూ, ప్రణాళికా బద్ధమైన ప్రగతి నెహ్రూ యిచ్చిన కానుకలని అన్నారు.

ఆంధ్రప్రదేశ్ ఎన్. సి. సి. వార్షికోత్సవం నవంబరు 15 వ తేదీన సికింద్రాబాదులోని పెరేడు గ్రౌండ్సులో జరిగింది. గవర్నరు వందనస్వీకారం చేశారు. ఎన్. సి. సి. సీనియర్ డివిజన్ వారు యీ సందర్భాన్ని పురస్కరించుకొని కృత్రిమ యుద్ధ ప్రదర్శన నొకదాన్ని ఏర్పాటు చేశారు. ఉత్తమ యూనిట్లుగా ఎన్నికైన వాటికి శ్రీమతి పట్టంథానుపిళ్ళె బహుమతులను పంచిపెట్టారు. గవర్నరుకు, యితర ప్రముఖులకు స్వాగతం పలికిన ఎయిర్ కమాండర్ కె. చాంద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో నిర్బంధ ఎన్. సి. సి. ప్రవేశపెట్టిన తరువాత యిప్పటి వరకు శీఘ్రతరంగా యిది పురోగమిస్తున్నదనీ, ఢిల్లీలో రిపబ్లిక్ దినోత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ తరపున వెళ్ళిన బృందం అక్కడ యిచ్చిన ప్రదర్శనను బట్టి దేశంలోని ఉత్తమమైనవాటిలో ఒకటిగా గుర్తింపబడినదనీ చెప్పారు. జాతీయ పెరేడులలో ఆ బృందానికి రెండు ద్వితీయ బహుమతులు, మూడు తృతీయ బహుమతులు వచ్చాయి. సికింద్రాబాదులో ఎన్. సి. సి. వారి ఊరేగింపు చాలా మనోహరంగా వుంది. ఎన్. సి. సి. వందనస్వీకారం చేసిన గవర్నరు దేశంలోని యువకుల్లో క్రమశిక్షణను కలిగించడంలోనూ, దేశసౌధాన్ని నిర్మించడంలోనూ, దాన్ని పరిరక్షించడంలోనూ, కులమతహద్దులను అధిగమించి యువకులు సన్నద్ధులయ్యేట్టు చేయడంలోనూ ఎన్. సి. సి. వహిస్తున్న పాత్రను కొనియాడరు.

దక్షిణ రాష్ట్రాల నాలుగు రాజధానీ నగరాలలో ఒక్కొక్క రోజు పాటు వుండే నిమిత్తం కేంద్ర ఆహార వ్యవసాయశాఖా మంత్రి శ్రీ సి. సుబ్రహ్మణ్యం నవంబరు 15 వ తేదీన హైదరాబాదుకు వచ్చారు. ఆహారధాన్యాలను సరఫరా చేస్తానని ఆంధ్రప్రదేశ్ యిచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోలేకపోయిన కారణంచేతనే కేరళలో ఆహారకొరత ఏర్పడిందన్న భయాన్ని ఆయన తొలగించివేశారు. ప్రత్యేకంగా ఆహారధాన్యాలను కొనిపోయే వేగన్లను ఏర్పాటు చేయడంలోని యిబ్బందులు యింకా యితర విషయాలే పూర్తిగా యిందుకు కారణమని వీరు సెలవిచ్చారు.

భవిష్యత్తులో ఒక రాష్ట్రం నుండి మరో రాష్ట్రానికి బియ్యాన్ని పంపించే పంపకాలు యిరురాష్ట్రాల ప్రభుత్వాల మధ్య జరగాలని కనీసం ఆహారధాన్యాల నిర్వహణకు సంబంధించినంతవరకు ప్రతి రాష్ట్రం ఒక ప్రత్యేక ఆహారమండలంగా పరిగణించబడాలని కేంద్ర ఆహారమంత్రి కోరికపై నవంబరు 17,18 తేదీలలో ఢిల్లీలో జరిగిన ముఖ్యమంత్రుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన కోరికను మిగతా రాష్ట్రాల ముఖ్యమంత్రులు అంగీకరించారు. ఢిల్లీ సమావేశం తీర్మానం ప్రకారం కలకత్తా, బెంగుళూరు నగరాలతోపాటు హైదరాబాదులో కూడా చట్టబద్ధమైన రేషనింగును ప్రవేశపెట్టడం జరుగుతుంది.

కేంద్రమంత్రి యిక్కడకు వచ్చినప్పుడు రాజధానీ నగరానికి గోధుమల సరఫరా విషయంలో తక్షణ చర్యలు తీసుకుంటున్నామని హామీ యిచ్చారు. నిజానికి అంతకు ముందురోజునే మద్రాసు నుంచి గోధుమలతో రెండు ప్రత్యేక వేగన్లు హైదరాబాదుకు బయలుదేరాయి.

ఈ శీతకాలంలో జరగబోయే శాసనసభ సమావేశంలో చతుర్థ పంచవర్ష ప్రణాళిక ముసాయిదాపై కూడా చర్చ జరుగుతుంది. భూకమతాలకు సంబంధించిన జాయంటు పట్టాలను విడదీసే బిల్లు ఒకటి ప్రవేశపెట్టనున్నట్టు శ్రీ ఎన్. రామచంద్రారెడ్డి తెలియజేశారు. ఈ బిల్లు ఆంధ్రప్రాంతంలో పదకొండు జిల్లాలకు అనువర్తిస్తుంది. అక్కడ మూడు లక్షల జాయింటు పట్టాలు ఉన్నట్టు అంచనా.

ప్రశ్నలు సమాధానాలు

శ్రీ ఇ. ఎల్. నరసింహారావు, పెంట్ల వారి గూడెం, పొలంపల్లి పి. ఒ; కృష్ణాజిల్లా.

ప్ర: మా ప్రాంతంలో సర్వే చేసి పొలాల్లో ఎన్. ఎస్. పి. అనే అక్షరాలున్న రాళ్ళను పాతి పెట్టారు. ఇవి ఎందుకు పాతిపెట్టారో తెలియజేయండి?

సమా: నాగార్జునసాగర్ ఆనకట్ట క్రింద ప్రధానకాలువ, లేదా ఉప కాలువ, లేదా పొలం కాలువ మార్గాన్ని ఎన్. ఎస్. పి. అక్షరాలున్న రాళ్లు సూచిస్తాయి.

శ్రీ చంద్రారెడ్డి. అంతారం, కొడంగల్ తాలూకా, మహబూబ్‌నగర్ జిల్లా.

ప్ర: శిస్తువసూలు కాలంలో కిస్తీగండి ప్రకటనను రైతుల ప్రయోజనార్థం పంచాయతీ కార్యాలయంలో గాని, రచ్చబండవద్దగాని ప్రజలకు కనిపించేట్టు పెట్టాలనే నియమమేమైనా ఉన్నదా ?

సమా: భూమిశిస్తు వసూలుకు సంబంధించిన ప్రకటన జాబితా ప్రతిని గ్రామ చావడి వద్ద గ్రామాధికారులు ఉంచడం అనేది చట్ట ప్రకారము వారు నెరవేర్చవలసిన బాధ్యత. ప్రతి రైతూ తాను ఎంత శిస్తు వసూలుచేయాలో అక్కడకు వెళ్ళి ఆ జాబితాలో సరిచూసుకునే హక్కు రైతుకు వున్నది. కాని పంచాయతీ కార్యాలయానికి యివ్వడానికి గాని, పంచాయతీ కార్యాలయంలో వేలాడగట్టడానికిగాని కేటాయింపేమీ లేదు.

శ్రీ పి. జనార్దనరెడ్డి. ఐజ, గద్వాల్ తాలూకా, మహబూబ్‌నగర్ జిల్లా

ప్ర: మా ప్రాంతంలోని సర్వేయర్లు రైతులచేత రాళ్ళను మోయించడమూ, వాటిని పాతిపెట్టించడమూ చేస్తున్నారు. ఈ విధమైన ఉత్తరువు ఏమన్నా వున్నదా ?

సమా: రాళ్ళను మోయడానికి గాని, వాటిని పాతడానికిగాని సర్వేయర్లు రైతుల సేవలను ఉపయోగించడం నిషిద్ధం. పట్టాలను మంజూరు చేయడానికికూడా వాళ్ళకు అధికారం లేదు.

రెవెన్యూ బోర్డువారికి యీ విషయమై వివరంగా తెలియపరచబడనందున ఏ చర్యలూ తీసుకోవడం జరగలేదు. ఏమయినప్పటికీ ఈ విషయాన్నీ, యింకా యితర విషయాలను రైతులకు తెలియపరచే అవకాశం ఏ మాత్రం లభించినా రెవెన్యూ శాఖ తాలూకు ఇనస్పెక్టింగ్ అధికారులు అన్ని గ్రేడులవారూ ఆ అవకాశాన్ని యిటుపై వినియోగించుకోగలరు.

సర్వే బృందానికి ఆధిపత్యం వహించే అధికారి దృష్టికి ప్రత్యక్ష సంఘటనలను తీసుకువస్తే ఆయన ఆయా అధికారులపై తగు చర్యలు తీసుకుంటారని పాఠకునికి తెలియజేయబడుతున్నది.

శ్రీ ఎస్. వెంకటస్వామి, జూరియల్, ఆత్మకూరు తాలూకా, మహబూబ్‌నగర్ జిల్లా.

ప్ర: కృష్ణానదిమీద జూరాల ప్రాజెక్టును గూర్చి వివరంగా తెలియజేయండి?

సమా: కృష్ణానదిమీద జలవిద్యుత్ ప్రాజెక్టును నిర్మించడానికిగల అవకాశాలను పరిశీలించే నిమిత్తం 1964 మార్చి నెలలో జూరాల గ్రామం వద్ద కృష్ణానదిపై ప్రాథమిక పరిశీలనలు కొనసాగాయి. విద్యుచ్ఛక్తిని అభివృద్ధి పరచే ఉద్దేశ్యంతోనే యీ పరిశోధనలు కొనసాగాయి. ఈ ప్రాజెక్టు క్రింద నీటి పారుదల సౌకర్యాన్ని కల్పించే ప్రతిపాదన ఏమీ లేదు. ఈ స్థితిలో ప్రాజెక్టును నిర్మించే తేదీని చెప్పడం సాధ్యం కాదు. పరిశీలనలు యింకా కొనసాగుతున్నందున ఇప్పుడు దీనికి ఎంత ఖర్చవుతుందో తేల్చి చెప్పడం వీలు పడదు.





ప్రసిద్ధ సంగీత విద్వాంసుని మరణం

ఆంధ్రప్రదేశ్ తొలి ఆస్థాన సంగీత విద్వాంసుడు పద్మశ్రీ ద్వారం వెంకటస్వామి నాయుడుగారు (71 సం.) నవంబరు 25 వ తేదీన హైదరాబాదులో స్వర్గస్థులయ్యారు.

"ద్వారం ఆంధ్రదేశానికే కాదు యావద్భారతానికే గర్వకారణమైన విద్వాంసులు. సంగీత సామ్రాజ్యంలో వీరి మరణంవల్ల ఏర్పడిన లోటు ఏ విధంగానూ భర్తీకాదు. ఆంధ్రప్రజల ప్రశంసల్నేకాదు, ఆదరాభిమానాలను సైతం చూరగొన్న వ్యక్తి. వీరి ఆత్మకు భగవంతుడు శాంతిని ప్రసాదించుగాక!" అని ముఖ్యమంత్రి తమ సంతాప ప్రకటనలో తెలియజేశారు.

ముఖ్యవార్తలు

రాష్ట్రంలో

అక్టోబరు 23: విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు, విద్యావేత్తల సమావేశాన్ని ముఖ్యమంత్రి హైద్రాబాద్‌లో ప్రారంభించారు.

నవంబరు 3: "యునెస్కో" అధ్వర్యంలో జరిగిన ప్రాచీన కళాఖండాల అంతర్జాతీయ సేకరణోద్యమాన్ని హైద్రాబాదులో గవర్నరు ప్రారంభించారు.

నవంబరు 6: విజయవాడ టాక్సీ డ్రైవర్ల సంఘానికి ముఖ్యమంత్రి ప్రారంభోత్సవము జరిపారు.

నవంబరు 7: అఖిల భారత కాంగ్రెసుమహాసభలు గుంటూరు నెహ్రూనగర్‌లో ప్రారంభమయ్యాయి.

నవంబరు 9: నిజామాబాదులో మహిళా కళాశాల భవన నిర్మాణానికి గవర్నరు శంకుస్థాపన చేశారు.

నవంబరు 14: చంచల్‌గూడలో ప్రభుత్వ ముద్రణశాల క్రొత్త భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి పునాదిరాయి వేశారు.

గవర్నరు, హైద్రాబాదులో ఖాదీకార్యకర్తల మహాసభను ప్రారంభించారు.

నవంబరు 16: సంయుక్త అరబ్ రిపబ్లిక్ సాంస్కృతిక బృందంవారు హైద్రాబాదుకు విచ్చేశారు.

భారతదేశంలో

అక్టోబరు 24: పౌరసత్వం లేని భారతీయ సంతతికి చెందిన వ్యక్తుల భవితవ్యాన్ని గురించి చర్చించడానికి భారత, సింహళ దేశాల ప్రధాన మంత్రుల మధ్య న్యూ ఢిల్లీలో సంభాషణలు ప్రారంభమయ్యాయి.

అక్టోబరు 26: న్యూఢిల్లీలో జరిగిన రాష్ట్ర ముఖ్యమంత్రులు, ఆహార మంత్రుల సమావేశంలో ప్రధాన మంత్రి ప్రసంగించారు.

అక్టోబరు 27: జాతీయాభివృద్ధి మండలి సమావేశం న్యూఢిల్లీలో ప్రారంభమైంది.

అక్టోబరు 28: అఖిల భారత ఖాదీ, గ్రామీణ పరిశ్రమల సంస్థ మాజీ అధ్యక్షుడు శ్రీ వి. ఎల్. మెహతా బొంబాయిలో స్వర్గస్థు లయ్యారు.

అక్టోబరు 29: కేంద్ర పరిశ్రమలు, సరఫరా శాఖల మంత్రి శ్రీ హెచ్. సి. దాసప్ప న్యూఢిల్లీలో దివంగతు లయ్యారు.

నవంబరు 5: అక్రమ విధానాల నవలంబించే వర్తకులపై, ప్రభుత్వోద్యోగులపై తక్షణమే విచారణ సాగించడాన్ని ఉద్దేశించే అత్యవసర పదార్థాల (సవరణ) ఆర్డినెన్సును జారీ చేశారు.

టుంటి కోరిన్‌లో హార్బరు ప్రాజెక్టు నిర్మాణానికి ప్రధాని ప్రారంభోత్సవం జరిపారు.

నవంబరు 9: మహారాష్ట్ర గవర్నరుగా డాక్టర్ పి. వి. చెరియన్, మధ్యప్రదేశ్ గవర్నరుగా శ్రీ కె. సి. రెడ్డి గారల నియామకం జరిగింది.

అంతర్జాతీయ ప్రామాణీకరణలసంస్థ ఆరవ త్రైవార్షిక మహాసభను ఉపరాష్ట్రపతి ప్రారంభించారు.

నవంబరు 12: కిరిబురు ఇనుము ప్రాజెక్టుకు ఉపరాష్ట్రపతి ప్రారంభోత్సవం చేశారు.

చక్కెర ఎక్స్‌ఫ్యాక్టరీ కొత్త ధరలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

నవంబరు 14: న్యూఢిల్లీ తీన్ మూర్తి గృహంలో నెహ్రూ స్మారక వస్తు ప్రదర్శనశాలకు రాష్ట్రపతి ప్రారంభోత్సవం చేశారు.

"జవహర్‌లాల్ నెహ్రూ" స్మారక నాణాలను ప్రధానమంత్రి విడుదల చేశారు.

అంతర్విశ్వవిద్యాలయాల తొమ్మిదవ యువజనోత్సవాలను న్యూఢిల్లీలో ప్రధాని ప్రారంభించారు.

నవంబరు 15: బొంబాయి ఆంధ్ర విద్యా సంఘం నూత్న పాఠశాలా భవనానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు.

నవంబరు 16: న్యూఢిల్లీలో ప్రపంచ శాంతి అంతర్జాతీయ సహకార వ్యవహారాల మహాసభ ప్రారంభమైంది.

పార్లమెంటు శీతాకాల సమావేశం ఆరంభమైంది.

కృష్ణా, గోదావరి, గుంటూరుజిల్లాలలోవరదలనునిరోధించేందుకుసమగ్రప్రణాళికను

సూచించడానికి శ్రీ ఏ. సి. మిత్రా అధ్యక్షతను ఆరుగురు సభ్యులతో కూడిన ఒకనిపుణుల సంఘాన్ని కేంద్రప్రభుత్వం నియమించింది.

విదేశాలలో

అక్టోబరు 23 : ఒలింపిక్ హాకీ స్వర్ణ పతకాన్ని భారతదేశం తిరిగి గెలుచుకున్నది.

అక్టోబరు 24 : ఉత్తర రొడీషియా, జాంబియా స్వతంత్ర రిపబ్లిక్‌గా అవతరించింది.

నవంబరు 2 : ఫైసల్ రాకుమారుని, సౌదీ అరేబియా రాజుగా ప్రకటించారు.

నవంబరు 4 : అమెరికా 36వ అధ్యక్షుడుగా శ్రీ లిండన్ బి. జాన్సన్ ఎన్నిక అయ్యారు.

నవంబరు 9 : జపాను ప్రధానమంత్రిగా శ్రీ ఇసాకోసాటో పదవీ ప్రమాణ స్వీకారం చేశారు.

నవంబరు 13 : గుండెకాయల తొలి శస్త్ర వైద్యుడు సర్ హెన్రీసౌట్టర్ లండన్‌లో దివంగంతు లయ్యారు.

నవంబరు 15 : సూడాన్ అధ్యక్షుడు జనరల్ ఇబ్రహీం అబ్బౌద్ తమ పదవికి రాజీనామా చేసి. నూతనంగా ఏర్పడిన పౌర మంత్రిమండలికి రాజ్యాధికారాలను దత్తం చేశారు.

'అప్సరస'లో ఒక్కరోజు

హైదరాబాదు యాత్రికునికి 'అప్సరస'లో
ఒకరోజు మర్చిపోని అనుభూతి

అది అతనిని

గోల్కొండకోట	ఉస్మాన్‌సాగర్
చార్‌మినార్	సాలార్జంగ్ మ్యూజియం
పబ్లిక్‌గార్డెన్స్	ఉస్మానియా విశ్వవిద్యాలయం

మొదలయిన స్థలాలకు తీసుకొని వెళ్తుంది.

శుక్రవారం మినహా ప్రతిరోజూ పర్యటించవచ్చు

సాలార్జంగ్ మ్యూజియం

ప్రవేశరుసుముతో సహా

రూ. 6-50 పై. మాత్రమే

రిజర్వేషన్లు చేయించుకోవలసిన స్థలము - అప్సరస బయలుదేరు స్థలము :

రాష్ట్ర సమాచార కేంద్రం, సమాచార పౌర సంబంధాల శాఖ

గాంధీభవనం ఎదుట, హైద్రాబాదు.

ఫోను నం. 43281 మరియు 43282


ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా కార్పొరేషన్

హైద్రాబాదు నుంచి దూరప్రదేశాలకు వెళ్ళి వచ్చే ఎక్స్‌ప్రెస్ బస్సుల వేళలు


* డీలక్స్

స్థలం	బయలుదేరే సమయం		చేరుకునే సమయం		
విజయవాడ—I	ఉదయం	8–30 గం.	ఉదయం	6–00 గం.	*
,, సూర్యాపేట మార్గంగా—II	రాత్రి	10–00 గం.	సాయంత్రం	3–30 గం.	*
గుంటూరు–విజయవాడ మార్గంగా	రాత్రి	10–00 గం.	ఉదయం	6–00 గం.	*
ఏలూరు	ఉదయం	10–30 గం.	సాయంత్రం	5–30 గం.	*
నెల్లూరు	రాత్రి	9–00 గం.	ఉదయం	5–15 గం.	
కర్నూలు	ఉదయం	7–30 గం.	రాత్రి	8–30 గం.	
కర్నూలు	సాయంత్రం	4–00 గం.	ఉదయం	10–30 గం.	
కడప	ఉదయం	10–30 గం.	సాయంత్రం	6–30 గం.	
అనంతపురం	మధ్యాహ్నం	12–00 గం.	సాయంత్రం	3–40 గం.	
మచిలీపట్నం—I	మధ్యాహ్నం	12–30 గం.	రాత్రి	8–30 గం.	
మచిలీపట్నం—II	రాత్రి	9–00 గం.	ఉదయం	5–30 గం.	
తెనాలి–విజయవాడ మార్గంగా—I	రాత్రి	9–00 గం.	ఉదయం	5–30 గం.	
తెనాలి–విజయవాడ మార్గంగా—II	ఉదయం	8–45 గం.	సాయంత్రం	4–30 గం.	
ఒంగోలు	రాత్రి	9–00 గం.	ఉదయం	5–15 గం.	
భీమవరం	ఉదయం	6–30 గం.	సాయంత్రం	6–50 గం.	
నర్సాపూర్	రాత్రి	8–00 గం.	ఉదయం	7–15 గం.	
కరీంనగర్	ఉదయం	7–30 గం.	రాత్రి	7–50 గం.	
వరంగల్—I	ఉదయం	5–30 గం.	ఉదయం	7–00 గం.	
వరంగల్—II	ఉదయం	6–30 గం.	రాత్రి	9–10 గం.	
కొత్తగూడెం	మధ్యాహ్నం	1–45 గం.	రాత్రి	9–00 గం.	
రాయచూర్	ఉదయం	11–00 గం.	మధ్యాహ్నం	1–30 గం.	
ఆదిలాబాదు–డిచ్‌పల్లి మార్గంగా—I	ఉదయం	6–00 గం.	మధ్యాహ్నం	1–30 గం.	
ఆదిలాబాదు–నిజామాబాదు మార్గంగా—II	మధ్యాహ్నం	12–00 గం.	రాత్రి	8–30 గం.	
నాగార్జునసాగర్—I	సాయంత్రం	4–00 గం.	ఉదయం	10–20 గం.	
నాగార్జునసాగర్—II	ఉదయం	5–30 గం.	సాయంత్రం	6–40 గం.	
కాకినాడ	రాత్రి	7–45 గం.	ఉదయం	6–00 గం.	

ఎయిర్ కండిషన్ కోచ్ "అప్సరస"



కోచ్ లోపలిభాగం



యువ

జనవరి సంచిక

మాయావిని - డిటెక్టివు సంక్షిప్తనవల

ముప్పాళ రంగనాయకమ్మగారి - అమ్మ

యతీంద్రమోహనసింహాగారి - సంధి

రంగధామ్‌గారి - సన్మానం

ఇవిగాక ఇంకా యితర కథలూ మామూలు శీర్షికలతో డిశంబరు 20కి విడుదల అవుతుంది.


చందా వివరాలు

సాలుచందా	12-00
సాలుచందా దీపావళి ప్రత్యేక సంచికతో సహా	16-00
రెండు సంవత్సరముల చందా (దీపావళి ప్రత్యేక సంచికతో)	30-00

యువ కార్యాలయము

పబ్లిక్ గార్డెన్ రోడ్, హైదరాబాద్-1

Edited & Published by the Director of Information and Public Relations, Andhra Pradesh, Hyderabad-1.
Printed at YUVA PRESS, Public Garden Road, Hyderabad.



Regd. No. H. 133